సమావేశము - IX
వాల్యూము - I
నెం. 1

వెల : రూ. 29-00
19 మార్చి, 2018
సోమవారం,
(శక సం. 1940,
చైత్ర శు- 2)

# తెలంగాణ శాసన పరిషత్తు కార్యకలాపాలు

## అధికార నివేదిక

విషయ సూచిక


I. ప్రశ్నోత్తరాలు : ... 1

ప్రకటన - కళ్యాణలక్ష్మి/షాదీముబారక్ పథకాల గురించి ప్రభుత్వ ప్రకటన

II. సభా కార్యక్రమం : ... 18

ప్రత్యేక ప్రస్తావనలు

పిటిషన్స్

III. సభా సమక్షంలో ఉంచబడిన పత్రాలు ... 18

IV. సభా కార్యక్రమం : ... 18

2018 -2019 సంవత్సరపు వార్షిక ఆదాయ - వ్యయ పట్టిక (బడ్జెట్) పై మొదటి రోజు సాధారణ చర్చ

# తెలంగాణ శాసన పరిషత్తు

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| ఛైర్మన్ | : | శ్రీ కె. స్వామి గౌడ్ |
| డెప్యూటీ ఛైర్మన్ | : | శ్రీ నేతి విద్యాసాగర్ |
| కార్యదర్శి | : | డా. వి. నరసింహాచార్యులు |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ ఎస్. దుర్గా ప్రసాద్ |
| | | శ్రీ సి.హెచ్. ఉపేందర్ రెడ్డి |
| | | శ్రీమతి వి.ఎస్. ప్రసన్నకుమారి |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ బి. కమలాకర్ |
| | | శ్రీమతి అలివేలు |
| | | శ్రీ ఎమ్. కృపాకర్ రావు |
| | | శ్రీమతి బి. ప్రమీల |
| | | శ్రీమతి యస్. నాగమణి |
| | | శ్రీ డి. శ్రీనివాసులు |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ కె. భాస్కర శ్రీనివాస్ |

# తెలంగాణ శాసన పరిషత్తు కార్యకలాపాలు

## అధికార నివేదిక

## (తొమ్మిదవ సమావేశము – నాల్గవ రోజు)

## సోమవారం, మార్చి 19, 2018

(సభ ఉదయం 10.00 గంటలకు ప్రారంభమైనది)

(గౌరవ ఛైర్మన్ అధ్యక్ష స్థానం వహించారు)

**మిస్టర్ ఛైర్మన్:–** ముందుగా గౌరవ సభ్యులందరికీ, అధికారులకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. మొన్న అసెంబ్లీలో ఉమ్మడి సమావేశాల సందర్భంగా జరిగిన సంఘటనలో నేను గాయపడిన సందర్భంగా గవర్నర్ గారు, రాష్ట్రముఖ్యమంత్రి గారు, మంత్రివర్గ సహచరులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పార్టీ కార్యకర్తలు, మీడియా సిబ్బంది, తెలంగాణ రాష్ట్ర ప్రజానీకం, అన్ని రాజకీయ పార్టీల నాయకులు జరిగిన సంఘటన పట్ల బాధను వ్యక్తం చేస్తూ, నన్ను పరామర్శించారు. ఆ పరామర్శల వల్ల నేను మనోస్థైర్యం, మనోబలం పొంది త్వరగా కోలుకోవడానికి అవకాశం కలిగిందని తెలియజేస్తూ, మరొకసారి మీ అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఇక సభా కార్యక్రమంలోకి వెళదాం. నౌ, క్వశ్చన్ అవర్.

### ఉన్నతీకరించబడిన భాషా పండితుల పోస్టుల కొరకు పదోన్నతులు

ప్రశ్న నెం.2573(21)

సర్వశ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి, కాటేపల్లి జనార్ధన్ రెడ్డి మరియు పూల రవీందర్, ఎమ్మెల్సీలు:– గౌరవనీయులైన ఉప ముఖ్యమంత్రి(విద్యా శాఖ) గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) తెలంగాణ రాష్ట్రంలో అప్‌గ్రేడ్ చేసిన భాషా పండితుల పదవుల సంఖ్య ఎంత;

ఆ) ఈ విషయంలో నిర్దిష్ట మార్గదర్శకాల వివరాలేమిటి;

ఇ) అప్‌గ్రేడ్ చేసిన భాషా పండితుల పదవులలో అర్హత గల టీచర్లకు పదోన్నతి కల్పించడానికి తీసుకోదలచిన చర్యలేమిటి;

ఈ) పదోన్నతులను కల్పించే ప్రక్రియను ఎప్పటిలోగా పూర్తి చేయడమవుతుంది?

**గౌరవనీయులైన ఉప ముఖ్యమంత్రి(విద్యా శాఖ) (శ్రీ కడియం శ్రీహరి):–** అ) రాష్ట్రంలో 2487 భాషా పండితులను స్కూలు అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేయడానికి అనుమతి మంజూరు చేస్తూ 3.2.2017 తేదీ గల ఆర్థిక (హెచ్ ఆర్ ఎం. II) శాఖ, జీఓఎంఎస్ నెం.17 ద్వారా ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది.

ఆ)తదుపరి, 23.1.2009 తేదీ గల పాఠశాల విద్య(సర్వీసులు. II) శాఖ, జీఓఎంఎస్ నెం.11, 12 ప్రకారం ప్రస్తుతమున్న భాషా పండితులను వారి సీనియారిటీ, అర్హతలననుసరించి స్కూలు అసిస్టెంట్లుగా విలీనం చేసుకోవడం ద్వారా రాష్ట్రంలోని 2487 భాషా పండితులను స్కూలు అసిస్టెంటు (భాషలు)గా అప్‌గ్రేడ్ చేయడం కోసం 3.2.2017 తేది గల ఆర్థిక(హెచ్‌ఆర్‌ఎం. II) శాఖ, జి.ఓ.ఎం.ఎస్.నెం.18 ద్వారా ప్రభుత్వం మంజూరునిచ్చింది.

ఇ) అండ్ ఈ) ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా కొంతమంది ఎస్‌జిటిలు డబ్ల్యుపి నెంబర్లు 10061/2017, 10200/2017, 10248/2017 ద్వారా గౌరవ హైకోర్టును ఆశ్రయించారు. నియామక నియమావళిని సవరించే వరకు స్కూలు అసిస్టెంటు(భాషలు) పదవులను భర్తీ చేయవద్దని 24.3.2017 తేదీన గౌరవ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది.

**శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి (ఉపాధ్యాయుల నియోజకవర్గం – మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ మరియు కరీంనగర్):–** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉన్నప్పటి నుంచీ ఈ డిమాండ్ కొనసాగుతూ వస్తోంది. భాషా పండితులకు చాలా సంవత్సరాల నుంచి ప్రమోషన్ అవకాశాలు లేవనే ఉద్దేశ్యంతో కొన్ని పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలనే డిమాండ్ ఉంటోంది. రాష్ట్ర విభజన చేసినపుడు ఆంధ్రప్రదేశ్‌లో 13

జిల్లాలు, తెలంగాణాలో 10 జిల్లాలున్నాయి, అయినప్పటికీ భాషా పండితులకు ప్రమోషన్స్ ఇవ్వాలనే ఉద్దేశ్యంతో మన రాష్ట్ర ప్రభుత్వం ఎక్కువ పోస్టులు మంజూరు చేయడం జరిగింది. మంజూరు చేసిన పోస్టులను అర్హత కలిగిన భాషా పండితులతో భర్తీ చేయాలని నిర్ణయించడం జరిగింది. భాషా పండితులకు ప్రమోషన్స్ లేవు కనుక వాళ్లకి తక్షణమే పదోన్నతులు కల్పించాలనే సదుద్దేశ్యంతో కొన్ని పోస్టులను అప్‌గ్రేడ్ చేశారు. కానీ కొంత మంది కోర్టుకు వెళ్లడం వల్ల న్యాయపరమైన చిక్కులు వచ్చాయి. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా గౌరవ ముఖ్యమంత్రిగారు మాట్లాడుతూ – త్వరలోనే న్యాయ సలహాలు తీసుకొని సమస్యను పరిష్కారం చేసి భాషా పండితులకు ప్రమోషన్స్ కల్పిస్తామనే మాట చెప్పారు. అదే విధంగా గౌరవ ఉప ముఖ్యమంత్రి(విద్య)గారు సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి, భాషా పండితుల అంశంపై న్యాయ సలహాలు తీసుకొని తక్షణమే వాళ్లకి ప్రమోషన్స్ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఆ మేరకు త్వరగా చర్యలు తీసుకొని ప్రమోషన్స్ ఇవ్వాలని వాళ్లు కోరుతూ వస్తున్నారు. దానికి అనుగుణంగా చర్యలు తీసుకొని, తక్షణమే డి.పి.సి. ఏర్పాటు చేసి వారికి ప్రమోషన్స్ కల్పించాలన్నది డిమాండ్.

**శ్రీ కాటేపల్లి జనార్ధన్ రెడ్డి (ఉపాధ్యాయుల నియోజకవర్గం – మహబూబ్‌నగర్, రంగారెడ్డి మరియు హైదరాబాద్)**:– అధ్యక్షా, 2009లో పెద్ద మొత్తంలో ఆర్.ఎం.ఎస్.ఏ. ద్వారా పోస్టులన్నీ అప్‌గ్రేడ్ చేయడం జరిగింది. ఆనాటి ప్రభుత్వం భాషా పండితుల్లో గ్రేడ్–2 అయినా, గ్రేడ్–I అయినా ఒకే బోధన చేస్తారు, ఒకే క్వాలిఫికేషన్ కలిగి ఉంటారనే ఉద్దేశ్యంతో, భాషా పండితుల మీద వివక్షతతో భాషా పండితుల పోస్టులను స్కూల్ అసిస్టెంట్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేయకపోవడం వల్ల చాలా ఇబ్బంది ఏర్పడింది. ఆనాడు ఉపాధ్యాయ సంఘాల పోరాటాల మూలంగా నామమాత్రంగా ఒక 1500 పోస్టులను అప్‌గ్రేడ్ చేయడం జరిగింది.

భాషా పండితుల ప్రమోషన్స్ విషయంలో ఇబ్బంది ఏర్పడుతోందనే ఉద్దేశ్యంతో గౌరవ ముఖ్యమంత్రిగారు, గౌరవ ఉప ముఖ్యమంత్రి గారు చొరవ తీసుకొని, వారికి జరిగిన అన్యాయాన్ని సరిజేయాలనే ఒక మంచి ఉద్దేశ్యంతో 2487 భాషా పండితులను అప్‌గ్రేడ్ చేయడం జరిగింది. అదే విధంగా 1047 వ్యాయామ ఉపాధ్యాయులను కూడా అప్‌గ్రేడ్ చేయడం జరిగింది. కానీ దురదృష్టవశాత్తు కొంత మంది అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ కోర్టుకెళ్లడం జరిగింది. నియామక నియమావళి లేదు కాబట్టి, వాటిని రూపొందించిన తర్వాతే అప్‌గ్రేడేషన్, ప్రమోషన్స్‌కి కౌన్సిలింగ్ జరపాలని హైకోర్టు తెలియజేయడం వల్ల ప్రాసెస్ ఆగిపోయింది. స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంటులో ఉమ్మడి సర్వీసు రూల్స్ లేకపోవడమన్నది ఎంఇఓ, భాషా పండితుల పోస్టులు అప్‌గ్రేడేషన్ జరగకపోవడానికి మూల కారణమవుతోంది. గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మాట్లాడుతూ – భాషా పండితుల పోస్టులు ఇంకా ఎన్ని అవసరం ఉన్నాయో వాటిని మంజూరు చేసి, వారి సమస్యను పరిష్కారం చేద్దామని చేసిన ప్రకటన విషయం మనందరికీ తెలిసిందే. గ్రేడ్–2 భాషా పండితుల పోస్టులను రద్దు చేసి, ఉన్నత పాఠశాలల్లో ఉన్న భాషా పండితుల పోస్టులన్నింటినీ స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు అప్‌గ్రేడ్ చేస్తే దీనికి పరిష్కార మార్గం దొరికే అవకాశం ఉంటుంది. పోస్టులను అబాలిష్ చేస్తే ఆటోమేటిక్‌గా వాళ్లను స్కూల్ అసిసెంట్లుగా ప్రమోట్ చేసే అవకాశం ఉంటుంది. ఉమ్మడి సర్వీసు రూల్స్ విషయంలో కోర్టు స్టేను వెకేట్ చేయించినట్లయితే విద్యా శాఖలో సమస్య పరిష్కారం అవుతుంది. ఉన్నత పాఠశాలల్లో ఇంకా ఎన్ని పోస్టులు అవసరమో ఆమేరకు పోస్టులను అప్‌గ్రేడ్ చేసే విధంగా చర్యలు చేపట్టాలని మీద్వారా కోరుతున్నాను.

**శ్రీ కడియం శ్రీహరి**:– అధ్యక్షా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గౌరవ ముఖ్యమంత్రి గారు విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలని ఆలోచించడం జరిగింది. ప్రభుత్వ విద్యా వ్యవస్థ పటిష్టం కావాలంటే పర్యవేక్షణ కూడా ఉండాలి, దానికి సంబంధించిన ఇన్‌స్పెక్టింగ్ ఆఫీసర్ పోస్టులను కూడా భర్తీ చేయాలనే ఆలోచనతో, అనేక సంవత్సరాలుగా ఏ రకమైన పరిష్కారానికి నోచుకోని ఉమ్మడి సర్వీసు సర్వీసు రూల్స్‌కి సంబంధించిన అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దగ్గరకు తీసుకెళ్లి, కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి, రాష్ట్రపతి ఆమోదాన్ని కూడా పొంది యూనిఫైడ్ సర్వీసు రూల్స్‌ని టేకప్ చేయడానికి అనుమతి తెచ్చుకోవడం జరిగింది. ఇక్కడ ఉపాధ్యాయుల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడం, మేనేజ్‌మెంట్స్ వారీగా లోకల్ బాడీస్ స్కూల్స్, గవర్నమెంట్ స్కూల్స్‌కు సంబంధించి సర్వీసు రూల్స్‌లో కొన్ని తేడాలు ఉండడం వల్ల గవర్నమెంటు స్కూల్స్‌లో పని చేస్తున్న టీచర్స్ ఎవరైతే ఉన్నారో వాళ్లు ఈ ఉమ్మడి సర్వీసు రూల్స్‌కి వ్యతిరేకంగా కోర్టుకెళ్లడం, కోర్టు దానిపై స్టే కూడా ఇవ్వడం జరిగింది. ఇదొక అంశం.

రెండో అంశం ఏమంటే – తెలంగాణ రాష్ట్రంలో తెలుగు భాషను ప్రోత్సహించాలని, తెలుగు భాషకి పూర్వ వైభవం తీసుకురావాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న

కార్యక్రమంలో భాగంగా ఈ భాషా పండితులను స్కూల్ అసిస్టెంట్స్‌గా అప్‌గ్రేడ్ చేయాలనే ఒక విధానపరమైన నిర్ణయం కూడా తీసుకోవడం జరిగింది. వీరితోబాటు పిఇటిలను కూడా స్కూల్ అసిస్టెంట్స్‌గా అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించడం జరిగింది. ల్యాంగ్వేజ్ పండిట్స్‌ను స్కూల్ అసిస్టెంట్స్ ఇన్ ల్యాంగ్వేజెస్‌గా, పిఇటిలను స్కూల్ అసిస్టెంట్స్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌గా అప్‌గ్రేడ్ చేయాలని, ఆ మేరకు ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది. దీంట్లో కూడా ఎస్‌జిటిలు, ఎంఏ(తెలుగు) చేసిన వారు ఎవరైతే ఉన్నారో వాళ్లంతా – మాకు కూడా అర్హత ఉన్నది కాబట్టి ఆ పోస్టులకు మమ్మల్ని కూడా అప్‌గ్రేడ్ చేయాలని, సర్వీసు రూల్స్‌లో ఆవిధంగా చేయడానికి అవకాశం ఉంది కాబట్టి మమ్మల్ని కూడా అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ వాళ్లంతా హైకోర్టును ఆశ్రయించడం జరిగింది. హైకోర్టు తమ ఇంటెరిమ్ ఆర్డర్‌లో – రిక్రూట్‌మెంటు రూల్స్ మార్చకుండా ఈ అప్‌గ్రేడేషన్ ప్రాసెస్ టేకప్ చేయడానికి అవకాశం లేదు, కాబట్టి అప్పటి వరకు దీన్ని ఆపమన్నారు.

యూనిఫైడ్ సర్వీసు రూల్స్ వస్తే, వాటిల్లో ఈ రిక్రూట్‌మెంటు రూల్స్, సర్వీసు రూల్స్ ఏవైతే మనం సవరణ చేయాలని అనుకుంటున్నామో అవన్నీ ఇన్‌కార్పోరేట్ చేసి, కొత్తగా సర్వీసు రూల్స్ తీసుకురావాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఈ రెండు అంశాలు కోర్టులో ఉన్నాయి. నేను మొన్న అసెంబ్లీలో చెప్పాను, ఈరోజు కౌన్సిల్‌లో కూడా చెబుతున్నాను. మా ముగ్గురు ఉపాధ్యాయ ఎమ్మెల్సీలతో, అదే విధంగా అడ్వకేట్ జనరల్‌తో మాట్లాడి, త్వరితగతిన కోర్టులో ఉన్న కేసులకు పరిష్కారం కనుక్కొని, ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా ఈ ల్యాంగ్వేజ్ పండిట్స్‌ని అప్‌గ్రేడ్ చేస్తామని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. ప్రభుత్వపరంగా ల్యాంగ్వేజ్ పండిట్స్‌కి అప్‌గ్రేడేషన్ ఇవ్వాలనే కమిట్‌మెంటుతో ఉన్నాం. ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధిని శంకించవలసిన అవసరం లేదు. నేను వెంటనే ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి, ఈ లీగల్ లిటిగేషన్ లేకుండా ఏవిధంగా చేయాలో చర్చిద్దాం. ఇంతకు ముందు జనార్థన్ రెడ్డిగారు ప్రత్యామ్నాయ మార్గాల గురించి చెప్పారు. వాటిని కూడా పరిశీలించి ఒక నిర్ణయం తీసుకుంటామని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

**శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డిః–** అధ్యక్షా, అప్‌గ్రేడేషన్ వేరు, పదోన్నతి వేరు. సీనియారిటీ ప్రకారమే అప్‌గ్రేడేషన్ చేశామని మంత్రిగారు తన సమాధానంలో చెప్పారు. సీనియారిటీ ప్రకారంగా అప్‌గ్రేడేషన్ ఇచ్చినట్లయితే వాళ్లకి కొంత ఆర్థిక వెసులుబాటు కలిగే అవకాశం ఉంది. ప్రమోషన్స్ విషయం ఎలాగూ లిటిగేషన్‌లో ఉంది కాబట్టి, ప్రమోషన్స్‌తో సంబంధం లేకుండా వీళ్లకి తాత్కాలికంగా ఆర్థిక ప్రయోజనం కలిగేలా మీరు అన్నట్లుగానే అప్‌గ్రేడేషన్ చేయండి. సీనియారిటీ ప్రకారం అప్‌గ్రేడేషన్ చేయడానికి అవకాశం ఉంటుంది. మేము కోరేది అదే. వారికి ఆర్థికంగా ప్రయోజనం చేకూరేలా ఉండాలి. పోస్టులను మంజూరు చేశాం, సీనియారిటీ ప్రకారం అప్‌గ్రేడ్ చేస్తామని మనమే కమిట్ అయ్యాం. సీనియారిటీ ప్రకారమే అప్‌గ్రేడ్ చేయండి. అప్‌గ్రేడ్ చేసిన తర్వాత అప్పుడు ప్రమోషన్ విషయం వస్తుంది. కాబట్టి ముందు ఆవిధంగా అప్‌గ్రేడేషన్ చేయాలని మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ కడియం శ్రీహరిః–** అధ్యక్షా, నేను ఇంతకు ముందే చెప్పాను. ఈ శాసనసభ సమావేశాలు ముగిసే లోపు అడ్వకేట్ జనరల్‌తో, ఎమ్మెల్సీలతో ఒక సమావేశం ఏర్పాటు చేసి, కోర్టులో ఉన్న కేసుకు అభ్యంతరాలు లేకుండా, కోర్టు తప్పు పట్టకుండా ఆల్టర్నేటివ్‌గా ఏమైనా అప్రోచెస్, మెథడ్స్ ఉంటే తప్పకుండా చేస్తామని, వారికి న్యాయం చేయాలని, వాళ్లకు సహకారం అందించాలని మాకు కూడా ఉన్నది కాబట్టి తప్పకుండా ఆ ప్రయత్నం చేస్తామని మీద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

## దివ్యాంగులకు ఉచిత బస్సు పాసులు

ప్రశ్న నెం.2774(23)

డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి, సర్వశ్రీ మైనంపల్లి హనుమంతరావు మరియు కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఎమ్మెల్సీలుః– గౌరవనీయులైన రవాణా శాఖామంత్రి దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) ఆర్‌టిసి బస్సులలో ప్రయాణించేందుకు వికలాంగులకు ఉచిత బస్సు పాసులను జారీ చేసే ప్రతిపాదన ఏదైనా ఉన్నదా;

ఆ) అయితే, ఆ వివరాలేమిటి;

ఇ) రాష్ట్రంలో దీనిని అమలు చేసినట్లయితే లబ్ధి పొందబోయే వ్యక్తుల సంఖ్య ఎంత?

**రవాణా శాఖా మంత్రి (శ్రీ పి. మహేందర్ రెడ్డి)ః–** అ) లేదండీ. అయితే, హైదరాబాదు, వరంగల్ నగరాలలో సిటీ ఆర్డినరీ సర్వీసులలో ఉచితంగా ప్రయాణించేందుకు, వికలాంగులకు బస్సు పాసులను జారీ చేయడమవుతున్నది. జిల్లాలలో డీలక్స్ సర్వీసుల వరకు 50 శాతం రాయితీ

సదుపాయాన్ని సమకూర్చడమయింది.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

ఇ) రాష్ట్రంలో దీనిని అమలు చేసినట్లయితే 3,14,771 మంది వికలాంగులు లబ్ధి పొందుతారు.

**డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి (పట్టభద్రుల నియోజక వర్గం - వరంగల్, ఖమ్మం మరియు నల్గొండ)**:- అధ్యక్షా, చాలా సంతోషం, ఆర్టీసి బస్సుల్లో ప్రయాణించే అనేక వర్గాలకు రాయితీలు ఇస్తున్నారు. విద్యార్థులకు, ప్రభుత్వోద్యోగులకు, దివ్యాంగులకు రాయితీ ఇస్తున్నారు. అయితే కేవలం ఆర్డినరీ బస్సుల్లో మాత్రమే వికలాంగులకు ఈ రాయితీ సౌకర్యం అనుమతిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఎక్స్‌ప్రెస్ బస్సులు, డిస్ట్రిక్ట్ బస్సుల్లో కూడా ఈ రాయితీని కొనసాగిస్తున్నారా? కొనసాగించకపోతే దాన్ని కొనసాగించడానికి ఏమైనా అవకాశం ఉన్నదా? రెండు - వికలాంగులతోబాటు మాకు కూడా ఈ అవకాశాన్ని కల్పిస్తే బాగుంటుందని సీనియర్ సిటిజన్స్ నుండి అనేక విజ్ఞప్తులు వస్తున్నాయి. కాబట్టి, ఆ సీనియర్ సిటిజన్స్ విషయాన్ని పరిశీలించే అవకాశం ఉన్నదా? అవకాశం ఉంటే దాన్ని పరిశీలించాలని మనవి చేస్తున్నాను. మూడు - ప్రజా సేవలకు ప్రభుత్వం అనేక రాయితీలు కల్పిస్తున్నందున ఆర్టీసికి నష్టాలు వస్తున్నాయి. ఈ రాయితీలకు ఎంత ఖర్చవుతోంది, రాయితీలు ఇవ్వడం వల్ల రవాణా సంస్థ మీద ఎంత భారం పడుతోంది, ఆ మొత్తాన్ని ప్రభుత్వం తరఫున సరైన సమయంలో సంస్థకు చెల్లిస్తున్నారా లేదా? ఈ మూడు అంశాలకు సమాధానం చెప్పాలని గౌరవ మంత్రివర్యులను మీద్వారా కోరుతున్నాను.

**శ్రీ కసిరెడ్డి నారాయణ రెడ్డి (స్థానిక సంస్థలు - మహబూబ్‌నగర్)**:- అధ్యక్షా, వికలాంగులకు కేవలం హైదరాబాదు, వరంగల్‌లో మాత్రమే రాయితీ ఇస్తున్నామని మంత్రిగారు తెలియజేశారు. వికలాంగులు చేస్తున్న డిమాండ్ సరైనదే. వికలాంగులన్నపుడు సాధారణంగా వాళ్ల మీద సానుభూతి ఉంటుంది. మన ప్రభుత్వం అందరికీ అన్ని రకాలుగా రాయితీలు కల్పిస్తోంది. సిటీలో నడుస్తున్న అన్ని రకాల బస్సుల్లో వికలాంగులకు ఈ రాయితీని అనుమతిస్తే వాళ్లు కూడా సంతోషపడతారు, ఆవిధంగా చేయాలని వాళ్లు డిమాండు చేస్తున్నారు. ఆమేరకు చర్యలు తీసుకోవాలని గౌరవ మంత్రివర్యులను రిక్వెస్ట్ చేస్తున్నాను. రాష్ట్రంలో నడుస్తున్న బస్సుల్లో వాళ్లకి 50 శాతం రాయితీ ఇస్తున్నా అది కొన్ని బస్సులకు మాత్రమే పరిమితం చేశారు. అలా కాకుండా అన్ని రకాల బస్సుల్లో ఈ సౌకర్యం/అవకాశం కల్పించినట్లయితే వాళ్లు సంతృప్తి పడతారు. అందరి మాదిరిగా ప్రయాణాలు చేయాలంటే వీళ్లకు ఖచ్చితంగా సహాయం చేయవలసిన అవసరం ఉంది. పట్టణాలలో ఉండే మేజర్/పెద్ద బస్టాండ్లలో వికలాంగులకు ప్రత్యేకంగా రెస్ట్ రూములు ఏర్పాటు చేయవలసిన అవసరం ఉంది, ఆమేరకు చర్యలు చేపట్టాలని గౌరవ మంత్రివర్యులను కోరుతున్నాం.

**శ్రీ కాటేపల్లి జనార్ధన్ రెడ్డి**:- అధ్యక్షా, ప్రభుత్వం విద్యార్థులకు, దివ్యాంగులకు, ప్రభుత్వోద్యోగులకు ఆర్టీసీ రాయితీ మీద బస్సు పాసులు ఇస్తోంది. కానీ ఈ విషయంలో ప్రభుత్వ ఉపాధ్యాయులను మాత్రం మరచిపోయారు. ఉపాధ్యాయుల్లో కూడా నాన్ గజిటెడ్ వాళ్లున్నారు. స్కూల్ అసిస్టెంట్ కేడర్ వరకు నాన్ గజిటెడ్ ఎంప్లాయిస్ ఉన్నారు. కాబట్టి, ఉపాధ్యాయులకు కూడా రాయితీ సౌకర్యం కల్పిస్తే బాగుంటుంది. సిటీలోనే చాలా మంది ఉపాధ్యాయులుంటారు కాబట్టి వాళ్లకు ఆ రాయితీ అవకాశం కల్పించాలని మీద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ పి. మహేందర్ రెడ్డి**:- అధ్యక్షా, గౌరవ సభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, కాటేపల్లి జనార్ధన్ రెడ్డి గార్లు మాట్లాడిన అంశాలకు సంబంధించి సమాధానం చెబుతున్నాను. ఈ పథకానికి సంబంధించి ప్రభుత్వం 2016-17లో రూ.1,08,26,000 లను ఆర్‌టిసి సంస్థకి ఇచ్చింది. 2017-18 లో జనవరి వరకు హైదరాబాదు మరియు వరంగల్‌లో మొత్తం 74,208 ఉచిత పాసులు ఇచ్చాం.

10.20 ఉ. జిల్లాల్లో జనవరి వరకు 2,40,567 మందికి 50 శాతం రాయితీతో పాసులను ఇచ్చాం.

డా. పల్లా రాజేశ్వర రెడ్డి గారు ఆర్టీసీలో కళాశాల, పాఠశాల విద్యార్థులకు పాసుల జారీ గురించి అడిగారు. 40 లక్షల మందికి రాయితీలు అందిస్తున్నాం. అదేవిధంగా మీడియా, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ, స్వాతంత్ర్య సమరయోధులు, అమర వీరుల కుటుంబాలకు మొత్తం 3,50,000 మందికి బస్ పాసులను రాయితీ మీద అందిస్తున్నాం. దీనివల్ల ప్రభుత్వంపై రూ.580కోట్లు భారం పడుతోంది. సీనియర్ సిటిజన్‌లకు కూడా పాసులను ఇస్తున్నారా అని అడిగారు. ఈ అంశం కూడా ప్రభుత్వ పరిశీలనలో ఉంది.

గౌరవ సభ్యులు శ్రీ కాటేపల్లి జనార్ధన్ రెడ్డి గారు ఉపాధ్యాయుల గురించి అడిగారు. ఆ విషయం కూడా పరిశీలనలో ఉంది. గౌరవ సభ్యులు శ్రీ కసిరెడ్డి నారాయణ రెడ్డి గారు బస్ స్టాండుల్లో సౌకర్యాల కల్పన గురించి ప్రస్తావించారు. రాష్ట్రంలోని 97 బస్ డిపోలలో సౌకర్యాల కల్పన కోసం ప్రత్యేకంగా నిధులను కేటాయించాం. రూ.60 కోట్లు

ఖర్చు పెట్టాం. ఈ సంవత్సరం కూడా బడ్జెట్ కేటాయింపులు చేసి, బస్ స్టాండు, బస్ డిపోలలో వికలాంగులకు, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా తగిన సౌకర్యాలను తప్పకుండా కల్పిస్తాం.

## గ్రామ పంచాయతీల పారిశుద్ధ్య కార్మికుల వేతనాల పెంపు

ప్రశ్న నెం. 2559(24)

సర్వశ్రీ డి. రాజేశ్వర్ రావు మరియు సబావత్ రాములు నాయక్, ఎం.ఎల్.సి.లుః- గౌరవనీయులైన పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య ఎంత;

ఆ) పారిశుద్ధ్య కార్మికుడు ఒక్కొక్కరికి చెల్లిస్తున్న జీతం ఎంత;

ఇ) వారి జీతాలు, అలవెన్సులను పెంచే ప్రతిపాదన ఏదైనా ఉందా;

ఈ) వారి సర్వీసులను క్రమబద్ధీకరించి, శాశ్వత ఉద్యోగులుగా చేయడాన్ని పరిశీలించడమవుతుందా?

**గౌరవ పంచాయతీ రాజ్ శాఖ మంత్రివర్యులు (శ్రీ జూపల్లి కృష్ణారావు):-** అ) అవసరత మేరకు కాలానుగుణంగా పారిశుద్ధ్య ఉద్యోగుల సంఖ్య మారుతుంది.

ఆ) శాశ్వత ఉద్యోగుల జీతాలు పిఆర్సి సిఫారసు ప్రకారం చెల్లించడమవుతున్నది. పాక్షిక ఉద్యోగుల నెలవారీ జీతాలు రూ.4000/-లుగా, పూర్తికాలిక ఉద్యోగుల నెలవారీ జీతాలు రూ.5000/-లుగా ఉంది. తాత్కాలిక ఉద్యోగులకు సంబంధించి జిల్లా స్థాయి కమిటీ నిర్దిష్ట పరిచిన రేట్ల ప్రకారం చెల్లించడమవుతున్నది.

ఇ) లేదండీ.

ఈ) లేదండీ.

**శ్రీ సబావత్ రాములు నాయక్ (నామినేటెడ్):-** అధ్యక్షా, గ్రామ పంచాయతీల్లో మోరీ పనులు చేసే పారిశుద్ధ్య కార్మికులు ఎక్కువగా ఎస్సీలే ఉంటారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారే అటువంటి పనిని చేస్తూ ఉంటారు. ఆ పనులు చేసే వాళ్ళలో లంబాడోళ్ళు తక్కువగా ఉంటారు. ఎస్సీలు ఎక్కువగా ఉంటారు. కానీ, వాళ్ళకు చాలీచాలని జీతాలు చెల్లిస్తున్నారు.

టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాత అంగన్‌వాడీ టీచర్లకు, హోంగార్డులకు, ఆశావర్కర్లు వంటి అనేక వర్గాలకు జీతాలు పెంచడం జరిగింది. కానీ, వారికి జీతం మాత్రం నాలుగు వేల రూపాయలు మాత్రమే. వారికి కనీస వేతనాలు లేవు. గ్రామ పంచాయతీల్లో ఉన్న మురికి మొత్తాన్ని ఎస్సీ వర్గాలకు చెందిన వారే తీస్తుంటారు. హైదరాబాదు జిహెచ్ఎంసిలో పనిచేసే కార్మికులకు రూ.4000/-లు, రూ.5000/-ల నుండి రూ.10,000/- మరియు రూ.15,000/-లకు పెంచడం జరిగింది.

మన మంత్రివర్యులకు బీదవారితో చాలా దగ్గర సంబంధాలున్నాయి. వారి నియోజకవర్గంలో కూడా ఎస్సీలు చాలా ఎక్కువ మంది ఉన్నారు. కానీ, కొన్ని గ్రామ పంచాయతీలలో రూ.2,000/-, రు.1,500/- మాత్రమే పారిశుద్ధ్య కార్మికుల జీతాలున్నాయి. అది కూడా సంవత్సరానికి రెండు, మూడు సార్లు ఇస్తారు. నెలకు ఒకసారి ఇవ్వరు.

తెలంగాణ రాష్ట్రంలో 25 లక్షల అసంఘటిత కార్మికుల కుటుంబాలున్నాయి. ఒక్కో కుటుంబానికి ఐదుగురి చొప్పున చూసుకుంటే దాదాపు కోటి మంది అవుతారు. తెలంగాణ రాష్ట్రం వచ్చేముందు, తెలంగాణలో ఎన్నికలు జరిగినప్పుడు నూటికి 95 శాతం మన ప్రభుత్వం రావడానికి వారు తోడ్పడ్డారు. స్ట్రైక్ చేసినప్పుడు, తెలంగాణ గురించి కొట్లాడిన సందర్భాలలో వారు మనకు అనుకూలంగా, సానుకూలంగా మా రాష్ట్రం రావాలి, మాకు జీతాలు పెరగాలి, మా ఆర్థిక పరిస్థితులు బాగుండాలనే ఉద్దేశంతో మన కొరకు పనిచేయడం జరిగింది. కాబట్టి, ఇటువంటి పరిస్థితుల్లో ఈ కార్మికులకు రూ.10,500/-ల కనీస వేతనాలు ఇప్పించవలసిందిగా తమరి ద్వారా గౌరవ మంత్రిగారితో పాటు, గౌరవ ముఖ్యమంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ జూపల్లి కృష్ణా రావు:-** అధ్యక్షా, గౌరవ సభ్యులు రాములు గారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం రాకముందు పరిస్థితుల గురించి ప్రస్తావించారు. అప్పుడు పార్ట్‌టైమ్ ఉద్యోగులకు చెల్లించే వేతనం రూ.1623/-లు ఉండేది. ఫుల్‌టైమ్ కంటింజెంట్ వర్కర్లకు రూ.2600/-ల వేతనం ఉండేది. కానీ, మన ప్రభుత్వం వచ్చిన తరువాత జి.ఒ. 63 ద్వారా, 2016వ సంవత్సరంలో రూ.1623/-లను రూ.4000/-లకు పెంచడం జరిగింది. రూ.2600/-లుగా ఉన్నటువంటి వేతనాలను రూ.5000/-లకు పెంచడం జరిగింది. గతంలో, గ్రామ పంచాయతీలకు వచ్చే ఆదాయం నుండి 30 శాతం వరకు మాత్రమే పారిశుద్ధ్య కార్మికుల వేతనాల

కొరకు ఖర్చు చేయాలని ఒక పరిమితి ఉండేది. మన ప్రభుత్వం 30 శాతంగా ఉన్న పరిమితిని సడలించి, 50 శాతానికి పెంచడం జరిగింది.

ఈరోజు రెగ్యులర్ వర్కర్లు 858 మంది ఉంటే, ఫుల్‌టైమ్ వర్కర్లు 435 మంది ఉన్నారు. పార్ట్‌టైమ్ వర్కర్లు 4,556 మంది ఉన్నారు. ఆయా గ్రామ పంచాయతీల అవసరాల మేరకు కాంట్రాక్టు/ఔట్ సోర్సింగ్ క్రింద పనిచేసే కార్మికులు 24,496 మంది ఉన్నారు. ఈ కాంట్రాక్టు/ ఔట్‌సోర్సింగ్ క్రింద పనిచేసే వారిని ఆయా గ్రామ పంచాయతీల అవసరాన్ని బట్టి తీసుకుంటారు కాబట్టి, వారికి ఇచ్చే వేతనాలు పెరిగేందుకు అనుకూలంగా ఆయా గ్రామ పంచాయతీలకు ఉన్న పరిమితులను పెంచాం.

గతంలో కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే నిధులు గ్రామ పంచాయతీలకు, మండలాలకు, జిల్లాకు 50:30:25 రేషియోలో వెళ్తుండేవి. కానీ, ప్రస్తుతం 100 శాతం నిధులు గ్రామ పంచాయతీలకు వస్తున్నాయి. అదేవిధంగా ప్రస్తుతం ప్రవేశపెట్టినటువంటి బడ్జెట్‌లో స్టేట్ ఫైనాన్స్ కమీషన్ ద్వారా గ్రామ పంచాయతీలకు నిధులను కేటాయించే అంశాన్ని పొందుపరచడం జరిగింది. అంటే, గ్రామ పంచాయతీల ఇన్‌కమ్ లెవల్స్‌ను పెంచడం జరిగింది. తద్వారా గ్రామ పంచాయతీలకు అవసరానికి తగ్గట్లుగా వేతనాలను పెంచుకునేందుకు వెసులుబాటు కల్పించడం జరుగుతోంది.

**శ్రీ సబావత్ రాములు నాయక్**:- అధ్యక్షా, కనీస వేతనాల చట్టం ప్రకారం, జి.ఒ.4 మరియు జి.ఒ.52 ప్రకారం కనీస వేతనం రూ.10,000/-ల పైగా ఉంది. కానీ, కేవలం గ్రామ పంచాయతీలకు వచ్చే ఆదాయం నుండి మాత్రమే పారిశుద్ధ్య కార్మికుల వేతనాలకు సర్దుబాటు చేసుకోవాలనే విషయంలో, ప్రభుత్వం కూడా మరికొన్ని నిధులను సర్దుబాటు చేసి పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలని కోరుతున్నాను. ప్రస్తుతం ఇవాళ ఒక రూము కిరాయికి తీసుకోవాలంటే కనీసం రూ.4000/-లు ఉంటోంది. ఈ కార్మికులందరూ కిరాయికి ఉండేవాళ్ళే. వాళ్లకు ఇళ్ళు లేవు. కాబట్టి, రూ.4000/- ల నుండి రూ.10000/-లకు పెంచుతూ కనీస వేతనాల చట్టం అమలయ్యేట్లుగా చూడవలసిందిగా గౌరవ మంత్రిగారిని తమరి ద్వారా కోరుతున్నాను.

**శ్రీ జూపల్లి కృష్ణా రావు:-** అధ్యక్షా, గతంలో 1993 సంవత్సరం కంటే ముందు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నటువంటి వాళ్ళను ఖాళీల లభ్యతను బట్టి, వారిని పర్మినెంట్ కూడా చేయడం జరుగుతోంది. 24 వేలకు పైగా ఉన్నటువంటి వారిని, ఆయా గ్రామ పంచాయతీల్లో అవసరాన్నిబట్టి గంట, రెండు గంటల పాటు పనిలోకి తీసుకోవడం జరుగుతోంది. కానీ, తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత, గౌరవ ముఖ్యమంత్రిగారు ఈ విషయమై దృష్టి సారించి, ఎక్కడ వీలైతే అక్కడ వేతనాలను పెంచే కార్యక్రమం కొనసాగుతోంది. గ్రామ పంచాయతీలకు కూడా వెసులుబాటు కల్పిస్తున్నాము. గౌరవ సభ్యులు చెప్పిన అంశాలను మరొక్కసారి పరిశీలిస్తాము.

### భూ రైతులకు పెట్టుబడి సహాయ పథకం

ప్రశ్న నెం. 2587(25)

సర్వశ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి, టి. భానుప్రసాద రావు మరియు వి. భూపాల్ రెడ్డి, ఎం.ఎల్.సి.లు:- గౌరవనీయులైన వ్యవసాయ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) రాష్ట్రంలో ప్రస్తుతం సాగులో ఉన్న భూమి విస్తీర్ణం ఎంత;

ఆ) రాష్ట్రంలోని రైతులకు పెట్టుబడి సహాయం అందించే విషయం పరిశీలనలో ఉన్నదా;

ఇ) అయితే, ఆ వివరాలేమిటి;

ఈ) రైతులకు ఆ మొత్తాన్ని ఏవిధంగా చెల్లించడమవుతుంది?

**గౌరవ వ్యవసాయ శాఖ మంత్రివర్యులు (శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డి):-** అ) 1.42 కోట్ల ఎకరాలు.

ఆ) అవునండీ.

ఇ) రైతులకు ఒక సీజనులో ఒక ఎకరానికి రూ.4000/-లు చెల్లించడమవుతుంది.

ఈ) చెక్కుల ద్వారా చెల్లించడమవుతుంది.

**శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి**:- అధ్యక్షా, ఇది అతి ముఖ్యమైన ప్రశ్న. గౌరవ మంత్రిగారు వ్యవసాయదారుడు కాబట్టి, వారిచ్చే జవాబు స్పష్టంగా ఉంటుందని భావించాను. కానీ, ముక్తసరిగా అవునండీ, లేదండీ అని సమాధానమిచ్చారు. రాష్ట్రంలో 1.42 కోట్ల ఎకరాలను రైతులు సాగుచేస్తున్నారని మంత్రి గారు చెప్పారు. ఈ ఒక కోటి నలభై రెండు లక్షల ఎకరాలను సాగుచేయడంలో ఎన్ని ఖాతాలు, ఎంతమంది రైతులు సాగుచేస్తున్నారనే వివరాలు కావాలి.

రెండవ ప్రశ్నకు అవునండీ అని సమాధానమిచ్చారు. సమాధానం అవునండీ కాబట్టే, ఆ వివరాలేమిటని నేను ప్రశ్న

వేశాను. అందుకు రైతులకు రూ.4000/-లు ఇస్తున్నామని చెప్పారు. ఎన్ని ఖాతాలున్నాయి? ఎలా ఇస్తున్నారు? ఏ విధంగా చెల్లిస్తున్నారు? అనే విషయాలపై వివరణ స్పష్టంగా లేదు.

చెక్కుల ద్వారా చెల్లిస్తామని మంత్రిగారు చెప్పారు. ఈ విషయమై ఇదివరకే ఆరోపణలు వచ్చాయి. 1.42 కోట్ల ఎకరాలకు రూ.5680/-కోట్లను చెక్కుల ద్వారా ఒక నెలలో ఇచ్చినట్లయితే, ఏయే బ్యాంకుల ద్వారా ఇస్తారు? ఎన్ని బ్యాంకుల ద్వారా ఇస్తారు? అనే సమాచారం కూడా కావాలి. బ్యాంకులలో నగదు నిల్వలు లేనటువంటి ఈ రోజుల్లో, చెక్కుల ద్వారా ఆ బ్యాంకులు రైతులకు డబ్బులెలా ఇస్తాయి? కాబట్టి, ఆ పెట్టుబడి డబ్బు ఏ రకంగా రైతుకు పెట్టుబడి రూపంలో అందే అవకాశముందో చెప్పాలి. రైతుకు నష్టం లేకుండా ఏ విధమైన చర్యలు తీసుకున్నారనేది సోదాహరణంగా వివరించాలని కోరుతున్నాను. దేశంలో ఎక్కడా లేనటువంటి రీతిగా, రైతులకు ఇంత మంచి పెట్టుబడి పథకాలను ప్రవేశ పెట్టింది మన తెలంగాణ ప్రభుత్వం. కాబట్టి, దాని మీద సవివరమైన సమాధానం చెప్పినట్లు ఉండాలి గానీ, ఈ విధంగా అవునండీ, లేదండీ, కాదండీ అంటే ఎలా? కాబట్టి, స్పష్టంగా వివరణ ఇవ్వాలని గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ టి. భాను ప్రసాద రావు (స్థానిక సంస్థలు - కరీంనగర్)**:- అధ్యక్షా, ప్రశ్నకు సంబంధించినంత వరకు చాలా వరకు గౌరవ మంత్రి గారు వివరంగా సమాధానమిచ్చారు. ఎంతమంది రైతులున్నారనే విషయం ఒక్కటి తప్పితే మిగిలిన వివరాలను చాలా వరకు ఇచ్చారు. సాగుకు సంబంధించిన పెట్టుబడి అంటున్నప్పుడు కేవలం వ్యవసాయానికి సంబంధించి మాత్రమే ఇస్తున్నారా, లేదా, పండ్ల తోటలు, కూరగాయలు సాగుచేసేటువంటి వారికి, హార్టికల్చర్, ఫ్లోరీ కల్చర్‌కు సంబంధించినటువంటి రైతులకు కూడా పెట్టుబడి ఇస్తారా అనే విషయాన్ని తెలుపవలసిందిగా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ వి. భూపాల్ రెడ్డి (స్థానిక సంస్థలు - మెదక్)**:- అధ్యక్షా, గౌరవ మంత్రిగారు ఇచ్చిన సమాధానం సంతృప్తికరంగా ఉంది. మొత్తం 72,000 ఖాతాలున్నాయని గతంలో మంత్రి గారు చెప్పారు. గౌరవ చీఫ్ విప్ గారికి నేను చెప్పేదేమంటే, అయ్యా మీరు ఉపాధ్యాయులు, విద్యార్థుల అంశాలపై కాన్‌సెంట్రేట్ చేయండి. వ్యవసాయానికి చెందిన అంశాల గురించి మేము చూస్తాం.

**శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి** :- (మైకు లేకుండా) నేను వ్యవసాయదారుడ్ని కూడా. మీరు పట్నపోళ్ళు. మీరు వ్యవసాయం చేస్తున్నారో, లేదో నాకు తెలియదు.

**శ్రీ వి. భూపాల్ రెడ్డి**:- నేను క్యాజువల్‌గా అన్నా. నేను కూడా మూడూళ్ళలోని 100 ఎకరాల్లో వ్యవసాయం చేసేవాడిని. ఎలక్షన్ల కోసం కొట్లాడి మొత్తం భూమి అంతా పోయి, ఇప్పుడు 3 ఎకరాలకు వచ్చింది.

( సభలో నవ్వులు )

నేను పెద్ద వ్యవసాయదారుడిని. వ్యవసాయం చేసిన వాడిని. నాకు చెరుకు అంటే తెలుసు. వరి అంటే తెలుసు. టేకు చెట్లంటే తెలుసు. జొన్న అంటే తెలుసు. మిరపకాయలంటే తెలుసు. అన్ని విషయాలు తెలిసిన వ్యక్తిగా, గౌరవ మంత్రిగారు ఇచ్చిన జవాబు చాలా తృప్తిగా ఉందని తెలియజేస్తున్నాను. దానికన్నా ముఖ్యంగా గౌరవ ముఖ్యమంత్రి గారిని అభినందించాలనే ఉద్దేశంతోనే నేను ఈ ప్రశ్న వేశాను. వ్యవసాయదారునికి పెట్టుబడి అవసరం పడుతుందని ఇన్ని రోజులుగా గ్రహించిన వ్యక్తి లేరు. ఇటువంటి ముఖ్యమంత్రి గారు మనకు ఉన్నందుకు సంతోషపడాలి.

(సభలో కరతాళ ధ్వనులు)

దానికి ప్రశ్నలు వేయవలసిన అవసరం లేదు. దానికి తృప్తి పడాలి. సంతోషించాలి. నా సందేహం ఒక్కటే. ఒక రైతుకు 10 ఎకరాలుంటే, అతనికి రూ.40,000/- వస్తే, ఆ డబ్బులను ఒకేసారి విత్‌డ్రా చేయడం కష్టమవుతుంది. కాబట్టి, ఏ విధంగా విత్‌డ్రా చేసుకోవచ్చు అనే విషయమై క్లారిఫికేషన్ ఇస్తే సరిపోతుంది. మిగతా విషయంలో చాలా తృప్తిగా ఉంది. ప్రభుత్వం చేస్తున్న పని బాగుంది. ఇంతకన్నా మంచి చేసే ప్రభుత్వం ఇంత వరకు రాలేదు. వస్తదో, రాదో కూడా నాకు తెలియదు. ఏది ఏమైనా ప్రభుత్వాన్ని, గౌరవ ముఖ్యమంత్రిగారిని, గౌరవ మంత్రి గారిని అభినందిస్తున్నాను.

**డా. ఆర్. భూపతి రెడ్డి (స్థానిక సంస్థలు - నిజామాబాద్)**:- ధన్యవాదాలు అధ్యక్షా. ఇది చాలా సంతోషం. దేశంలో ఏ ప్రభుత్వమూ చేయనటువంటి పనిని, మన గౌరవ ముఖ్యమంత్రి గారి ఆధ్వర్యంలో మన ప్రభుత్వం చేస్తోంది. చాలా మంది కౌలు రైతులున్నారు. శిఖం భూమి, ఫారెస్ట్‌ల్యాండ్, అసైన్డ్ ల్యాండ్ వంటి డిస్‌ప్యూటెడ్ ల్యాండ్స్ ఉన్న వాళ్ళకు క్లియర్‌గా మ్యుటేషన్స్ జరగలేదు. వారందరికీ పాత పట్టా పాస్‌బుక్కులు ఇచ్చారు. వాళ్ళను ఏమి చేయబోతున్నారనేది నా ప్రశ్న. మరొక విషయం, రుణమాఫీ చేసినప్పుడు ప్రభుత్వం రైతుల అకౌంట్లలో డబ్బులు వేసింది. అప్పుడు బ్యాంకులు రైతులు తమకు ఉన్న బాకీల క్రింద అ డబ్బులను పట్టుకున్నారు. ఇప్పుడు కూడా ప్రతి రైతుకీ బ్యాంకుల్లో అప్పు ఉంటుంది కాబట్టి, ఈ పెట్టుబడి డబ్బులను కూడా చెక్కుల రూపంలో

ఇస్తున్నందున, మళ్ళీ బ్యాంకులు ఈ డబ్బులను కూడా పట్టుకుంటే, రైతుకు ఏమీ దొరకదు కాబట్టి, ఈ విషయంలో ప్రభుత్వం ఏ జాగ్రత్తలు తీసుకుంటుందో తెలియజేయాలని తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డి:–** అధ్యక్షా, గౌరవ సభ్యులు పాతూరి సుధాకర్ రెడ్డి గారు మాట్లాడుతూ తక్కువ సమాధానం చెప్పారన్నారు. ఎక్కువ చెబితేనేమో ఎక్కువ చెప్పారంటారు.

(సభలో నవ్వులు)

సూటిగా సమాధానం చెబితేనేమో తక్కువ చెప్పారంటారు. వినేవారి ఓపికుంటే..,

**మిస్టర్ ఛైర్మన్:–** సూటిగానే సమాధానం చెప్పండి.

(సభలో నవ్వులు)

**శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డి:–** అధ్యక్షా, సభ్యులు అడిగినటువంటి ప్రశ్నలకు సమాధానాలు ఇస్తాం. దాని మీద సప్లిమెంటరీ ఎప్పుడూ ఉంటుంది. తమరికి ఇచ్చేటువంటి సమాధానం, తమరి ద్వారా గౌరవ సభ్యులకు ఇచ్చేటువంటి సమాధానం క్లుప్తంగా ఉంటేనే కరెక్టుగా ఉంటుంది. వివరాలు సప్లిమెంటరీలో చర్చించుకోవచ్చు. ఇది సహజంగా జరిగేటువంటి బిజినెస్.

గౌరవ సభ్యులు పాతూరి సుధాకర్ రెడ్డి గారు ఎంత మంది రైతులకు లబ్ధి కలుగుతుందని ప్రశ్నించారు. 2017 సెప్టెంబరు 15వ తారీఖు మొదలుకొని, డిసెంబరు 31వ తారీఖు వరకు గౌరవ ముఖ్యమంత్రి గారి ఆదేశానుసారంగా రాష్ట్రంలో 1507 టీములు భూ ప్రక్షాళన కోసం ఏర్పాటు చేయబడ్డాయి. తహసీల్దారు గారి నాయకత్వంలో, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ అధికారుల నాయకత్వంలో వంద రోజుల పాటు ప్రతి గ్రామం తిరిగి ఒక్కొక్క గ్రామంలో 10 రోజులున్నారు. ఈ 1507 టీములు కలిసి రాష్ట్ర వ్యాప్తంగా 100 రోజులు సర్వే చేసి పార్ట్–ఎ, పార్ట్–బి క్రింద ఆ భూములను విభజించడం జరిగింది. పార్ట్–ఎ అంటే వివాదరహిత భూములు 96 శాతంగా తేలాయి. రైతుల సంఖ్య 72,13,111. నాలుగు శాతం రైతుల భూములు మాత్రం గౌరవ సభ్యులు డా. భూపతి రెడ్డి గారు చెప్పినట్లు ఫారెస్ట్ ల్యాండ్స్ కొన్ని, శిఖం ల్యాండ్స్ కొన్ని, వివాదాస్పద భూములు కొన్ని, కోర్టు కేసులున్నటువంటి భూములు కొన్ని ఉన్నాయి. వాటిని పార్ట్–బి క్రింద పెట్టి, రెవెన్యూ అధికారులు వాటిని క్రమక్రమంగా పరిష్కరిస్తున్నారు. అవి కూడా త్వరలో పరిష్కరించబడతాయి. ఏదో ఒక విధంగా తీర్పు చెప్తారు.

ఈ 72,13,111 మంది రైతులు 10,823 రెవెన్యూ గ్రామాలలో ఉన్నారు. అన్ని గ్రామాలలో రాబోయే రోజుల్లో వీరికి చెక్కుల ద్వారానే అమౌంట్‌ని ఇవ్వడం జరుగుతుంది. ఎక్కడా కూడా ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్.ఎల్.బి.సి. కన్వీనర్ అయినటువంటి ఎస్.బి.ఐ. ఎండి గారికి మేము సూచనలు చేశాం. వారు మండలానికి ఒక బ్యాంకుని ఎంపిక చేస్తారు. ఆ బ్యాంకు ద్వారానే ఈ రైతులకి చెక్కులిప్పించే కార్యక్రమం జరుగుతుంది. ఈ చెక్కులిప్పించే కార్యక్రమంలో, 72,13,111 మందికి పట్టా పాసుబుక్కులను కేవలం ఒక్క రోజులో ఇస్తాము. కానీ, పాసుబుక్కులు ఇచ్చిన తరువాత, ఇంతమందికి ఏప్రిల్ 20 తారీఖు మొదలుకొని, బహుశా మే నెలాఖరు వరకు ప్రతి నిత్యం గౌరవ శాసనసభ్యులు, గౌరవ శాసనమండలి సభ్యులు, పార్లమెంటు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మంత్రులు, తమరు కూడా గ్రామాలకు వెళ్ళి, ఫలానా గ్రామానికి ఫలానా తేదీన వస్తామని షెడ్యూలు ఫిక్స్ చేసి, ఆ గ్రామంలో ఈ టైమ్ నుండి ఈ టైమ్ వరకు ఉంటామని ఆ ఊర్లో ఉండే రైతులందరికీ తెలిసేలా దండోరా వేసి, దేశంలోనే మొట్టమొదటిసారిగా అధికారికంగా పాసుబుక్కులిచ్చే పథకం అధ్యక్షా ఇది. For the first time in the Country. దేశంలోనే కాదు, ప్రపంచంలో కూడా రైతుకు పెట్టుబడి ఇచ్చినటువంటి ఏకైక ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారు, ఏకైక ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వం. ఇంత వరకు ఎక్కడా ఇవ్వలేదు.

10.40 మ. వచ్చే వానా కాలం పంట నుండే ఈ నిధులు అందించబోతున్నాము. వీటి కొరకు రూ.12వేల కోట్ల నిధులను కూడా ఈ బడ్జెట్‌లో కేటాయించుకోవడం జరిగింది. మొత్తం 1.42కోట్ల ఎకరాలు గల 72,13,111మంది రైతులకు ఈ నిధులు అందజేయడం జరుగుతుంది. ఎక్నాలెడ్జ్‌మెంట్ తీసుకొని రైతులకు చెక్కుల రూపంలో నిధులు అందజేస్తాం. ఉదాహరణకు శ్రీ పోచారం శ్రీనివాస్ రెడ్డి గారికి సిండికేట్ బ్యాంకులో లక్ష రూపాయల క్రాప్ లోన్ ఉందనుకుంటే, నాకున్న 10 ఎకరాలకు రూ.40,000/- వస్తే, నేను సిండికేట్ బ్యాంకులోకే వెళ్లి వేసుకోవాలని ఏమీ లేదు. రైతులకు బేరర్ చెక్కు ఇవ్వడం జరుగుతుంది. నా ఇష్టం వచ్చిన బ్యాంకుకు వెళతాను. ఏ బ్యాంకు మేనేజరయితే నాకు నగదు ఇస్తాడో నేను అక్కడికే వెళతాను. సిండికేట్ బ్యాంక్‌లో ఉన్నటువంటి క్రాప్‌లోన్ కట్ చేసుకుంటాడనే భయం ఉంటే ఆ బ్యాంకుకు వెళ్లకుండా ఇతర ఏ బ్యాంకుకైనా వెళ్లి మీ డబ్బుని జమ చేసుకోవచ్చు. ఆ బ్యాంకువారు క్లియరెన్స్ తెప్పించి ఇస్తారు, ఆ క్లియరెన్స్ ఛార్జెస్ కూడా ప్రభుత్వమే చెల్లిస్తుంది. దాంతో

ఆ రైతు అతనికి వచ్చిన నగదులోంచి విడతల వారీగా ఎంత అమౌంటునైనా తీసుకోవచ్చు. బ్యాంకర్స్‌తో కూడా మాట్లాడడం జరిగింది, వారు కూడా సిద్ధంగా ఉన్నారు. మండలానికి ఒక బ్యాంకు చొప్పున ఈ ఏర్పాట్లు జరుగుతున్నాయి.

గౌరవ ముఖ్యమంత్రి గారు తీసుకున్న ఈ నిర్ణయాన్ని గౌరవ సభ్యులు శ్రీ భాను ప్రసాద రావు మరియు శ్రీ వి.భూపాల్ రెడ్డి గారు అభినందించారు. నేను వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. అగ్రికల్చర్‌తోపాటు, హార్టీకల్చర్ కూడా పెట్టుబడి పెట్టే పంట. కాబట్టి, హార్టీకల్చర్ క్రాప్‌కు కూడా ఎకరానికి నాలుగు వేల రూపాయలు వర్తింపజేస్తాము. 1.42కోట్ల ఎకరాలకు రూ.5,680కోట్లు కావాలి. రాష్ట్రంలోని బ్యాంకులల్లో కరెన్సీ తక్కువ ఉందని బ్యాంకర్స్ తెలియజేయడం జరిగింది. కాబట్టి, అందుకు కావాల్సిన కరెన్సీ కొరకు గౌరవ ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు గత నెలలో నేను మరియు ఆర్థిక మంత్రి వర్యులు ఢిల్లీకి వెళ్లి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి వర్యులను కలిసి రిజర్వ్‌బ్యాంకు వారితో మాట్లాడి మా రాష్ట్రానికి అధిక మొత్తంలో కరెన్సీ పంపించాలని వారికి తెలియజేయడంతో వారు కూడా పంపిస్తామని ఒప్పుకున్నారు. రైతులకు రుణం పంచే సమయానికి కరెన్సీ కూడా అందుబాటులోకి వస్తుంది.

కౌలుదారుకి, పట్టాదారుడికి మధ్య అంగీకారం లేదు. ఈరోజు నా పొలం ఉంది, ఎవరైనా ఒక ఏ-కు ఇస్తాను, ఒకవేళ తాను సరిగా చేయకపోతే బి-కు ఇస్తాను. కౌలుదారనే వ్యక్తి శాశ్వతంగా ఉండడు. కాబట్టి, భూ రికార్డు ప్రకారం పట్టాదారునికి మాత్రమే ఇస్తాము. ఏదైనా అంగీకారం ఉంటే అది పట్టాదారు, కౌలుదారులే చూసుకోవాలి. ప్రక్షాళన కానటువంటి కొన్ని అటవీ భూములున్నాయి. వాటి విషయంలో రెవెన్యూ మరియు అటవీ శాఖ అధికారులు కూర్చోని అది ఎవరికి చెందిన భూమి అనేది తేల్చుతారు. గౌరవ శాసనసభ సభ్యులు, శాసన పరిషత్ సభ్యులు అంతా కలసి ఏప్రిల్ 20 నుండి మే 31 వరకు వారి, వారి నియోజకవర్గాలకు వెళ్లి ఎకరానికి నాలుగు వేలు ఇచ్చే కార్యక్రమాన్ని విజయవంతం చేస్తారు. ఇంత బృహత్తరమైన, బ్రహ్మాండమైన కార్యక్రమం దేశంలో ఎక్కడా లేదు. మొన్న నేను ఐసిఏఆర్ జనరల్ బాడీ సమావేశానికి హాజరయ్యేందుకు ఢిల్లీకి వెళితే అక్కడున్నటువంటి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి గారు మాట్లాడుతూ,

آپ بھی سوچیے تلنگانہ سرکار کیا کر رہی ہے۔ آپ کے چیف منسٹر کا دل بہت بڑا ہے اور بہت ہمت والے ہیں۔

అని ఇతర రాష్ట్రాల వారికి కూడా చెప్పడం జరిగింది. ఈ పథకం రైతాంగం గుండెను కదిలించింది. సంవత్సరానికి మనకు దాదాపు వర్షా కాలానికి 16లక్షల మెట్రిక్ టన్నులు, యాసంగిలో 12లక్షల మెట్రిక్ టన్నులు కలుపుకొని మొత్తంగా 28లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల అవసరం ఉంటుంది. అంటే 28 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు దాదాపు 5.60కోట్ల బస్తాలతో సమానం. అంటే 5.60కోట్ల బస్తాలకు సరిపడా అమౌంట్‌ని రైతులు ఖర్చు పెట్టకుండా ప్రభుత్వమే 28 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు ఉచితంగా సరఫరా చేస్తుంది. ఇది అంతపెద్ద కార్యక్రమం. రైతు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లి, మరొకరి దగ్గరకో వెళ్లి, నాలుగు రూపాయలు, ఐదు రూపాయల వడ్డీకి వెళ్లకుండా విత్తన పెట్టుబడి, ఎరువుల పెట్టుబడి రైతుకు అందుబాటులో ఉంచుతున్నాము. ఇది దేశంలోనే మొట్టమొదటి ఆదర్శ పథకం.

కొన్ని అసైన్డ్ భూములను పేదలకు పంచాము. వాటిలో కొన్ని రాళ్లు ఉండే ప్రాంతాలుంటాయి, బొందలుండే ప్రాంతాలుంటాయి. వాటికి కూడా ఈ పథకం వర్తిస్తుంది. త్వరలో కాళేశ్వరం, గోదావరి, పాలమూరు, కృష్ణా నీరు, ఖమ్మంలోని భక్త రామదాసు ప్రాజెక్టుల ద్వారా నీరు విడుదల కాబోతోంది. దాంతో దాదాపు కొత్తగా కోటి ఎకరాలకు సాగునీరు అందబోతోంది. కడుపునిండ విద్యుత్, కడుపునిండ నీళ్లు, కడుపునిండ పెట్టుబడి, కడుపునిండ దిగుబడి వస్తుంది. వచ్చిన దిగుబడిని కూడా రైతులు తక్కువ ధరకు అమ్మకుండా రైతు సమన్వయ సమితుల ద్వారా అధిక ధరను కల్పించి రైతు ఆత్మ గౌరవంగా బతికే విధంగా, ఆత్మహత్యలు లేనటువంటి తెలంగాణగా చేసేవిధంగా, అప్పు లేనటువంటి తెలంగాణ చేసేవిధంగా రాష్ట్రప్రభుత్వం పని చేస్తుంది. గౌరవ ముఖ్యమంత్రి గారు స్వయానా రైతు బిడ్డ. కాబట్టి, రైతు కష్టాలు తెలిసినటువంటి నాయకుడు కాబట్టి, ప్రపంచంలోనే తెలంగాణ రైతు ఆత్మ గౌరవంతో బతికే కార్యక్రమం తెలంగాణ ప్రభుత్వం చేస్తుందని చెప్పి మీద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

**మిస్టర్ ఛైర్మన్:-** ప్రశ్న నెం.2731(26) మరియు ప్రశ్న నెం.2584(27) సభ్యుల కోరిక మేరకు వాయిదా వేయడమైనది.

## రైతులకు సమావేశ మందిరాలు

ప్రశ్న నెం.2706(28)

శ్రీ కర్నె ప్రభాకర్ మరియు డా. మాదిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎం.ఎల్.సి.లు:- గౌరవనీయులైన వ్యవసాయ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) రాష్ట్రంలో రైతుల కోసం ప్రత్యేక సమావేశ హాళ్లను నిర్మించాలని నిర్ణయించడమయిందా;

ఆ) అయితే, ఆ వివరాలేమిటి;

ఇ) ఎప్పటిలోగా హాళ్ల నిర్మాణం పూర్తి చేయడమవుతుంది?

**గౌరవనీయులైన వ్యవసాయ శాఖ మంత్రి (శ్రీ పోచారం శ్రీనివాస్ రెడ్డి):–** అ) అవునండీ.

ఆ) రైతులతో సమావేశాలను నిర్వహించడానికి ప్రతి ఎఇఓల క్లస్టర్ ప్రధాన కార్యస్థానం రైతు వేదిక కలిగి వుంటుంది.

ఇ) భూమి లభ్యత ఆధారంగా వీలైనంత త్వరలో ఇవన్నీ పూర్తి చేస్తాము.

**శ్రీ కర్నె ప్రభాకర్ (నామినేటెడ్):–** అధ్యక్షా, గవర్నర్ గారి ప్రసంగం సందర్భంగా మీ కంటికి తగిలిన గాయానికి చింతిస్తూ, మీరు ఆరోగ్యంగా మళ్లీ మా కళ్లముందు కనిపిస్తున్నందుకు గౌరవ సభ్యులందరి తరపున సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాను. గౌరవ మంత్రివర్యులు చక్కటి కార్యక్రమం గురించి వివరించారు. నిజానికి, ఈ కార్యక్రమం జరుగుతున్న సందర్భంలో రైతులందరు కూడా ఒక ఆర్గనైజ్డ్ సెక్టార్‌లోకి రావాలని చూస్తోంది ఈ ప్రభుత్వం. ఇప్పటికీ రైతులు ఎవరికి వారుగా బోరు వేసుకోవాలి, బావి తనే తవ్వుకోవాలి, కరెంట్ తనే తీసుకోవాలి, వచ్చినటువంటి పంట తనే అమ్ముకోవాలి. ఒకవేళ పంట దిగుబడి రాకపోతే ఏదైనా మందు వేసుకొని తనే చనిపోవాలి. ఇదీ వ్యవస్థలో ఉన్నటువంటి పరిస్థితి. కానీ, ఈరోజు ప్రభుత్వమే ఒక భరోసాగా పెట్టుబడి ఇవ్వాలి, ఏ పంట వేసుకోవాలో నిర్ణయించాలి, వారికి అనుకూలంగా ఎప్పటికప్పుడు సలహాలు ఇచ్చేందుకు వ్యవసాయ విస్తరణ అధికారులను నియమించడం. ఈవిధంగా ఒక ఆర్గనైజ్డ్ సెక్టార్‌లోకి రైతును తీసుకురావడం అనేది చాలా సంతోషం. ఇటువంటి సందర్భంలో రైతు వేదికలు నిర్మిద్దాం, తద్వారా ప్రతి పంట ముందు గానీ, పంట తరువాత గానీ వేదికలపైన చర్చలు జరగాలనే ఆలోచన చేయడమనేది చాలా చక్కటి ఆలోచన. రైతు వేదికలు నిర్మించేందుకు గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రతిపాదించినట్లుగా అక్కడక్కడ కొంతమంది దాతలు ముందుకు వచ్చారు. అది కాని పక్షంలో ప్రభుత్వ పరంగా భూములేమైనా ఉంటే రైతు వేదికలు నిర్మిస్తారు. ఈ రెండు కూడా కాని పక్షంలో ప్రభుత్వ పరంగా భూములేమైనా కొనుగోలు చేసి ఆ రైతు వేదికలు నిర్మిస్తారా? అదేవిధంగా ఈ వేదికలు గ్రామాల్లోనే నిర్మిస్తారా, లేదా ఎక్కడ భూములు అందుబాటులో ఉంటే అక్కడనే నిర్మిస్తారా అనేది తెలియజేయాలి.

రైతులందరికీ అందుబాటులో ఉండేటటువంటి పద్ధతిలో రైతు వేదికలు ఉండాలని, అదేవిధంగా ప్రభుత్వ పక్షాన రైతు వేదికల కొరకు భూములేమైనా కొనుగోలు చేస్తుందా అని మీద్వారా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాను.

**Dr. M. SRINIVAS REDDY (NOMINATED):-** Sir, agriculture is most un-organized sector in the country. రైతులు ఇష్టం వచ్చినప్పుడు ఇష్టం వచ్చిన పంటలు వేస్తూ ఉంటారు. ఇష్టం వచ్చిన పంటలు వేస్తే తక్కువ దిగుబడి రావచ్చు, ఎక్కువ దిగుబడి రావచ్చు. ఎక్కువ వచ్చినా, తక్కువ వచ్చినా రైతుకు వచ్చిన లాభం మాత్రం ఏమీ లేదు. ఎందుకంటే, దిగుబడి తక్కువగా వచ్చినప్పుడు సాధారణంగా ధర కూడా తక్కువగానే వస్తుంది. ఎక్కువ దిగుబడి వచ్చినప్పుడు అక్కడ ఉండే వ్యాపారస్తులు సాధారణంగా తక్కువ ధరకు కొనే అవకాశం ఉంటుంది. కాబట్టి, ఎట్టి పరిస్థితుల్లో రైతులకు న్యాయం జరిగే అవకాశం లేదు. కానీ, ఇక్కడ రైతులను ఒక అన్–ఆర్గనైజ్డ్ సెక్టార్ నుండి ఆర్గనైజ్డ్ సెక్టార్‌కు తీసుకువస్తున్నారు. కాబట్టి, ఆర్గనైజ్డ్ సెక్టార్‌లో వారి హక్కులేమిటి, వారి సమస్యలు ఏమిటి, వారు ఏవిధంగా పని చేస్తే వారికి లాభం వస్తుందనేది తెలియజేస్తున్నారు. ఇది చాలా ముఖ్యమైనది. కాబట్టి, రైతు సమాఖ్య వేదికలు నిర్మించడం చాలా సంతోషకరమైన వార్త. ప్రతి ఐదువేల ఎకరాలను ఒక క్లస్టర్‌గా తీసుకోవడం జరిగింది. ప్రతి సెక్టార్‌కి వ్యవసాయ విస్తరణ అధికారి దానికి బాధ్యత వహిస్తారు. రైతు వేదికల్లో తరచుగా సమావేశాలు ఏర్పాటు చేస్తూ రైతులకు కావాల్సిన సైంటిఫిక్ సమాచారం గానీ, సాధారణ సమాచారం గానీ ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా 10,800 గ్రామాలున్నాయి. కాబట్టి, ఒక క్లస్టర్‌కు మూడు నుండి ఐదు గ్రామాల వరకు రావచ్చు. దగ్గర, దగ్గరగా 2,500 నుండి 3,000 వరకు రైతు సమన్వయ సమితుల వేదికలు అవసరం ఉంటుంది. వీటన్నింటినీ నిర్మించడానికి ఎంత సమయం పడుతుంది, దానికి ఎన్ని నిధుల అవసరం ఉంటుందనేది తెలియజేయాలి. అలాగే ఈ సమావేశ మందిరాలు చాలా అవసరం. సమావేశ మందిరాలు లేకపోవడం వల్ల, ఆ మందిరాలు ఎక్కడ నిర్మించాలనే ఆలోచనకే సమయం సరిపోతుంది. కాబట్టి, ఖచ్చితంగా సాధ్యమైనంత త్వరలో ఈ సమావేశ మందిరాలు నిర్మించాలని కోరుతున్నాను.

**శ్రీ టి.భాను ప్రసాద రావు:–** అధ్యక్షా, రైతు సమన్వయ సమితుల సమావేశ మందిరాల విషయంలో భూమి ఎక్కడైతే అందుబాటులో ఉందో అక్కడ సమస్య ఏమీ లేదు. కొంతమంది దాతలు భూములు ఇచ్చినటువంటి ప్రాంతాల్లో సమస్యలు లేనటువంటి పరిస్థితి. ఒక పంటకి ఎకరానికి నాలుగు వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ, కొంతమంది శాసనసభ్యులు గానీ, నాలాంటి వారు గానీ, గౌరవ సభ్యులు

డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి గారు గానీ మాకు ఆ నిధులు అవసరం లేదని ప్రకటించడం జరిగింది. అటువంటి నిధులతో భూములు కొనుగోలుచేసేందుకు మరియు వాటి నిర్మాణం కొరకు ఉపయోగించుకోవాలని మీద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

**శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి:-** అధ్యక్షా, రైతు సమన్వయ సమితుల సమావేశాల మందిరాల గురించి గౌరవ ముఖ్యమంత్రి గారు ఒక్కొక్క క్లస్టర్‌కి ఒకటి చొప్పున ఏర్పాటు చేస్తున్నట్లుగా చెప్పడం జరిగింది. మంత్రి గారి సమాధానంలో భూమి లభ్యత ఆధారంగా వాటిని నిర్మిస్తామని చెప్పడం జరిగింది. కొన్ని గ్రామాల్లో భూమి లభ్యత ఉన్నది. అయినప్పటికీ ఆ భూములను ఏవిధంగా మంజూరు చేస్తారు. వాటిని ఏ ప్రాధాన్యతతో మంజూరు చేస్తారు? ఒకవేళ సంబంధిత గౌరవ మంత్రివర్యులు మంజూరు చేస్తారా, అక్కడి వ్యవసాయ విస్తరణ అధికారి మంజూరు చేస్తారా అనేది వివరణాత్మకంగా తెలియజేయాలని కోరుతున్నాను. కాబట్టి, దాని పద్ధతిని వివరిస్తే మా గ్రామాల్లో తొందరగా వాటి నిర్మాణం చేసుకునేందుకు అవకాశం ఉంటుందని మీద్వారా గౌరవ మంత్రివర్యులకు తెలియజేస్తున్నాను.

**శ్రీ పోచారం శ్రీనివాస్ రెడ్డి:-** అధ్యక్షా, ఇది చాలా గొప్ప కార్యక్రమం. వారు ఏ కులమైనా, ఏ మతమైనా, చిన్న-సన్నకారు రైతులైనా జనాభాలో అత్యధికంగా 70 శాతం మంది రైతులున్నారు. వ్యాపారులతో గానీ, ఇతర వర్గాలతో గానీ పోల్చుకుంటే అప్పులు కూడా రైతులకే ఎక్కువగా ఉన్నాయి. ప్రతి సంవత్సరం రైతు అప్పు తీసుకునేదాక వారి సంసారం నడవదు. ఉదాహరణకు ఒక రైతు రూ.50,000/- బ్యాంకులో అప్పు తీసుకుంటే, పంట దిగుబడి రాకా, ధర లేక, నష్టపోయి మళ్లీ వచ్చే సంవత్సరం బ్యాంకు మేనేజరు దగ్గరకు వెళ్లి బ్రతిమిలాడుకొని, దండంపెట్టి నాకు ఇంకో ఇరవై వేలు ఎక్కువ అప్పు కావాలని కోరుతాడు. అంటే, ప్రతి సంవత్సరం అప్పులు పెంచుకొంటూ తమ వారసులకు అప్పులు ఇచ్చి పోతాడు. ఇది దేశంలో రైతుల పరిస్థితి. ఇటువంటి పరిస్థితిని అధిగమించి, స్వేచ్ఛగా, అప్పు లేకుండా తన స్వంత పెట్టుబడితోనే వ్యవసాయం చేసేవిధంగా తెలంగాణ రైతాంగాన్ని ప్రోత్సహించాలని గౌరవ ముఖ్యమంత్రి గారు తీసుకున్న ఈ నిర్ణయాలు చాలా అమోఘం.

అందులో మొదటిదిగా దేశంలో ఎక్కడా లేని విధంగా 24గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్న రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం. ప్రస్తుత ప్రధానమంత్రి గారు అయిన నరేంద్ర మోదీ గారు గుజరాత్ రాష్ట్రముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా హార్స్‌పవర్‌కు కొంత డబ్బులు వసూలు చేస్తుండేవారు. అది కూడా 24 గంటల విద్యుత్ కాదు. దేశంలో ఎకరానికి రూ.8,000/- ఇచ్చే రాష్ట్రం కూడా తెలంగాణ రాష్ట్రమే. అదేవిధంగా ఒక కోటి ఎకరాల బీడు భూములకు రెండు పంటలకు నీరందించబోతున్న ప్రభుత్వం టిఆర్ఎస్ ప్రభుత్వం. దీనికి తోడుగా పంటలు అధిక దిగుబడి సాధించడంతోపాటు అధిక ధరలు పొందాలంటే రైతు సంఘటిత శక్తిగా మారాలి. గౌరవ సభ్యులు శ్రీ కర్నె ప్రభాకర్ గారు చెప్పిన విధంగా ఇంతమంది రైతులున్నా సంఘటితంగా లేకపోవడం వల్ల ఎవరు ఏ పంట పండిస్తారో తెలియదు, ఎవరు ఎక్కడ అమ్ముకుంటారో తెలియదు. ఆ పరిస్థితుల్లో రైతులు అగమ్య గోచరంగా తయారైపోయి తమ ఉత్పత్తులను తక్కువ ధరకు అమ్ముకొని అప్పులు పెంచుకోవడం జరుగుతోంది.

గౌరవ ముఖ్యమంత్రి గారి ఆదేశానుసారం తక్షణమే 5వేల ఎకరాలకు ఒక వ్యవసాయ విస్తరణ అధికారిని నియమించుకోవాలని, వ్యవసాయ విస్తరణ అధికారులను కూడా నియమించుకోవడం జరిగింది. 2,638ఏఇఓల క్లస్టర్స్ ఏర్పాటు చేయడం జరిగింది. ఒక్కొక్క ఏ.ఇ.ఓ. పరిధిలో రెండు గ్రామాలు, మూడు గ్రామాలు, పెద్ద గ్రామం ఉంటే ఒకటే గ్రామం. కానీ, ఒక క్లస్టర్ క్రింద ఐదు వేల ఎకరాలు మాత్రమే ఉంటాయి. ప్రతి క్లస్టర్ క్రింద రైతు వేదికలు నిర్మిస్తాము. రైతు వేదికల కొన్ని ప్లాన్స్ తీసుకురావడం జరిగింది. ప్లాన్స్ ఇంకా ఫైనల్ కాలేదు.

(రైతు వేదికల భవన నిర్మాణ ప్లాన్స్ గౌరవ ఛైర్మన్ గారికి ఇతర గౌరవ సభ్యులకు సభలో చూపించడం జరిగింది)

గౌరవ ముఖ్యమంత్రి గారికి ప్లాన్స్ చూపించి ఫైనల్ చేస్తాము. ఈవిధంగా రైతులు కూర్చొని మాట్లాడడం కోసం రైతు వేదికలు నిర్మించాలని అనుకుంటున్నాము. అందులో ఏఇఓ గారి కార్యాలయం లేదు, వారికి కూడా అందులో ఒక చిన్న గది నిర్మిస్తాము. ఇవి మొత్తం 2,638. రాజేంద్రనగర్, కరీంనగర్ రైతు సమన్వయ సమితి ప్రాంతీయ సదస్సులో ఇప్పటికే కొంతమంది పెద్ద రైతులు ముందుకు వచ్చి విరాళాలు ప్రకటించగా, అవి రూ.17లక్షలు వచ్చాయి. అలాగే 30 ప్రాంతాల్లో 20ఎకరాల 31గుంటల భూములు కూడా విరాళాలుగా వచ్చాయి.

**11.00 ఉ.** ఇప్పటికే మా జిల్లా అధికారుల ద్వారా 2,638 క్లస్టర్స్‌లో ఈ విరాళం ఇచ్చిన భూములు కాకుండా, మరొక 654 క్లస్టర్స్ నిర్మించడానికి భూమి సిద్ధంగా ఉంది.

గౌరవ సభ్యులు కర్నె ప్రభాకర్ గారు చెప్పినట్లుగా, ప్రైవేటు భూమి ఇచ్చినట్లయితే రైతు వేదిక పైన వారి పేరు పెడతాం. ప్రభుత్వ భూమి గాని, ప్రైవేటు భూమి గాని దొరకకపోతే అవసరమైతే ప్రభుత్వమే భూమిని కొనుగోలు చేస్తుంది. అందుకు గౌరవ ముఖ్యమంత్రిగారు కూడా అంగీకరించారు.

ఊర్లోనే కడతారా, ఊరి బయట కడతారా అని గౌరవ సభ్యులు అడిగారు. రెండు గ్రామాలో, మూడు గ్రామాలో క్లస్టర్ కాబట్టి ప్రత్యేకంగా ఊర్లోనే ఆ వేదిక కట్టాలని ఏమీ లేదు. రైతులు మీటింగు ఏర్పాటు చేసుకోవడానికి, ఊరికి బయట అయినా, ఊరికి కిలో మీటరు దూరం అయినా సరే ఎక్కడ భూమి దొరికితే అక్కడ కొనుగోలు చేసి, ఆ వేదిక నిర్మిస్తాం. మొత్తానికి రైతు వేదికల ద్వారా రైతు సమన్వయ సమితికి సంబంధించిన అధికారులతో సమావేశం ఏర్పాటు చేసుకొని, వానాకాలం యాసంగి పంటకు ఎన్ని ఎకరాలు, ఏ పంట వేస్తున్నాం, ఏ విత్తనం కావాలని మంచి అధిక దిగుబడి ఇచ్చే విత్తనాలను ఎంపిక చేసుకొని ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ఇవ్వడం జరుగుతుంది.

అలాగే విత్తనం వేసే తేదీని కూడా నిర్ణయిస్తాం. ఇంత వరకు ఆగమాగం ఉండేది. మొక్కజొన్న పంటను ఫలానా తేదీకి వేయాలి కాని వేయరు, వరి పంటను ఫలానా తేదీకి కోయాలి కాని కోయరు, సోయాబీన్ ఫలానా తేదికి వేయాలి కాని వేయరు. కారణం వారికి తెలియక, సంఘటితం లేక పంటను వేయరు. ఇవ్వాళ రైతులను సంఘటితం చేసి, రైతు వేదికల ద్వారా సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుంది. ప్రభుత్వం విత్తనం వేసే తేదీని కూడా నిర్ణయిస్తుంది. రైతు సమయం అయిపోయిన తరువాత విత్తనం వేస్తే పంట రాదు అధ్యక్షా. అధిక దిగుబడి రావాలంటే ఆ సమయం లోపల సోయింగ్ కావాలి. ఆ రైతు వేదికల ద్వారా రైతు సమన్వయ సమితి మీటింగు ఏర్పాటు చేసుకొని, గ్రామాల వారీగా రైతులను పిలిచి, విత్తనం ఇవ్వడంతోపాటు, విత్తనం వేసే సమయాన్ని కూడా చెప్పి, విత్తనం వేయించడం జరుగుతుంది.

రాబోయే రోజులలో కూలీల సంఖ్య తగ్గుతోందని గౌరవ ముఖ్యమంత్రి గారు చెప్పారు. ఈ రైతు వేదికల ద్వారా రైతుల ద్వారా సమాచారాన్ని సేకరించి, ఆ గ్రామంలో వ్యవసాయానికి అవసరమైన యాంత్రీకరణ పనిముట్లు, ట్రాక్టర్లు, ప్లాంటేషన్ మిషన్లు, బ్రీడర్ మిషన్లు, హార్వెస్టింగ్ మిషన్లు ఎన్ని కావాలని లెక్క కట్టుకొని ఏఇఒలు, రైతు సమన్వయ సమితులు ఆ రైతు వేదిక ద్వారా చర్చించుకొని సమన్వయంతో ప్రభుత్వానికి సమాచారం పంపించినట్లయితే విడుతల వారీగా, ఆ ప్రాంతాల వారీగా ఈ వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లను అందజేయడం జరుగుతుంది.

కారణం ఏమిటంటే, రైతులు పంటలకు ఖర్చు చేసే పెట్టుబడి తగ్గాలి. రైతులకు తెలియక వారి పెట్టుబడి పెరిగిపోతుంది. ఎరువులు రెండు బస్తాలు వేసేది, నాలుగు బస్తాలు వేస్తున్నారు. ఆ భూమికి ఎంత కావాలో అంతే స్వీకరిస్తుంది, ఎక్కువ వేస్తే భూమి తన సారాన్ని కోల్పోయి దోమపోటుని, ఆ పోటు, ఈ పోటుని పంటకు రోగాలు రావడం వల్ల నష్టం వాటిల్లుతుంది. రైతు వేదికలనేవి రైతు యొక్క గుండె, రైతు యొక్క మందిరాల వంటివి. ఇవ్వాళ తమరు గాని, నేను గాని, కలెక్టర్ గాని, శాసనమండలి సభ్యులు గాని ఎవరు వెళ్లినా చెట్ల కిందనో, పుట్టల కిందనో కాకుండా రైతు వేదిక ద్వారానే సమావేశాలు జరగాలి, నిర్ణయాలు జరగాలి. ప్రభుత్వం ఎక్కువ సమయం తీసుకోకుండా త్వరలోనే ఈ వేదికలను నిర్మించి ఇవ్వడం జరుగుతుంది.

అదేవిధంగా గౌరవ సభ్యులు మాదిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి గారు 2,638 క్లస్టర్సను ప్రభుత్వం ఎప్పటిలోగ నిర్మిస్తుందని అడిగారు. బడ్జెట్‌లో కూడా దాని కొరకు నిధులు కేటాయించాం. నిధులకు కొరత లేదు. గౌరవ శాసనమండలి సభ్యులు కూడా దయచేసి వారి వారి ప్రాంతాలలో స్థలాన్ని ఇచ్చే వారిని ప్రోత్సహించండి. లేదా స్థానికంగా ఉన్నటువంటి తహసీల్దారులతో మాట్లాడండి. ఎందుకంటే అందరం గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన వారమే కాబట్టి. 654 క్లస్టర్స్ ఇప్పటికే రావడం జరిగింది. గౌరవ సభ్యులు ప్రభుత్వానికి సహకరించినట్లయితే బాగుంటుంది. త్వరలోనే మిగతావి కూడా నిర్మిస్తాం. గౌరవ ముఖ్యమంత్రి గారు ఈ 2,638 క్లస్టర్సని ఒకేసారి నిర్మించాలని ఆదేశాలిచ్చారు. స్థలాల కొరకు ప్రయత్నం చేస్తున్నాం. అందుకు గౌరవ సభ్యులు కూడా ఆ స్థలాల విషయంలో సహకరించి, ప్రభుత్వానికి అప్పగించినట్లయితే ముందుగానే ఇవన్నీ పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

అదేవిధంగా ప్రభుత్వం దగ్గర 2,638 క్లస్టర్స్‌కి రూ.316.50 కోట్ల నిధులు సిద్ధంగా ఉన్నాయి. అందులో ఎటువంటి ఇబ్బంది లేదు. ఇంతకుముందు గౌరవ సభ్యులు భానుప్రసాద రావు గారు మాట్లాడుతూ, 'Give it up' amount దీనికి వాడుతారా అని అడిగారు. గౌరవ ముఖ్యమంత్రిగారు ఒక ప్రకటనలో ఎవరైతే ఈ నాలుగువేల రూపాయలు అవసరం లేదని, దానిని ప్రభుత్వానికి సరెండర్ చేసినట్లయితే అది రాష్ట్ర రైతు సమన్వయ సమితి ఖాతాలోకి వెళుతుందని చెప్పడం జరిగింది. 'Give it up' amount వారి దగ్గర ఉంటే, వచ్చే

రోజులలో పండించిన పంట కారుచౌకగా అమ్మడానికి వీలులేదు. కనీస మద్దతు ధర లేకుండా అమ్మడానికి వీలు లేదు. కనీస మద్దతు ధర లేకపోతే, రాష్ట్ర రైతు సమన్వయ సమితి వారి దగ్గర కొంత డబ్బు పెడుతున్నాము, దానితో పాటు ఈ 'Give it up' amount కూడా కొంత వస్తుంది, ఇదంతా కలిపి, అవసరమైతే ప్రభుత్వమే గ్యారంటీ వహించి బ్యాంకుల నుండి లోన్లు కూడా ఇప్పించి, ఆ డబ్బుతో రైతు వేదిక వద్దనే రైతులకు వారి పంటలను నిర్దేశిత ధరకు కొనుగోలు చేస్తామనే భరోసా కల్పించడం జరుగుతుంది. అవసరమైతే రాష్ట్రరైతు సమన్వయ సమితి ఇన్వాల్వ్ అయి కనీస మద్ధతు ధర కంటే పది రూపాయలు ఎక్కువకు కొని రైతు ఖాతాలో డబ్బులు వేయడం జరుగుతుంది. ఈ విధంగా విత్తనం వేసిన దగ్గర నుంచి, పెట్టుబడి, దిగుబడితోపాటు అమ్మేంత వరకు ఈ రైతు వేదికల ద్వారా సమావేశాలు జరుపుకొని రైతును ప్రోత్సహించడం జరుగుతోంది. దీనివల్ల రైతుకు చాలా మేలు జరుగుతుంది. ప్రభుత్వం ఒక పక్క, రైతు సమన్వయ సమితి ఒక పక్క, రైతులు ఒక పక్క, ఇలా అందరం కలిసి పనిచేసి సంఘటిత శక్తిగా మారి, దేశంలోనే ఆదర్శ రైతుగా తయారు చేయాలనేది మన ప్రభుత్వ లక్ష్యం.

చివరగా సభ్యులు పాతూరి సుధాకర్ రెడ్డి గారు ఈ క్లస్టర్స్‌ను ఎవరు మంజూరు చేస్తారని అడిగారు. ఈ క్లసర్స్‌ని ప్రభుత్వమే మంజూరు చేస్తుంది. తప్పకుండా ఎక్కడెక్కడ నిర్మించాలో అక్కడక్కడ 2,638 క్లస్టర్స్‌ను త్వరలో నిర్మించి, గౌరవ సభ్యుల సహకారంతో రైతు వేదిక నిర్మించి, దేశంలో వ్యవసాయాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే మన ముఖ్యమంత్రి గారి లక్ష్యమని తెలియజేస్తూ, నేను సెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ వి. భూపాల్ రెడ్డి:–** అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారు కరీంనగర్‌లోని గ్రామం గురించి చెప్పారు. అదే విధంగా పంచాయతీ రాజ్ శాఖా మాత్యులు, సభ్యులు భాను ప్రసాద రావుగారు కూడా అనౌన్స్ చేశారు. పెట్టుబడి పెట్టే శక్తి ఉన్నవారు తీసుకోకుండా ప్రభుత్వానికి ఇచ్చినట్లయితే చాలా బాగుంటుందని సభ ద్వారా నేను తెలియజేస్తున్నాను. నాకు ఉన్న మూడు ఎకరాలే కాకుండా, మా తమ్ముళ్ల ఇరవై ఎకరాలతోపాటు మా కుటుంబాలో ఉన్న అందరి ఎకరాలకు కూడా ఈ పెట్టుబడిని తీసుకోకుండా ప్రభుత్వానికే చెల్లించే విధంగా బాధ్యత తీసుకుంటాం.

**శ్రీ పురాణం సతీష్ కుమార్ (స్థానిక సంస్థలు – ఆదిలాబాద్):–** అధ్యక్షా, గ్రామాలలోకి వెళ్లి వ్యవసాయ పెట్టుబడికోసం ఎకరానికి రూ.4,000/–, చొప్పున రెండు పంటలకు కలిపి సంవత్సరానికి రూ.8,000/– ఇస్తామని చెబుతున్నాం. రెండవ పంట వేస్తేనే రూ.4,000/– ఇస్తారా, వేయకపోయినా ఇస్తారా అని తెలియజేయవలసిందిగా తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డి:–** అధ్యక్షా, వానాకాల పంటకు ఏప్రిల్ 20వ తేది నుండి మే చివరి వరకు యాసంగి పంటకు నవంబర్ 20వ తేదీన ప్రారంభిస్తాం. అప్పటికి పంటలు వేసి ఉంటారు. తప్పనిసరిగా పంట వేసుకునే వారికి రూ.8,000/– ఇవ్వడం జరుగుతుంది. ఇంతకుముందు సభ్యులు భూపాల్ రెడ్డి గారు చెప్పారు. వారు వారి కుటుంబ సభ్యుల యొక్క భూములకు ప్రభుత్వం ఇచ్చేటువంటి పెట్టుబడిని తీసుకోకుండా, ప్రభుత్వానికే వాపసు చేస్తానని చెప్పారు. అందుకు వారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నాను.

**మిస్టర్ చైర్మన్:–** 'కళ్యాణ లక్ష్మి' పథకం విషయమై గౌరవ ఉప ముఖ్యమంత్రి శ్రీ కడియం శ్రీహరి గారు ప్రకటన చేయవలసిందిగా కోరుతున్నాను.

**శ్రీ కడియం శ్రీహరి:–** కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై ముఖ్యమంత్రి గారి తరపున నేను ఈ ప్రకటన చేస్తున్నాను.

### కళ్యాణ లక్ష్మి – షాదీ ముబారక్ పథకాలపై ప్రభుత్వ ప్రకటన

పేదరికం మనుషుల్ని అనేక రకాలుగా వేధిస్తుంది. పేదరికంతో బాధ పడే వారికి కొన్ని సార్లు సాంప్రదాయాలు కూడా భారంగా పరిణమిస్తాయి. మన సమాజంలో పెండ్లి అనేది చాలా ఖర్చుతో కూడుకున్న అంశం. అందులోనూ ఆడపిల్ల పెండ్లి మరింత భారంగా పరిణమించింది. ఈ భారం వల్లనే చాలా మంది తల్లిదండ్రులు తమ ఇంటి మహాలక్ష్మిగా గౌరవించే ఆడపిల్లని గుండెల మీద కుంపటిగా భావించే మానసిక స్థితికి గురవుతున్నారు. ఆడపిల్ల కడుపులో ఉండగానే, ఆ పిల్ల పెండ్లి కోసం చేయవలసిన ఖర్చును ఊహించి కొంతమంది భ్రూణ హత్యలకు పాల్పడుతున్న అమానుష సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. కొన్నిసార్లు పేదల ఇండ్లల్లో ఆడపిల్లలు పెండ్లి కాకుండానే మిగిలిపోతున్నారు. ఆడపిల్ల పెండ్లి చేయడం కోసం కుటుంబాలు అప్పుల పాలు అవుతున్నాయి. ఆర్థికంగా చితికిపోతున్నాయి. పరిపాలనలో మానవీయ విలువలు అడుగడుగునా ప్రతిబింబించాలని భావించే తెలంగాణా ప్రభుత్వం ఆడపిల్లలు ఎదుర్కొంటున్న కష్టాన్ని, వారి తల్లిదండ్రులు అనుభవిస్తున్న ఆవేదనని తీర్చాలని

భావించింది. ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన హామీ కాకున్నా, పేదరికం ప్రభావాలను అధ్యయనం చేసే క్రమంలో పరిస్థితిలోని తీవ్రత మమ్మల్ని కదిలించింది. అందుకే పేద ఆడపిల్లల పెండ్లికి ప్రభుత్వం ఆర్థికంగా అండదండగా నిలవాలని నిర్ణయం తీసుకున్నాం. కళ్యాణ లక్ష్మి అనే శుభ ప్రదమైన పేరుతో 2014 అక్టోబరు 2వ తేదీన ప్రత్యేక పథకాన్ని ప్రవేశ పెట్టాం.

ఆడపిల్లల కన్నీరు తుడిచి వారి తలపై కళ్యాణ అక్షింతలు చల్లిన ఈ పథకం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టను పెంచింది. కళ్యాణ లక్ష్మి ముఖ్యమంత్రి గారి హృదయానికి ఎంతో దగ్గరైన పథకం. అంతకంటే ఎక్కువగా ఈ రాష్ట్ర ప్రజలు మెచ్చిన పథకం. ఆడపిల్లల కండ్లల్లో ఆనందం నింపిన పథకం. మొదట ఈ పథకాన్ని 'కళ్యాణ లక్ష్మి' పేరుతో ఎస్సీ, ఎస్టీలకు, 'షాదీ ముబారక్' అనే పేరుతో మైనారిటీ వర్గాలకు ఆడపిల్లల పెండ్లికి రూ.51,000/- అందించే పథకంగా ప్రారంభించాం. ఆ తరువాత ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు సామాజిక వర్గంతో నిమిత్తం లేకుండా రాష్ట్రంలోని నిరుపేదలందరికీ వర్తింపచేశాం.

సార్థకమైన ఈ పథకం ప్రయోజనం మరింత పెంచాలనే ఉద్దేశ్యంతో ఈ పథకం ద్వారా అందించే మొత్తాన్ని గత ఏడాది రూ.75,116/-లకు పెంచాం. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు 3 లక్షల 60 వేల మందికి లబ్ధి చేకూరింది. కళ్యాణ లక్ష్మి చెక్కులు తీసుకుంటున్న సమయంలో తమకందిన సహాయానికి సంతోషిస్తూ, ఆడ పిల్లల తల్లులు ఆనంద భాష్పాలతో ప్రభుత్వాన్ని దీవిస్తున్నారు.

కళ్యాణ లక్ష్మి/షాదీ ముబారక్ పథకం ఇతర సామాజిక ప్రయోజనాలను సాధించింది. ఈ పథకం ద్వారా లబ్ధి పొందడానికి కనీస వయో పరిమితి 18 సంవత్సరాలుగా నిర్ణయించాం. దీంతో పథకం ప్రయోజనాలు పొందడం కోసం బాల్య వివాహాలు చేయకుండా 18 సంవత్సరాలు నిండే వరకు తల్లిదండ్రులు వేచి ఉంటున్నారు. ఈ విధంగా కళ్యాణ లక్ష్మి/ షాదీ ముబారక్ పథకం బాల్య వివాహాలను నిరోధించడానికి కూడా ఉపయోగపడుతున్నది. కళ్యాణ లక్ష్మి సహాయం అందుకున్న వివాహాలకు ప్రభుత్వ గుర్తింపుతో పాటు చట్టబద్ధత లభిస్తున్నది. ఇది ఈ పథకం సాధించిన మరో ప్రయోజనం.

అత్యంత మంగళకరమైన ఈ పథకానికి సంబంధించి మరో శుభవార్తను ఈ రోజు ఈ సభ ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నాను. కళ్యాణ లక్ష్మి/షాదీ ముబారక్ పథకం క్రింద ఆడపిల్ల పెండ్లికోసం అందించే మొత్తాన్ని రూ.75,116/- నుండి రూ.1,00,116/-లకు పెంచుతున్నామని ఎంతో సంతోషంతో ప్రకటిస్తున్నాను. ప్రభుత్వం తీసుకున్న ఈ మంచి నిర్ణయానికి ఆడపిల్లలు, వారి తల్లిదండ్రుల నుండే కాకుండా, సమాజ హితం కోరే వారందరి నుండి కూడా హర్షామోదాలు లభిస్తాయని విశ్వసిస్తున్నాను. వారి ఆశీర్వాదమే కొండంత అండగా సంక్షేమ రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతున్నామని సవినయంగా తెలియజేస్తున్నాను. జై తెలంగాణ.

## కేంద్ర ప్రభుత్వంచే గ్రామ పంచాయతీలకు ఆర్థిక సహాయం

ప్రశ్న నెం.2782(29)

డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి, సర్వశ్రీ బలసాని లక్ష్మీ నారాయణ మరియు కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఎం.ఎల్.సి.లుః- గౌరవనీయులైన పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:

అ) 2014-15, 2015-16, 2016-17, 2017-18 సంవత్సరాల కోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేసి, విడుదల చేసిన విషయం వాస్తవమేనా;

ఆ) అయితే, ఆ వివరాలేమిటి;

ఇ) ఉద్దేశించిన ప్రయోజనం నిమిత్తం విడుల చేసిన నిధులను ఖర్చు చేయడమయిందా?

**గౌరవనీయులైన పంచాయతీ రాజ్ శాఖ మంత్రి (శ్రీ జూపల్లి కృష్ణారావు)ః-** అ) అవునండీ.

| | | |
|---|---|---|
| ఆ) 2014-15 | = | 1245 కోట్లు |
| 2015-16 | = | 697 కోట్లు |
| 2016-17 | = | 935 కోట్లు |
| 2017-18 | = | 940 కోట్లు |

ఇ) అవునండీ.

**డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి**ః- అధ్యక్షా, గౌరవ మంత్రి వర్యులు ఆ సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేసి, విడుదల చేసిన మొత్తం వివరాలను ఇవ్వడం జరిగింది. చాలా సంతోషం.

కేంద్ర ప్రభుత్వం నుండి వివిధ పథకాల క్రింద గ్రామాలకు అందుతున్న సహాయం మరియు ఎన్ఆర్ఇజిఎస్ పథకం ద్వారా వస్తున్న నిధులు మరియు గ్రామ పంచాయతీలకు మన రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులు, అదేవిధంగా ఎంఎల్ఏలు, ఎంఎల్సిలు, మంత్రులు ఆయా ప్రాంతాలలో పర్యటిస్తున్నప్పుడు ప్రజల యొక్క అవసరాలను గుర్తించి, వారి

కోరిక మేరకు అందజేస్తున్నటువంటి ప్రత్యేక నిధులు, వీటన్నింటిని ఒక ఇంటిగ్రేటెడ్ పాలసీ క్రిందకు తీసుకువచ్చినట్లయితే బాగుంటుందని ఆ గ్రామ ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ప్రస్తుతం గ్రామాలలో చేస్తున్నటువంటి కార్యక్రమాల పట్ల ఒక అవగాహన లేకుండా ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు చేయడం జరుగుతున్నది. అయితే కేంద్రం మరియు మన రాష్ట్రం ద్వారా గ్రామాలకు వచ్చే మొత్తం నిధులు, ప్రత్యేక నిధులకు సంబంధించి ఒక ప్రణాళిక చేసుకొని తర్వాత వచ్చే రూ.5.00 లక్షలు గాని, రూ.10.00 లక్షలు గాని వస్తే, ఫలానా రోడ్డు కోసం గాని, కాలువ కోసం గాని, కమ్యూనిటి హాల్ కోసం గాని లేదా ఇతర అవసరాల కోసం గాని ఖర్చు పెట్టే విధంగా ఒక ప్రణాళిక బద్ధంగా చేయడానికి పంచాయతీ రాజ్ శాఖ ఏమైన ఆలోచన చేస్తున్నదా?

రెండు, ఈ మధ్యకాలంలో వచ్చిన ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా 80 శాతం నిధులు ఇచ్చినట్లయితే, 20 శాతం మన ప్రభుత్వం ఇవ్వాలని చెబుతున్నారు. చిన్న చిన్న గ్రామాలలో ఉన్న కార్యకర్తలు కష్టపడి కార్యక్రమాలు చేసినా కూడా ఆ పనులు జరిగిన తరువాత వారికి బిల్స్ రావడం లేదు. పంచాయతీరాజ్‌లో పనిచేసే ఉద్యోగులు చాలా నిర్లక్ష్యంగా, అసలు పట్టించుకోకుండా ఇబ్బంది పెడుతున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. మూడు, ఆ బిల్స్ కూడా సరిగా చేయడం లేదు. ఈ మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వం విధించిన జిఎస్‌టి ఇవ్వాలా, వద్దా, ఇస్తే ఎంత ఇవ్వాలని ఇంకా నిర్ణయం తీసుకోలేదు. కాబట్టి ఎన్ఆర్ఇజిఎస్ పనులు చేయడంలో, బిల్లింగ్ చేయడంలో ఇబ్బందులున్నాయి. పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది అధ్యక్షా.

నాలుగు, నాయొక్క సొంత నిధుల నుండి నా గ్రామంలో ఒక కమ్యూనిటీ హాల్‌కి ఇస్తే, 15 నెలల నుండి ఇంత వరకు పూర్తి చేయలేదు. గత ఆరు నెలలుగా ఆ ఎ.ఇ.ని, డి.ఇ.ని, కాంట్రాక్టర్‌ని కలిసి చెప్పినా కూడా ఇంత వరకు ఏ చలనం లేకుండా ఒక స్లాబ్ వేసి ఉంచారు. పూర్తి చేయడానికి నిర్లక్ష్యం వహిస్తున్నారు. కాబట్టి కొంతమంది అధికారులు చేస్తున్న చర్యల వల్ల మొత్తం శాఖకే నిర్లక్ష్యం ఉందనే పేరు వస్తోంది. దానికి సంబంధించి మంత్రి గారికి లెటర్ ఇస్తాను. మొత్తంగా ఒక పద్ధతి ప్రకారం ప్రణాళిక ఉండి వచ్చే నిధులను నిర్దేశిత కార్యక్రమాలకు ఖర్చు చేయాలి. బిల్లింగ్ అనేది తొందరగా జరగాలి, చేస్తున్న పనులకు వాళ్లకు డబ్బులు తొందరగా ముట్టాలి. జిఎస్‌టి మీద వెంటనే నిర్ణయం తీసుకోవాలని తమరి ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ బలసాని లక్ష్మీ నారాయణ (స్థానిక సంస్థలు - ఖమ్మం)**:- అధ్యక్షా, గౌరవ మంత్రిగారు 2014-15 నుండి 2017-18 సంవత్సరాల వరకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన లెక్కల గురించి చెప్పారు. నేను మంత్రిగారిని కోరేది ఏమిటంటే, 2014-15 సంవత్సరంలో రూ.1,245 కోట్ల నిధులు మంజూరు చేస్తే, 2015-16 సంవత్సరానికి వచ్చే సరికి రూ.697 కోట్ల నిధులు మాత్రమే మంజూరయ్యాయి. దీనికి కారణం ఏమిటి? సంవత్సర, సంవత్సరానికి మన జనాభా పెరుగుతూ ఉంటే, అవసరాలు పెరిగి నిధులు పెరిగే బదులు తగ్గుతూ వచ్చిన పరిస్థితి ఉన్నది.

2017-18 సంవత్సరాలో రూ.940 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఇంతకు ముందు సోదరుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి చెప్పినట్లు, పంచాయతీరాజ్ శాఖలో జరిగే పనులకు, మిగతా శాఖలలో జరిగే పనులకు చాలా తేడా ఉంటుంది. నాణ్యతలో తేడా ఉంటుంది, సరైన సమయంలో పనులు పూర్తిగాని పరిస్థితులున్నాయి.

అంతే కాకుండా ఎన్ఆర్ఇజిఎస్ క్రింద చేపట్టే పనులలో ప్రభుత్వం పది శాతం గ్రాంటును ఇస్తున్నట్లయితే, ఆ నిధులను అన్ని మండలాలకు సమాన నిష్పత్తిలో ఇవ్వవలసిన అవసరం ఉంది. ఎందుచేతనంటే, కొంతమంది అధికారులు లేదా నాయకులు వారికి ఇష్టమైన మండలాలు లేదా గ్రామాలలోనే పనులు చేస్తున్నారు. అటువంటి సందర్భంలో ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న పంచాయతీలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. వాటికి వేరే ఆదాయం కూడా లేని కొన్ని పంచాయతీలు ఉన్నాయి.

నేను తమరి ద్వారా మంత్రిగారిని కోరేది ఏమిటంటే, మార్చి నెలలో కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఎన్ఆర్ఇజిఎస్ బడ్జెట్‌ను గ్రామీణ ప్రాంతాలలో ఉండే గ్రామ పంచాయతీలలో రెండు సంవత్సరాల వరకు కేవలం ఇంటర్నల్ రోడ్డు, డ్రైన్స్‌కే తప్పనిసరిగా వాడే విధంగా చర్యలు తీసుకున్నట్లయితే, రాష్ట్రంలో ఉన్న గ్రామ పంచాయతీలు చాలా వరకు మెరుగుపడడంతోపాటు, పారిశుద్ధ కార్యక్రమం కూడా బాగుపడే అవకాశం ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లో ఎన్ఆర్ఇజిఎస్ నిధులతోపాటు ఎంఎల్‌సి, ఎంపి నిధుల నుంచి వచ్చిన 10 శాతం గ్రాంటుని కలుపుకొని అనుకున్న సమయంలో ఈ పనులను పూర్తి చేయాలని కోరుతున్నాను. 10 శాతం గ్రాంటు ఇచ్చి పనులు చేయించినా, పని చేసిన వారికి బిల్లులు రావడానికి సంవత్సరాల సమయం పడుతోందని ఇంతకుముందు పల్లా

రాజేశ్వర్ రెడ్డి గారు చెప్పారు. పని చేసిన వారికి, బిల్లులు రావడానికి సంవత్సరాలు పడుతుంటే ఇబ్బంది కలుగుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని ఒక రెండు నెలలో, మూడు నెలలో ఒక టైం ఫ్రేమ్ పెట్టి, ఆ సమయంలోగా ఆయా పనులను పూర్తి చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని తమరి ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ కసిరెడ్డి నారాయణ రెడ్డి:-** అధ్యక్షా, నాకున్న సందేహాలను చాలా వరకు గౌరవ సభ్యులు అడగడం జరిగింది. మార్చి నెల లోపల ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో చేసే పూర్తి చేయాలని సభ్యులు చెప్పారు. జి.ఓ.పాసీడింగ్స్ ఫిబ్రవరిలో రావడం జరిగింది. నా రిక్వెస్ట్ ఏమిటంటే, ఆయా గ్రామాలలో కూలీలు దొరకకపోవడం, కొన్ని చోట్ల ఇసుక సమస్య కూడా ఉన్నది. అందువల్ల వాటిని అధిగమించడానికి మార్చి 31 తర్వాత ఇంకొక 20 రోజులు పొడిగిస్తే బాగుంటుందని ఎక్కడైతే పనులు ఇచ్చారో వారందరూ అడుగుతున్నారు, కాబట్టి ఆ విషయాన్ని పరిశీలించాలని తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని నేను కోరుతున్నాను.

ఇంకొక విషయం ఏమిటంటే, ముఖ్యంగా ఈ పనులు తొందరగా చేయక పోవడానికి కారణం, ఈ పనులకు కూడా జిఎస్‌టి వర్తిస్తుందనే సందేహం ఉంది. కాబట్టి గౌరవ మంత్రివర్యులు దీని గురించి వివరణ ఇస్తే బాగుంటుంది. ఈ ఎన్ఆర్ఇజిఎస్ నిధులన్నీ సిసి రోడ్ల నిర్మాణానికే వినియోగిస్తున్నారు. మురికి కాలువలకు ఈ ఎన్ఆర్ఇజిఎస్ నిధులను ఎందుకు ఉపయోగించ కూడదని నాకు ఒక సందేహం ఉన్నది. దీనికి సంబంధించి వివరణ ఇస్తే బాగుంటుందని తమరి ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

11.20 ఉ. **డా. ఆర్. భూపతి రెడ్డి:-** అధ్యక్షా, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గ్రామ పంచాయితీలకు 'నరేగా' ద్వారా వచ్చే నిధులను తప్పనిసరిగా ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సీసీ రోడ్డుల నిర్మాణం కొరకు మరియు లేబర్ ఎక్కువగా ఉన్న చోట మాత్రమే ఈ నిధులను ఉపయోగించాలి. గ్రామ పంచాయితీల నుండి ప్రతిపాదనలు రావాలి. గత సంవత్సరం మేము సుమారు రూ.20లక్షల కాంట్రిబ్యూషన్‌తో దాదాపు రూ.2కోట్ల వర్క్స్ కోసం ప్రపోజల్ పెడితే ఇంత వరకు శాంక్షన్ కాలేదు. మా నియోజకవర్గంలో ముబారన్ అనే గ్రామంలో లేబర్ కంపోనెంట్ అసలు జరగలేదు. ఆ ఒక్క గ్రామానికి దాదాపు రూ.90 లక్షల వరకు ప్రపోజల్స్ వచ్చాయి. ఎక్కడైతే లేబర్ వర్క్స్ జరగలేదో అక్కడ సీసీ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. కొన్ని గ్రామాలలో సర్పంచ్‌లు కష్టపడి వర్క్స్ తెచ్చుకున్నా అక్కడ సీసీ రోడ్ల నిర్మాణాలు జరగడం లేదు. లేబర్ కాంపోనెంట్ 60 శాతం ఉంటే 40 మెటీరియల్ కాంపోనెంట్ వస్తుంది. అయినా కూడా ఆ ప్రాంతాలలో నిర్మాణ కార్యక్రమాలు జరగడం లేదు. గ్రామ పంచాయితీలకు ఎం.పి.పి.లకు తెలియకుండా ప్రపోజల్స్ వస్తున్నాయి. ఎక్కడైతే ఎస్సీ, ఎస్టీ కాలనీలు ఉన్నాయో అక్కడ రోడ్ల నిర్మాణం చేపట్టకుండా బీసీ, ఓసీ కాలనీల్లో నిర్మాణాలు జరుగుతున్నాయి. ఆ పనులు సక్రమ పద్ధతిలో జరిగేలా చూడాలని తమరి ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ జూపల్లి కృష్ణారావు:-** అధ్యక్షా, గౌరవ సభ్యులు వివిధ అంశాలను ప్రస్తావించడం జరిగింది. 13వ ఫైనాన్స్ కమీషన్ ప్రకారం గ్రామాలకు 50 శాతం, మండలాలకు 30 శాతం, జిల్లా పరిషత్తులకు 20 శాతం ఇవ్వడం జరిగేది. 14వ ఫైనాన్స్ కమీషన్ 100 శాతం నిధులు నేరుగా గ్రామ పంచాయితీలకే ఇస్తోంది. వచ్చిన నిధులను ప్రణాళికా బద్ధంగా ఖర్చు పెట్టాలని గౌరవ సభ్యులు డా. పల్లా రాజేశ్వర్ రెడ్డిగారు ప్రస్తావించారు. గ్రామాలలో ఏ అవసరాలకు ఎంత ఖర్చు పెట్టాలి అనే నిర్ణయాలకు గాను గ్రామ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగింది. గ్రామ జ్యోతి కార్యక్రమం కూడా అందులో భాగంగా ఏర్పాటు చేయడమైనది. పరిశుభ్రత, ఆరోగ్యం మొదలగు అంశాలకు సంబంధించి ఆయా గ్రామాల ప్రాధాన్యతను బట్టి ఆ నిధులను కేటాయించడం జరుగుతోంది.

గతంలో గ్రామ పంచాయితీలకు బీఆర్‌జిఎఫ్ ద్వారా కూడా నిధులు వచ్చేవి. అప్పుడు వాటి ద్వారా ఆరోగ్యం, శానిటేషన్, డ్రైనేజీ, మొదలగు అంశాలకు ఖర్చు పెట్టడం జరిగేది. ఇప్పుడు ఆ నిధులను నిలిపివేయడం వలన కొరత ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వం ద్వారా మరియు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిధులు వచ్చినా గ్రామ సమస్యలు, మౌలిక సమస్యలు పరిష్కారం కావాలనేది అందరి లక్ష్యం. ఆ ఉద్దేశ్యంతో గౌరవ ముఖ్యమంత్రిగారు రాష్ట్ర ప్రభుత్వం తరపున స్టేట్ ఫైనాన్స్ కమీషన్ ద్వారా లోకల్ బాడీస్‌కు దాదాపు రూ.1200 కోట్ల నిధులను కేటాయించడం జరిగింది.

కొత్తగా పంచాయితీ రాజ్ సంస్థల యాక్ట్‌ను తీసుకురావడం జరుగుతోంది. దీనిలో ప్రాధాన్యతా క్రమంలో క్లీన్ & గ్రీన్ కార్యక్రమం ఉండాలి. గ్రామ పంచాయితీలకు నిధులు, అధికారాలు ఇస్తూ దేనికి ఎంత నిధులను ఇచ్చేది రేషియో ప్రకారం కేటాయించడం జరుగుతోంది. స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలు అయినా ఆశించిన ఫలితాలు రావడం లేదనేది వాస్తవం. దానిని అధిగమించడం కోసం అవసరమైన

నిధులు, అధికారాలు ఇస్తూ, అనుకున్న లక్ష్యం నెరవేరే విధంగా పంచాయితీ రాజ్ యాక్ట్‌లో పొందుపరుస్తూ దానికి సంబంధించిన గైడ్‌లైన్స్‌ను కూడా రూపొందిస్తూ కొత్త చట్టం ఈ సమావేశాల్లోనే ప్రభుత్వం ప్రవేశపెడుతుంది.

గ్రామాలలో ఎల్ఈడీ లైట్ల కోసం 14వ ఫైనాన్స్ కమీషన్ నిధుల నుండే 100 శాతం లైట్స్ ఇచ్చే విధంగా ఏర్పాటు చేస్తున్నాము. దీనిద్వారా గ్రామాలలో ఎక్కడా చీకటి లేకుండా వెలుతురును ఇవ్వడంతోపాటు, ఖర్చు కూడా తగ్గుతుంది. అదే విధంగా పంచాయితీ రాజ్ పనులు చేయించే సందర్భంలో జాప్యం జరుగుతోందని, బిల్స్ రావడం లేదని, నిర్లక్ష్యం గురించి గౌరవ సభ్యులు ప్రస్తావించారు. ఒక బిల్డింగ్ నిర్మాణంలో జాప్యం గురించి 17 మాసాలు అయినది అని ప్రస్తావించారు. దానికి సంబంధించిన పూర్తి వివరాలను మాకు పంపిస్తే దానిపై ప్రత్యేకంగా ఎంక్వైరీ చేయించి, ఎందుకు జాప్యం జరిగిందో తెలుసుకొని దాని మీద తగిన చర్యలు తీసుకుంటామని తెలియజేస్తున్నాను.

గత సంవత్సరం సీసీ రోడ్ల నిర్మాణం కోసం మార్చి నెలలో దాదాపు రూ.750 కోట్లను మంజూరు చేయడం జరిగింది. ఉన్నటువంటి సిబ్బందితోనే దాదాపు ఒక నెల లోపులో దానికి సంబంధించిన బిల్స్ రికార్డ్ చేసి, UCలు ఇచ్చి, cube testing చేసి, ఆన్‌లైన్‌లో ఫండ్ ట్రాన్స్‌ఫర్ జనరేట్ చేయడం వలన గత సంవత్సరం మనకు ఒక రూపాయి కూడా ల్యాప్స్ కాలేదు. ఎక్కడన్నా ఒక చోట వ్యక్తి పరంగా, లేదా ఉద్యోగి పరంగా ల్యాప్స్ ఉంటే ఉండవచ్చు. లేవని నేను అనను. అటువంటి వాటిని సభ్యులు సభ ద్వారా మా దృష్టికి తీసుకొని వస్తే వాటిపైన చర్య తీసుకుంటామని తెలియజేస్తున్నాను. ఉన్న సిబ్బందితోనే ఎక్కువ పనులు ఉన్నా అనుకున్న సమయానికి పూర్తి అయ్యేటట్లు చేస్తున్నాము.

అదే విధంగా జీఎస్టీ విషయం గురించి ప్రస్తావించడం జరిగింది. దీనికి సంబంధించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కాంట్రాక్టర్ అయినా, గ్రామ పంచాయితీ అయినా కూడా జీఎస్టీలో రిజిస్టర్ చేసుకోవాలి. మట్టి పనులకు అయితే 5 శాతం, అది కాకుండా వేరే పనులకు 12 శాతం జీఎస్టీ చెల్లించాలి. ఇవన్నీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా యొక్క రూల్స్. గత సంవత్సరం 20 శాతం మార్జిన్ మనీతో నరేగా వర్క్స్ ఇవ్వడం జరిగింది. ప్రస్తుత సంవత్సరం 10శాతానికి తగ్గించి నిధులను మంజూరు చేయడం జరిగింది.

అదే విధంగా బిల్సుకు సంబంధించి జాప్యం జరుగుతోందని ప్రస్తావించారు. నరేగా చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం మెటీరియల్ కంపోనెంట్‌కు నిధులు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నుండి వస్తున్నాయి. మనం ఆశించిన రీతిలో కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు రావడం లేదు. దాని మూలంగా బిల్స్ విషయంలో కొంత జాప్యం జరుగుతోంది. గత సంవత్సరం కేంద్ర ప్రభుత్వం ఆ నిధులను ఇవ్వకున్నా కూడా రాష్ట్ర ప్రభుత్వమే ఆ నిధులను అదనంగా ఇచ్చి కొంత వెసులుబాటు కల్పించి సీసీ రోడ్లకు సంబంధించిన బిల్స్‌ను 90 శాతం వరకు చెల్లించడం జరిగింది. ఇంకా ఏమన్నా 10 శాతం ఉంటే వాటిని కూడా త్వరలో చెల్లిస్తామని తెలియజేస్తున్నాను. నిధుల మంజూరు సంబంధించి ప్రస్తుత సంవత్సరం కలెక్టర్లకే అధికారాలిచ్చి దాదాపు రూ.500 కోట్లు వరకు గ్రామాలను బట్టి, గ్రామ అవసరాలను బట్టి వారికి అధికారాలు ఇచ్చి వారే శాంక్షన్ చేసే బాధ్యతలను ఇవ్వడం జరిగింది. కొన్ని అవసరాలకు రాష్ట్రప్రభుత్వం నుండి కూడా నిధులను ఇవ్వడం జరుగుతోంది.

డ్రైనేజీకి సంబంధించిన నిధులను ఎందుకు వాడటం లేదని అడిగారు. కేరళ రాష్ట్రంలో డ్రైనేజీ సిస్టమ్ అనేదే లేదు. కారణమేమంటే 100 శాతం మరుగుదొడ్ల నిర్మాణం చేసుకున్న తరువాత, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసిన తరువాత, వర్షపు నీరైనా, కిచెన్ వాటర్ అయినా, బాత్‌రూమ్ వాటరైనా ఇంకుడు గుంతలోకి, టాయిలెట్స్‌లోకి వెళుతున్న కారణంగా ఆ ఇంటి ఆవరణ నుంచి మురికి నీరు గాని, మంచి నీరు కాని, రోడ్ పైకి రాదు. మన దగ్గర డ్రైనేజీ నిర్మాణం చేసినా కూడా సరిపడినంత నీరు లేని కారణంగా అది మొత్తంగా సోక్ అయిపోయి లాభం కన్నా, నష్టం ఎక్కువగా జరుగుతోంది. గౌరవ ముఖ్యమంత్రిగారి ఆలోచన మేరకు మిషన్ భగీరథ కార్యక్రమం ద్వారా ప్రతి మనిషికి 100 లీటర్లు ఇస్తున్నాము కాబట్టి, వాటికి కొంత వెసులుబాటు కలుగుతుంది. వాటిని కొంత క్లియర్ చేసుకోవచ్చు. గ్రామ పంచాయితీ ద్వారా వెట్, డ్రై బాక్స్‌లను సప్లై చేయిస్తున్నాము. డ్రైనేజీ సమస్యను తగ్గించే ఏర్పాట్లు చేస్తున్నాము. కొన్ని గ్రామ పంచాయితీలలో వేస్ట్ కాంపోనెంట్ లేకపోయినా కూడా ఆయా గ్రామాల మెటీరియల్ కాంపోనెంట్ శాంక్షన్ ఇవ్వడం జరిగింది. అవసరాన్ని బట్టి ఆయ సమస్యలను పరిష్కారం చేసుకోవడానికి జిల్లా కలెక్టర్లకు అధికారం ఇవ్వడం జరిగింది.

గతంలో నరేగాకి సంబంధించి 2004 నుండి ఏ ఒక్క సంవత్సరం కూడా రూ.100 కోట్లు కూడా సీసీ రోడ్ల కోసం ఖర్చు పెట్టలేదు. గడిచిన రెండు సంవత్సరాల నుండి మనం మెటీరియల్ కాంపోనెంట్ ల్యాప్స్ కాకుండా 100 శాతం నిధులను ఖర్చు పెట్టి వినియోగించుకోవడం జరుగుతోంది.

**మిస్టర్ ఛైర్మన్ః–** ఇప్పుడు ప్రత్యేక ప్రస్తావనలు

## ప్రత్యేక ప్రస్తావనలు

**శ్రీ ఎస్. రామచంద్రరావు (పట్టభద్రుల నియోజక వర్గం – మహబూబ్‌నగర్, రంగారెడ్డి మరియు హైదరాబాద్)ః–** అధ్యక్షా, ప్రభుత్వ న్యాయవాదులు అన్ని జిల్లా కోర్టులలో పనిచేస్తున్నారు. వీరు ప్రభుత్వ కేసులను తప్ప వేరే కేసులను టేకప్ చేయరు. ప్రభుత్వానికి సంబంధించిన భూముల మరియు ఇతర కేసులను వాదిస్తుంటారు. గత అనేక నెలలుగా వీరికి జీతాలు అందడం లేదని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం కోసం పనిచేసేటటువంటి న్యాయవాదులకు వేతనాలు సరైన సమయానికి చెల్లించకపోతే ఇబ్బంది అవుతుంది కాబట్టి, ప్రభుత్వ న్యాయవాదులకు చెల్లించవలసిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని తమరి ద్వారా కోరుతున్నాను.

**శ్రీ కర్నె ప్రభాకర్ః–** అధ్యక్షా, ప్రజలు తమ సమస్యలను పరిష్కారిస్తారనే నమ్మకంతో ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతే తప్పకుండా గౌరవ ముఖ్యమంత్రిగారు పరిష్కరిస్తారనే విశ్వాసంతో ఉన్నారు. అనేక విజ్ఞప్తులను ఈ మధ్యకాలంలో గౌరవ ముఖ్యమంత్రిగారు పరిష్కరించడం జరిగింది. ఆ కోవలోనే గతంలో తమరి అనుమతితో ఇదే సభలో రాచకొండకు సాగునీటి వసతి కల్పించడానికి లిఫ్టులు మంజూరు చేయాలని, వాటి ద్వారా మునుగోడు నియోజక వర్గంలోని సంస్థాన్ నారాయణ్‌పూర్, రంగారెడ్డి జిల్లాలోని మంచాల, యాచారం, ఇబ్రహీం పట్టణానికి లిఫ్ట్‌ల ద్వారా సాగునీరు అందించాలని నేను విజ్ఞప్తి చేయడం జరిగింది. రాచకొండ లిఫ్ట్‌ల ద్వారా ఆ ప్రాంతం అంతా సస్యశ్యామలం అవుతుందనే వార్తలను నిన్న వార్తా పత్రికలో చూడడం జరిగింది. ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఒక వైపు చర్లగూడెం రిజర్వాయర్ నిర్మాణం జరుగుతున్నది కాబట్టి, దానికి సమాంతరంగా కాల్వల నిర్మాణం, లిఫ్టుల నిర్మాణం కూడా చేసినట్లైతే ఆ ప్రాంతంలోని ప్రజలు ఫ్లోరోసిస్ వ్యాధికి గురవుతున్న దృష్ట్యా ప్రభుత్వం లిఫ్టులు, కాల్వల నిర్మాణం ఇతర పనులను వేగవంతంగా చేయడానికి వీలుగా లిఫ్టులకు సంబంధించిన సర్వేలు నిర్వహించి, లిఫ్టులను త్వరలో ఏర్పాటు చేయవలసిందిగా తమరి ద్వారా గౌరవ ముఖ్యమంత్రిగారిని మరియు ఆ శాఖ మంత్రిగారిని కోరుతున్నాను.

## పిటీషన్స్

**శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డిః–** అధ్యక్షా, రాష్ట్రంలో సర్వ శిక్షా అభియాన్ ద్వారా సుమారు రాష్ట్రంలో 2300 మంది క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ పనిచేస్తున్నారు. గతంలో వారికి చెల్లించాల్సిన వేతనం చెల్లించకుండా ఎక్కువ మందిని నియమించి, ఆ వేతనం యొక్క నిధులను సరిగ్గా సమభాగం చేసి అందరికీ చెల్లించడం వలన ఒక్కొక్క రిసోర్స్ పర్సన్స్‌కు అందవలసిన దానికన్నా తక్కువ వేతనం లభించేది. కేంద్రంలో ఇప్పుడు పిఏబి సమావేశం జరుగుతుంది కాబట్టి, ఆ సమావేశంలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ యొక్క వేతనాలు స్పష్టంగా ఒక స్కూల్ అసిస్టెంట్ స్థాయి మూల వేతనం ఏదైతే ఉన్నదో దాని సమానంగా క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్‌కు వేతనం చెల్లించేటట్లుగా పిఏబి సమావేశంలో ప్రస్తావించి, దానికి అనుగుణంగా వేతనాలు పెంచాలని క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ సంఘం వారు ఇచ్చిన పిటీషన్‌ను తమరి ద్వారా గౌరవ మంత్రిగారికి అందజేస్తున్నాను.

(పిటీషన్‌ను గౌరవ ఛైర్మన్‌గారికి అందజేయడం జరిగింది.)

MR. CHAIRMAN:- All the papers are deemed to have been laid on the Table.

PAPERS LAID:

A copy of the 96th Annual Report & Account of Singareni Collieries Company Limited for the year 2016 -2017, as required under Section 394 of the Companies Act, 2013.

**మిస్టర్ చైర్మన్ః–** టీ విరామం కొరకు సభను 15 నిమిషాల పాటు వాయిదా వేయడమైనది.

(టీ విరామం కొరకు సభ ఉదయం 11.36 గంటలకు వాయిదా పడింది.)

12.00 మ. (టీ విరామానంతరం సభ మధ్యాహ్నం 12.00 గంటలకు ప్రారంభమైనది)

(గౌరవ ఛైర్మన్ అధ్యక్ష స్థానం వహించారు)

**మిస్టర్ ఛైర్మన్ః–** నమస్కారం. 2018–19 సంవత్సరపు వార్షిక బడ్జెట్‌పై సాధారణ చర్చను ప్రారంభించవలసిందిగా శ్రీ ఎస్. రామచంద్రరావు గారిని కోరుతున్నాను.

**శ్రీ ఎస్. రామచంద్రరావుః–** అధ్యక్షా, ముందుగా ఈ సంవత్సరపు బడ్జెట్‌పై సాధారణ చర్చలో మాట్లాడేందుకు అవకాశం కల్పించినందుకు తమకు నా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. ఈ సంవత్సరపు బడ్జెట్ చాలా భారీ బడ్జెట్‌గా పేర్కొనవచ్చు. ఇది ఐదవ బడ్జెట్. అలాగే ఆఖరి బడ్జెట్ కూడా. దాని తరువాత ఓట్–ఆన్–అకౌంట్ ఉంటుంది. కాబట్టి ఈ బడ్జెట్‌లో అనేక విషయాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించినట్లుగా కనిపిస్తున్నది. ఎన్నికలు కూడా దగ్గరలోనే ఉన్నాయి. అన్ని అంశాల ప్రభావం ఈ బడ్జెట్‌లో ప్రతిఫలిస్తోంది.

గత సంవత్సర బడ్జెట్ అంటే 2017-18వ సంవత్సరానికి రూ.1,49,320 కోట్లు కేటాయించుకున్నాము. ఈ సంవత్సరం అంటే 2018-19వ సంవత్సరానికి ఆ మొత్తాన్ని పెంచి, రూ.1,74,482 కోట్లు కేటాయించుకున్నాము. ఇంతకుముందు నేను చెప్పినట్లు నిజంగా ఇది చాలా భారీ బడ్జెట్. ఇందులో రెవెన్యూ రిసీట్స్ రూ.1,30,975 కోట్లుగా చూపించారు. పబ్లిక్ డెట్ రూ.33,200 కోట్లు, లోన్ రికవరీస్ రూ.7807 కోట్లుగా చూపించారు.

ముఖ్యంగా వ్యవసాయ శాఖకు చాలా భారీ ఎత్తున ప్రభుత్వం నిధులు కేటాయించి, ఖర్చు పెడుతున్న విషయం మనం ఇక్కడ గుర్తించవలసి ఉంది. జిఎస్‌డిపి గ్రోత్ విషయంలో మన రాష్ట్రం జాతీయ సగటు వృద్ధి కంటే ఎక్కువ రేటుని సాధించడం సంతోషకరం. మిగతా రాష్ట్రాల కంటే మనం ఎక్కువ నిధులు కేటాయించి, ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వం పదే పదే చెప్పడం జరుగుతున్నది. అలాగే 2018-19వ సంవత్సరానికి జిఎస్‌డిపి రూ.8,42,000 కోట్లు. అంటే 15% higher than the estimate అని చెపుతున్నారు. అదే విధంగా Revenue surplusలో కుడా 3.5% జిఎస్‌డిపి వృద్ధిని చూపిస్తున్నాము.

అదే విధంగా విద్యా రంగం విషయానికి వచ్చినట్లయితే 2018-19వ సంవత్సరానికి 8.2 శాతం అదనంగా నిధులు కేటాయించడం జరిగింది. ఇతర రాష్ట్రాలతో పోల్చి చూసినట్లయితే ఇది చాలా తక్కువే. ఈ విషయంలో మనం 19వ స్థానంలో ఉన్నాము. గత సంవత్సరం కూడా కేటాయించిన బడ్జెట్‌ని పూర్తిగా ఖర్చు చేయలేకపోయిన విషయం ఇక్కడ మనం గమనించవలసి ఉంది. నిధుల కేటాయింపు పెంపు చేసినప్పటికీ, వాటిని ఖర్చు పెట్టలేకపోతే ఆశించిన ప్రయోజనం చేకూరదు.

ఆరోగ్య రంగానికి వచ్చినట్లయితే మొత్తం బడ్జెట్‌లో 4.7 శాతం నిధులు కేటాయించడం జరిగింది. ఇది మిగతా 18 రాష్ట్రాల సగటు కన్నా తక్కువ. ఇది వరకు కేటాయించిన 4.3 శాతం కన్నా స్వల్పంగా పెంచి 4.7 శాతం చేయడం జరిగింది. రాష్ట్రంలో కొత్తగా నాలుగు మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేస్తున్నట్లుగా ప్రభుత్వం చెప్పడం జరిగింది.

వ్యవసాయ రంగానికి కేటాయించిన బడ్జెట్ 10.9 శాతం. ఈ విషయంలో ఇతర 18 రాష్ట్రాల కంటే ఎక్కువగా నిధుల కేటాయింపు జరిగింది. గత సంవత్సరం 5.9 శాతం కేటాయింపు జరిగింది. అంటే ఈ సంవత్సరం రెట్టింపు బడ్జెట్ కేటాయించారని తెలుస్తోంది. జిఎస్‌డిపి విషయంలో దేశీయ సగటు కన్నా ఎక్కువగా ఉన్నామని చెప్పినా, ఇతర రాష్ట్రాలతో పోల్చినప్పుడు మనం దేశంలో తెలంగాణ రాష్ట్రం ఎనిమిదవ స్థానంలో ఉన్నాది.

ఈ రోజు బడ్జెట్‌లో ఎంబిసిలకు రూ.1,000 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో కూడా ఇంతే మొత్తాన్ని కేటాయించారు. అయితే ఎంబిసిలను ఇప్పటివరకు ఐడెంటిఫై చేసి విధి విధానాలు జారీ చేశారా, లేదా, డబ్బు ఖర్చు చేయడానికి విధి విధానాలు రూపొందించారా అనేది తెలియదు. ఎంబిసిలకు కేటాయించిన డబ్బు పూర్తిగా ఖర్చు కావడం లేదు. అదే విధంగా న్యాయవాదుల సంక్షేమ నిధి కొరకు రూ.100 కోట్లు కేటాయించారు. నేను కూడా బార్ కౌన్సిల్ సభ్యుడినే. ఇందుకు నేను చాలా సంతోషిస్తున్నాను. గత బడ్జెట్‌లో కేటాయించిన డబ్బులో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయడం జరగలేదని ఈ సందర్భంగా తెలియజేసుకుంటున్నాను. ఈ విధంగా గత బడ్జెట్‌లో ఖర్చు చేయకపోయినప్పటికీ, ఈ సంవత్సరం కూడా ఎక్కువ కేటాయింపులు చూపిస్తున్నారు. అసలు ఏ మాత్రం ఖర్చు పెట్టని అంశాలు కూడా మనకు కనబడుతున్నాయి.

ఈ సంవత్సరం బడ్జెట్ రూ.1.74 లక్షల కోట్లు. దీని వలన మన రాష్ట్రంలో ఉన్న ప్రజలపైన ఎంత వరకు భారం పడుతుందనే విషయం గురించి కూడా ఆలోచించవలసిన అవసరం ఉంది. ఈ రోజు per capita income లో గాని, లేదా budget spending లో గాని చాలా గొప్పగా చెప్పినప్పటికీ, ప్రతి వ్యక్తి పైన రూ.54 వేల రుణ భారం ఉంది. మన రాష్ట్రం ఏర్పడినప్పుడు ఒక ధనిక రాష్ట్రంగా ఏర్పడింది. ఆనాడు మనది మిగులు రాష్ట్రం. కాని ఈ రోజు మనం ఎంత అప్పుల్లో ఉన్నామనే విషయం గుర్తు పెట్టుకోవలసి ఉంది. గత సమావేశాలప్పుడు కూడా మన ముఖ్యమంత్రిగారు సభలో చెప్పారు అప్పులు తీసుకోవడంలో తప్పేమీ లేదని. ఏ ప్రభుత్వమైనా అప్పు తీసుకోవలసి ఉంటుంది. ఎందుకంటే అభివృద్ధి కొరకు అప్పులు తీసుకోవలసి వస్తుంది. కేంద్ర ప్రభుత్వం కూడా అప్పులు తీసుకుంటుందని చెప్పారు. కాబట్టి అప్పు తీసుకున్నంత మాత్రాన దానిని తప్పు పట్టవలసిన అవసరం లేదు అన్నారు. వాస్తవమే. నేను ఒప్పుకుంటా. ఎకనామిక్స్‌లో మాకు ఒక పాఠం చెప్పేవారు. It is like a family budget. ఉదాహరణకు నాకు పదివేల జీతం వస్తుంటే, అందులో నేను నా కొడుకు స్కూల్ ఫీజు ఎంత కట్టాలి, మా అమ్మాయి కాలేజీ ఫీజు ఎంత కట్టాలి, ఇల్లు మెయిన్‌టెనెన్స్‌కి ఎంత ఖర్చు పెట్టాలి అనే అంశాలు లెక్క వేసి, సేవింగ్స్ ఏమైనా మిగిలితే దానికి ఒక ప్రణాళిక వేసుకుంటాను. కాని నాకు స్తోమత లేకున్నా నా కొడుక్కి

మోటర్ సైకిల్ కొనడం, ఇంట్లో అనవసరపు ఖర్చులు చేయడం వంటివి శ్రేయస్కరం కాదు. తీసుకున్న అప్పులు ఏ విధంగా కట్టాలి అనే ఆలోచన కూడా అవసరం. The same principle will apply to the States as they are running with public funds. ప్రభుత్వానికి రెవెన్యూ వస్తుంది. అందులో రెవెన్యూ రిసీట్స్ ఎన్ని ఉన్నాయి, ఎంత ఖర్చు పెడుతున్నాము, ఎన్ని అప్పులు తీసుకువస్తున్నాము, ఆ అప్పులను ఏ విధంగా చెల్లిస్తాము అనేవి చాలా ముఖ్యమైన అంశాలు.

ఇక సంక్షేమ పథకాల విషయానికి వచ్చినట్లయితే దళిత కుటుంబానికి మూడు ఎకరాల భూమి ఇస్తామని చెప్పారు. Yes, that is a welcome step. ఎందుకంటే ఈ రోజు మన రాష్ట్రంలో దళితులు చాలా బీద స్థితిలో ఉన్నారు. Below poverty line లో ఉన్నారు. అనేక సంవత్సరాలుగా వారిని ఎవరూ పట్టించుకోలేదు. అయితే ప్రభుత్వం ఇచ్చిన లెక్కల ప్రకారం ఇప్పటి వరకు కేవలం 9 వేల మంది కుటుంబాలకు మాత్రమే ఈ మూడు ఎకరాల భూమిని కేటాయించడం జరిగింది. ఈ రోజు బడ్జెట్‌లో కేటాయించిన డబ్బు ఏదైతే ఉందో దానితో కేవలం 30 వేల మంది దళిత కుటుంబాలకు మాత్రమే భూమి ఇచ్చే అవకాశం ఉంటుంది. కాని ఈ రాష్ట్రంలో లక్షలాది మంది దళితులు ఉన్నారు. ప్రభుత్వం కేటాయించిన డబ్బు వారందరికీ సరిపోతుందా? దానిని మీరు ఏ విధంగా సమర్థించుకుంటారు? Your amount is not sufficient for Dalit families who are in agriculture field.

అదే విధంగా డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం. ప్రభుత్వం నాన్ బడ్జెటరీ ఫైనాన్స్ తీసుకోవచ్చు. మొత్తం 2,72,000 ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం ప్రణాళిక రచిస్తే అందులో నేటికి కేవలం 9 వేల ఇళ్లను మాత్రమే కట్టడం జరిగింది. ప్రస్తుత బడ్జెట్‌లో ఇందు కొరకు దాదాపు రూ.2463 కోట్లు కేటాయించారు. దానితో ఎన్ని ఇళ్లు నిర్మించగలరు? గ్రామీణ ప్రాంతాలలో దాదాపు ఐదు లక్షల రూపాయలు మరియు పట్టణ ప్రాంతాలలో ఆరు లక్షల రూపాయలు ఒక్కొక్క ఇంటికి ఖర్చవుతుందని అంచనా వేయడం జరిగింది. ఇప్పుడు చేసిన బడ్జెట్ కేటాయింపులతో అన్ని ఇళ్లను నిర్మించలేము. మిగిలిన వాటికి అప్పులు తీసుకోవలసి ఉంటుంది. అవుట్ ఆఫ్ బడ్జెట్ విధానంలో ఈ ఇళ్లను నిర్మించవలసి వస్తుంది. ఎన్ని లక్షల కోట్ల రూపాయలు అప్పు చేయవలసి వస్తుందనేది ఆలోచించాలి. ఈ ప్రభుత్వానికి ఇంకా ఒక్క సంవత్సరం మాత్రమే మిగిలి ఉంది. ఇప్పటివరకు కేవలం 9 వేల ఇళ్లను మాత్రమే నిర్మించారు. హడ్కో నుండిగాని లేదా మరే ఇతర ఆర్థిక సంస్థల నుండి ప్రభుత్వం అప్పులు తీసుకోవచ్చు. ఇన్ని లక్షల ఇళ్లు ఈ ఒక్క సంవత్సరంలో పూర్తవుతాయా? It is impossible. ఈ రోజు ప్రతి వ్యక్తి తమకు ఒక స్వంత ఇల్లు కావాలని కోరుకుంటున్నాడు.

ఇటీవలే మమ్మల్ని కాళేశ్వరం ప్రాజెక్టుకి విజిట్‌కి తీసుకువెళ్లారు. ఆ సందర్భంగా స్పీకర్‌గారి నియోజక వర్గంలో జరుగుతున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించడం జరిగింది. లప్పం ఫినిషింగ్, యూరోపియన్ టాయిలెట్స్‌తో చాలా బ్రహ్మాండంగా కడుతున్నారు. మాకు నిజంగా చాలా సంతోషంగా అనిపించింది. ఒక మధ్యతరగతి వ్యక్తి కూడా అంత మంచి ఇంటిలో ఉండలేడు. వాటి పక్కనే చాలా బ్లాక్స్ నిర్మాణం అసంపూర్తిగా ఉండిపోయాయి. నేను కారణం అడిగితే అక్కడ ఉన్న ఇంజనీర్ చెప్పాడు, సార్ వీటికి బిల్స్ పేమెంట్ కాలేదు అని. పేదవాడికి ఇల్లు కట్టిస్తామంటే ఎవరూ కాదనరు. But we have to see the practicality of it. మనం ప్రజలకు ఆశ చూపెడుతున్నాము. 2.72 లక్షల ఇళ్లు కట్టిస్తామని మనం వారికి చెప్పాము. అలాగే ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ఉద్దేశ్యం there should not be homeless person in the country. అది మంచి ఆలోచనే. కాని budgetary allocations గురించి ఆలోచన చెయ్యాలి.

సభలో ఉప ముఖ్యమంత్రిగారు ఉన్నారు కాబట్టి విద్యా రంగం గురించి మాట్లాడుకుందాం. విద్యాపరంగా తెలంగాణ వెనుకబడి ఉంది. ఈ విషయం ముఖ్యమంత్రిగారే చెబుతూ, తెలంగాణ పిల్లలకు communication skills నేర్పవలసిన అవసరం ఉంది. ఎన్ని ఇంజనీరింగ్ కళాశాలలు వచ్చినా లాభమేముంది? We have to make them learn communication skills అని అన్నారు. కాని ఒకటి సంతోషించదగిన విషయం ఏమిటంటే తెలంగాణ నుండి అనేక మంది NRIs ప్రపంచ వ్యాప్తంగా ఉన్నారు. They are in very good position outside the country. ఆ రోజుల్లో ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు వారికి అంత మంచి విద్య అందకపోయినప్పటికి కూడా వారు మంచి స్థానంలో ఉన్నారు. తెలంగాణకు ఇది చాలా గర్వించదగిన విషయం. Education is very important for us. కేటాయించిన నిధులను పూర్తిగా ఖర్చు పెట్టవలసిన అవసరం ఉంది. ఈ నాటి బడ్జెట్‌లో రూ.10,000 కోట్లు పాఠశాల విద్యకు కేటాయించారు. You have allocated Rs.2448 crores to the Higher Education. స్కూల్ ఎడ్యుకేషన్‌లో కూడా గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు పెట్టారు. But most of them are running in rented premises. Similarly, there are

many vacancies of teacher posts, which are to be filled. The amount allocated under the Budget comes under Non-Plan category. That amount is sufficient for salaries and maintenance of these Educational Institutions.

Coming to Universities, Universities in Telangana were the centres of agitations for achieving Telangana State. ఈ రోజు మనం తెలంగాణ రాష్ట్రాన్ని సాధించగలిగామంటే అందుకు కారణం ఆ యూనివర్శిటీ విద్యార్థులే. మా ఇల్లు ఉస్మానియా యూనివర్శిటీకి సమీపంలోనే ఉంది కాబట్టి ఆ యూనివర్శిటీ విద్యార్థుల ధూం, ధాంలు నేను కళ్లారా చూశాను. ఆ రోజు ఉద్యమం ఉధృత స్థాయిలో జరిగింది. Today, in Universities half of the staff are not there. కాబట్టి వీటికి బడ్జెటరీ అలకేషన్స్ పెంచితే అక్కడ విద్యా ప్రమాణాలు పెరుగుతాయని నా అభిప్రాయం. అవి మన ప్రతిష్ఠాత్మక సంస్థలు. వాటిని కాపాడుకోవలసిన అవసరం ఉంది. ఈ రోజు ఉస్మానియా విశ్వ విద్యాలయంలో శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్నాము. యూనివర్శిటీ తీవ్ర ఆర్థిక ఇబ్బందులలో ఉంది. ఆనాడు విద్యార్థులకు ఉద్యమ సందర్భంగా నైతిక బలాన్ని ఇచ్చిన అధ్యాపకులకు గత ఫిబ్రవరి నెలలో జీతాలు పది రోజులు ఆలస్యంగా చెల్లించారు. ఉస్మానియా విశ్వ విద్యాలయ యాజమాన్యం బ్యాంకులో రూ.10 కోట్లకు ఓవర్ డ్రాఫ్ట్ తీసుకొని జీతాలు ఇవ్వడం జరిగింది. Why such situation has come in the higher education field? అక్కడ హాస్టళ్ల నిర్వహణ కూడా సంతృప్తికరంగా ఉండడం లేదు. Yes, priorities are very important in the budget. What are the priorities of the Government? I agree that major projects occupy a place of priority. But we have to strike a balance between the short term and long term gains.

12.20 ม. Long term gains, Short term gains - ఈ రెండింటినీ బడ్జెటులో బ్యాలెన్స్ చేయవలసిన అవసరం మనకుంది. విశ్వవిద్యాలయాలు కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించబడిన టీచింగ్‌తో అండ్ నాన్ టీచింగ్ స్టాఫ్‌తో నడుస్తున్నాయి. In Palamur University, there are only seven permanent teaching faculty. What would be the future of Telangana with regard to quality education? తెలంగాణాలో మనం ఎటువంటి విద్యను అందించబోతున్నాం? ఇవన్నీ కూడా ఆలోచించవలసిన అవసరం ఉంది. ఎడ్యుకేషన్‌కి ఇంకా బడ్జెటును పెంచవలసిన అవసరం ఉంది. గురుకుల సంస్థల్లో కానీ, రెసిడెన్షియల్ స్కూల్స్‌లో కానీ టీచర్స్ నియామకాలు పూర్తి కాలేదు. వాటికి కేటాయించిన నిధుల్లో టీచర్స్ జీతభత్యాలు కూడా వస్తాయి. Some Gurukul institutions are being run in rented buildings. This budget is not sufficient. క్వాలిటీ ఎడ్యుకేషన్ ప్రయారిటీలో ఉంది. అయితే it would not be a reality if we have financial crunch. సరిపడ కేటాయింపులు లేకపోతే నాణ్యమైన విద్య ఎలా వస్తుంది? ఇది మేము చెబుతున్న మాట కాదు. టీచర్స్ యూనియన్స్ చెప్పిన మాటే ఇక్కడ చెబుతున్నాం. ఈ బడ్జెటులో కెజి టు పిజి అంశం మిస్ అయినట్లుగా స్పష్టంగా కనబడుతోంది. Teachers Unions are expressing their displeasure. Nothing was allocated to the prestigious programme of KG to PG in the education budget. Atleast, not even a word was mentioned anywhere in the budget. యుటిఎఫ్ జనరల్ సెక్రటరీ శ్రీ సి.ఎస్.రవి, పిఆర్‌టియు ప్రెసిడెంటు శ్రీ సర్వోత్తమరెడ్డి, ఎస్‌టియు ప్రెసిడెంటు శ్రీ భుజంగరావు, టిపిటిఎఫ్‌జి ప్రెసిడెంటు శ్రీ శ్రీనివాస్, తపస్ ప్రెసిడెంటు శ్రీ విష్ణువర్ధన్‌రెడ్డి - All of them have opined that this budget is no way useful.

**మిస్టర్ ఛైర్మన్:-** వాళ్ల పేర్లు అవసరం లేదు, బడ్జెటు గురించి మాట్లాడండి.

**SRI N. RAMACHANDRA RAO:-** Teachers Unions are also not happy with this allocation. వ్యవసాయం విషయంలో మీరు big leap తీసుకున్నారు. బడ్జెట్ కేటాయింపులు ఎక్కువగా వున్నాయి. కానీ ఒక విషయం గుర్తు పెట్టుకోవాలి. ఒక కోటి ఎకరాలకు సాగునీరు ఇస్తామని మంత్రిగారు చెప్పారు. సంవత్సరంలో రబీ, ఖరీఫ్ అని రెండు పంటలు ఉంటాయి. సాగుకు యోగ్యమైన కోటి ఎకరాలను తీసుకున్నపుడు, ఎకరాకు నాలుగు వేల చొప్పున సంవత్సరానికి రెండు పంటలకు ఎనిమిది వేల రూపాయలను ఇస్తామన్నారు. You have allocated Rs.12000 crores for this. వ్యవసాయ యోగ్యమైన భూమి 1.4 కోట్ల ఎకరాలు ఉందని వ్యవసాయ శాఖామంత్రిగారు ఇంతకు ముందు చెప్పారు. అయితే మన దగ్గర ఉన్న భౌగోళిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే, scanty rain fall ఉంటుంది కాబట్టి ప్రతి రైతూ రెండు పంటలు వేయడు. రెండో పంట అందరూ వేయరు. ఒక పంట మీదే చాలా మంది ఆధార పడతారు. కాబట్టి సెకండ్ క్రాప్‌కి చెందిన రూ.4వేలను మీరు తగ్గించవలసిన అవసరం వస్తుంది. క్రాప్ వేస్తేనే కదా మీరు డబ్బులు ఇచ్చేది! లేకపోతే

దుర్వినియోగం అవుతుంది. You cannot monitor proper utilization of that Rs.12000 crores of public money. Of course, this is a very good scheme. ఒక రైతుకి ఎకరానికి, సంవత్సరంలో రూ.8వేలు పెట్టుబడికి వస్తున్నాయంటే మంచిదే కదా!

**శ్రీ కడియం శ్రీహరిః-** అధ్యక్షా, ఇంతకు ముందే వ్యవసాయ శాఖామాత్యులు చెప్పారు. రాష్ట్రంలో ఈరోజు వ్యవసాయ యోగ్యమైన భూమి 1.42 కోట్ల ఎకరాలు ఉన్నట్లుగా నిర్ధారించడం జరిగింది. దాదాపు 72 లక్షల మంది రైతులు ఈ 1.42 కోట్ల ఎకరాల భూమిని సాగు చేస్తున్నారు. ఎకరాకు పంటకు రూ.4 వేల చొప్పున సంవత్సరంలో రెండు పంటలకు రూ.8వేలు ఇస్తే, మొత్తం 1.42 కోట్ల ఎకరాలకు ఇచ్చే పెట్టుబడి మొత్తం రూ.11 వేల కోట్లకు పైచిలుకు వస్తుంది.

అధ్యక్షా, సభ్యులు రామచంద్రరావు గారు మాట్లాడుతూ, అందరూ రెండు పంటలను వేసుకోరని అన్నారు. వ్యవసాయానికి నీళ్లు లేనప్పుడు, వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ లేనప్పుడు, వ్యవసాయానికి ప్రభుత్వపరంగా ఇచ్చే పెట్టుబడి లేనప్పుడు, గౌరవ సభ్యులు అన్న మాట వాస్తవం అవుతుంది. కానీ, తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత, కెసిఆర్ గారు వ్యవసాయానికి పెద్ద పీట వేసి, వ్యవసాయాన్ని పండుగ చేయాలనే ఆలోచనలో భాగంగా ఈరోజు 24 గంటల ఉచిత కరెంటును వ్యవసాయానికి అందిస్తున్నాం. మొత్తం దేశంలో ఈ రకంగా 24 గంటలు వ్యవసాయానికి నాణ్యమైన ఉచిత కరెంటును ఇస్తున్న రాష్ట్రాలు లేవు. రెండు-వ్యవసాయానికి పెట్టుబడి ఇవ్వడం ఈ సంవత్సరం నుంచే అమలు చేస్తున్నాం. మూడు-గౌరవ ముఖ్యమంత్రి గారు తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ వల్ల, ఒక కోటి ఎకరాలకు సాగునీరు అందించాలనే ఆలోచనలో భాగంగా ఈరోజు కాళేశ్వరం ఎత్తిపోతల పథకం, పాలమూరు ఎత్తిపోతల పథకం పనులు చాలా వేగంగా జరుగుతున్నాయి. రాత్రింబవళ్లు మూడు షిఫ్టులలో పనులు జరుగుతున్నాయి.

మేము కూడా కాళేశ్వరం వెళ్లి ప్రాజెక్టును చూసి వచ్చాం. కౌన్సిల్ ఛైర్మన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీలందరూ కూడా కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించి వచ్చారని వారే వారి ప్రసంగంలో చెప్పారు. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు దగ్గర రోజుకి రెండు లక్షల సిమెంటు బస్తాల వినియోగం జరుగుతోందంటే అక్కడ ఎంత వేగంగా పనులు జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. మా ఆలోచన, ఆశ ఏమంటే - రేపు జూలై, ఆగస్టుకల్లా కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ద్వారా నీళ్లు లిఫ్ట్ చేయాలని ప్రయత్నం చేస్తున్నాం. ఈరోజు మనం పేపర్లలో చూశాం. మా మంత్రి హరీష్‌రావు గారు ప్రాజెక్టు సైట్‌కి వెళ్లి, గేట్లు బిగించే దగ్గర వారు ఉండి, వారి పర్యవేక్షణలో గేట్లు బిగిస్తున్నట్లుగా మనం పేపర్లలో చూశాం. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే, సకాలంలో వర్షాలు పడితే, గోదావరిలో నీళ్లు కనుక వస్తే, జూలై-ఆగస్టులో మనం కాళేశ్వరం ఎత్తిపోతల ద్వారా నీటిని లిఫ్ట్ చేయాలని అనుకుంటున్నాం. మా ఆలోచన, ఆశ ఏమంటే - ఎట్టి పరిస్థితుల్లో కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని పూర్తి స్థాయిలో కాకపోయినా ఫేజ్డ్ మ్యానర్‌లో కంప్లీట్ చేస్తూ, జూలై-ఆగస్టు లోనే గోదావరి నీళ్లు లిఫ్ట్ చేసి, ఎల్లంపల్లి ద్వారా ఎల్ఎండికి తీసుకొచ్చి, తద్వారా వరద కాలువ, కాకతీయ కాలువలను, రిజర్వాయర్లను నింపాలన్నది గౌరవ ముఖ్యమంత్రిగారి ఆలోచన. ఒకవైపు దేవాదుల ప్రాజెక్టు ద్వారా ఈ వేసవిలో కూడా చెరువులను నింపుతున్నాం. రేపు ఇదే పరిస్థితి కాళేశ్వరం ద్వారా వస్తోంది. పాత మహబూబ్‌నగర్ జిల్లాలో, గతంలో ఎన్నడూ లేని విధంగా జరిగింది. ఈరోజు మహబూబ్‌నగర్ జిల్లా చరిత్ర సృష్టిస్తోంది. ఈరోజు 6.5 లక్షల ఎకరాలలో సెకండ్ క్రాప్ పండుతోంది. కాబట్టి అన్ని సవ్యంగా జరిగితే 1.42 కోట్ల ఎకరాలలో వానాకాలం, యాసంగి రెండు పంటలు పండించుకోవాలనే ఆలోచనతో రెండు పంటలకూ పెట్టుబడి అందించాలనే ఆలోచనతో బడ్జెటులో కేటాయింపులు చేశాం. రామచంద్రరావు గారూ! మీరు దీన్ని ఆహ్వానించాలే తప్ప, తప్పుపట్టనవసరం లేదు.

**శ్రీ ఎన్. రామచంద్రరావుః-** దీన్ని ఆహ్వానిస్తున్నామని నేను నా ప్రసంగంలో మొదటగా చెప్పాను. కానీ దుర్వినియోగం అయ్యే స్కోప్ ఎక్కువగా ఉంటుందనే హెచ్చరిక ప్రభుత్వానికి చేస్తున్నా. It is only a signal that there may be misuse of funds అని చెబుతున్నాం. నేను కూడా కాళేశ్వరం ప్రాజెక్టు చూశాను, we are also proud of that project. మహారాష్ట్ర కూడా మనకు ఆరోజు సహకరించింది. ముఖ్యమంత్రిగారు కూడా ఆ విషయం చెప్పారు. ఇరిగేషన్ మీద ముఖ్యమంత్రిగారికి ఉన్న ఆలోచనలను - we are not suspecting his intentions both on Kaleswaram and Palamuru projects. మేము మా పార్టీ తరఫున కానీ, వ్యక్తిగతంగా కానీ we are not opposing them. పాలమూరు ఎత్తిపోతల పథకం నా నియోజకవర్గంలో ఉంది. I never opposed it. We, on behalf of our party, never opposed these projects. Even today, we are not opposing. మీరు ఎంత తొందరగా వీటిని పూర్తి చేస్తే అంత లాభం రైతులకు కలుగుతుంది. నిర్మాణాత్మక విమర్శలు చేసే

మేము, ఈ విషయంలో we are with you అని చెబుతున్నాం. నాకు ఛైర్మన్ గారు కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించడానికి ఇచ్చిన అవకాశాన్ని అకనాలెడ్జ్ చేశాను. I have seen that project. నేను ఒక సివిల్ ఇంజినీర్ కొడుకుని. మా తండ్రిగారు చాలా మంది సివిల్ ఇంజినీర్స్‌ని తయారు చేశారు. I know the importance of the dams. We want them. తెలంగాణ సస్యశ్యామలం కావాలని మేము కోరుకుంటున్నాం. We are not against the concept of the Government. పెట్టుబడి క్రింద మీరు రైతుకు పంటకు నాలుగు వేల రూపాయలు ఇస్తే మాకు సంతోషం.

వ్యవసాయోత్పత్తుల నిల్వలకు సంబంధించి మీరు గోదాములు నిర్మిస్తున్నారు. అన్నిటికంటె ముఖ్యంగా రైతుకు కావలసిందేమంటే – పంట వచ్చిన తర్వాత దాన్ని అమ్మితే సరైన రేటు దక్కాలి. It is a fact that MSP is fixed by the Central Government. అది ఎక్కువ ఫిక్స్ కాకపోవచ్చు, ఊహించనంతగా లేకపోవచ్చు. ఎందుకంటే Central Government has a different view. మొత్తం దేశంలోని 29 రాష్ట్రాలను దృష్టిలో పెట్టుకొని, ఆ రాష్ట్రాలలో వచ్చే వ్యవసాయోత్పత్తులను పరిగణనలోకి తీసుకొని మద్దతు ధరని ఫిక్స్ చేస్తుంది. ఆవిధంగా ఫిక్స్ చేసిన మద్దతు ధర రైతుకు తక్కువ అనిపిస్తుంది. అప్పుడు the State Governments can always intervene. ఏవిధంగానైతే మీరు రైతుకి పెట్టుబడి క్రింద ఇవ్వాలని బడ్జెటు కేటాయింపులు చేశారో అదే విధంగా కనీస మద్దతు ధర విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవచ్చు. ఛత్తీస్‌ఘడ్‌లో భావాంతర యోజన అమలు చేస్తున్నారు. భావ్ అంటే ప్రైస్, అంతర్ అంటే డిఫరెన్స్. మద్దతు ధరకి, మార్కెట్ రేటుకి తేడా ఉంటే , రైతుకి లాభం లేకపోతే Government itself is coming forward to purchase the produce over and above the MSP. This is Bhavantar Yojana. ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ మరియు గుజరాత్ రాష్ట్రాలలో దీన్ని అమలు చేస్తున్నారు. మార్కెట్లో ఎప్పుడైతే వ్యవసాయదారునికి సరైన ధర లభించలేదో అప్పుడు definitely, the State Government has to come to the rescue of the farmer. ఈరోజు ఎందుకు రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నాయి? Becuase, they are not getting proper price for their produce. రైతులు నష్టపోతున్నారు, కాబట్టి మనం బాధ్యత తీసుకోవలసిన అవసరం ఉంది. నిజానికి ఈరోజు ఎరువులకు సంబంధించిన కొరత లేదు. రైతులు రకరకాల అనుభవాలు చూస్తున్నారు. వ్యవసాయ రంగం సుభిక్షంగా ఉండాలన్నదే మా కోరిక. వ్యవసాయోత్పత్తులను ఇంతకు ముందు ఎఫ్‌సిఐ కొనుగోలు చేసేది. నాకున్న సమాచారం ప్రకారం the Central Government itself is giving capital to the State Governments to purchase paddy, redgram etc. ఇంతకు ముందు వాళ్లే నేరుగా కొనుగోలు చేసే వారు, ఇప్పుడు రాష్ట్రాలే కొనుగోలు చేస్తున్నాయి. రైతులకు సరైన ధరలు లభించేలా బడ్జెటులో వెసులుబాటు కల్పించి ఉంటే బాగుండేది.

సివిల్ సప్లైస్‌కి సంబంధించి ఈ సభలో చాలాసార్లు చర్చ జరిగింది. రేషన్‌కార్డులను చాలా వరకు తగ్గించారు. కొత్త రేషన్ కార్డులు రావడం లేదు. ఫుడ్ సెక్యూరిటీ క్రింద కార్డులు ఇవ్వమని ప్రజలు కోరుతున్నారు. ఈ–పోస్‌కి సివిల్ సప్లైస్‌లో బడ్జెట్ కేటాయింపులు చేశారు. దీని క్రింద రైస్, కందిపప్పు వంటి అనేక వస్తువులు పెట్టారు. దీంట్లో బడ్జెటు కేటాయింపులు పెరగవలసిన అవసరం ఉంది. రేషన్ కార్డులు పెరగవలసిన అవసరం ఉంది. దారిద్ర్య రేఖకి దిగువున ఉన్న పేదవాళ్లు వైట్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. మాకు ఆ కార్డులు ఇవ్వమని కోరుతున్నారు. There are so many people living below the poverty line, who wants to purchase the food articles from the fair price shops.

టూరిజం అండ్ కల్చర్ గురించి చెప్పారు. హరిత హోటల్స్ ఉన్నాయి. వాటి నిర్వహణ సక్రమంగా ఉండాలి, కొత్త హరిత హోటల్స్ నిర్మాణం జరగవలసిన అవసరం ఉంది. Tourism is also revenue earning area. దేశంలో చాలా రాష్ట్రాలు టూరిజం ద్వారా రెవెన్యూ సంపాదిస్తున్నాయి. ముఖ్యంగా కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలు టూరిజం ద్వారా మంచి రెవెన్యూ పొందుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత టూరిజం సెంటర్స్‌ని గుర్తించింది తక్కువే. గుర్తించిన ప్రాంతాలలో టూరిజం అభివృద్ధి కావాలంటే అక్కడ మంచి హోటల్స్ ఏర్పాటు చేయాలి. మనకు హరిత హోటల్స్ ఉన్నాయి. అవి చాలా తక్కువగా ఉన్నాయి. మాపార్టీ తరపున ఢిల్లీ నుంచి ఏ నాయకులు వచ్చినా వారిని హరిత హోటల్స్‌లోనే పెడుతున్నాం. Because they are tourism department owned hotels. అమిత్‌షా గారు వచ్చినా అక్కడే ఉంటారు. ఎవరు వచ్చినా అక్కడే బస ఏర్పాటు చేస్తున్నాము. We are patronizing Telangana tourism places. టూరిజం అభివృద్ధి కావాలంటే you have to spend more money. బడ్జెటులో మీరు దీనికి చేసిన కేటాయింపులు they are not sufficient. కొత్త హోటల్స్ కట్టాలి. వరంగల్‌లో లక్నవరం బ్యూటిఫుల్ స్పాట్. How you are going to attract the

tourists to this spot? అప్రోచ్ సరిగా లేదు, రోడ్లు సరిగా లేవు. సదుపాయాలు మెరుగుగా ఉంటేనే పర్యాటకులు వస్తారు. టూరిజం డెవలప్ అయితే the Government will get revenue. ఎకానమీ డెవలప్ అయ్యే అవకాశం ఉంటుంది. చాలా దేశాలు ఈరోజు టూరిజం ఆధారంగా డెవలప్ అవుతున్నాయి. ఏ దేశం చూసినా, ఏ రాష్ట్రం చూసినా – tourism is also very important area today.

అధ్యక్షా, ఇంతకు ముందు నేనొక విషయం చెప్పడం మరచిపోయాను. మన రాష్ట్రాన్ని సీడ్ కేపిటల్‌గా తయారు చేయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. పాత మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో గల గద్వాల్ ఇప్పుడు జిల్లా అయింది. ఈ గద్వాల్ జిల్లాలో కాటన్ సీడ్ ప్రొడ్యూస్ చేసి రైతులకు ఇస్తున్నారు. వానలు పడి, లేకపోతే ఎండలు ఎక్కువై, లేదా ప్రకృతి వైపరీత్యాల వల్ల ఈ కాటన్ సీడ్ ప్రొడ్యూసర్స్‌కి నష్టం వాటిల్లితే, వాళ్లను ఆదుకునే వాళ్లే లేరు. వాళ్లకు బీమా లేదు, they do not have crop insurance schemes. వీళ్లంతా లోకల్ ఆర్గనైజర్స్ చేతుల్లో, ఫైనాన్సర్స్ చేతుల్లో ఇరుక్కుపోతున్నారు. సీడ్ మీద రీసెర్చ్ జరగాలి. కొత్త సీడ్స్‌ను అభివృద్ధి చేసే ప్రయత్నం మనం చేయాలి. మనం ఈ మధ్యన బిటి కాటన్‌ను ప్రోత్సహించడం లేదు. ముఖ్యమంత్రిగారు గతంలో కూడా చాలా సమావేశాలు పెట్టారు. సీడ్ రీసెర్చ్ చేయడానికి, రాష్ట్రాన్ని సీడ్ కేపిటల్ చేయడానికి, పలు రకాలైన విత్తనాలను అభివృద్ధి చేయడానికి బడ్జెటులో కేటాయింపులు పెంచవలసిన అవసరం ఎంతైనా ఉందని మనవి చేస్తున్నాను. It is a missing point in this budget.

ట్రాక్టర్స్ కానీ ఇతర వ్యవసాయ పనిముట్లు కానీ సెంట్రల్ గవర్నమెంటు స్కీముల ద్వారా వస్తున్నాయి. అసలు ట్రాక్టర్స్ ఎవరికి ఇస్తున్నారు? నేను లెటర్స్ రాసిచ్చిన వాళ్లెవ్వరికీ రాలేదు. బడ్జెటులో వ్యవసాయ పరికరాలు, పనిముట్లు తదితర వాటికి కేటాయింపులు పెంచితే బాగుంటుంది. Because, they are being used by the farmers directly. ఆవిధంగా కేటాయింపులు పెంచి పరికరాలు, పనిముట్లు అందజేస్తే రైతుకు నేరుగా లబ్ధి చేకూరుతుంది. It would be beneficial to the farmer.

నీతి ఆయోగ్ ద్వారా గత మూడు సంవత్సరాల నుంచి రూ.66 వేల కోట్లు రావడం జరిగిందన్నారు. మీరు రైతాంగానికి సంబంధించిన కేపిటల్ ఇన్వెస్టుమెంటు గురించి నీతి ఆయోగ్‌కి చెప్పారు. ఈసారి కూడా కేటాయింపులు పెంచమని మీరు వాళ్లను కోరారు. కేపిటల్ ఇన్వెస్టుమెంటులో మాకు కొన్ని అనుమానాలున్నాయి. దీని మీద ప్రభుత్వం వైట్ పేపర్ విడుదల చేయవలసిన అవసరం ఉంది. మీరు చూపించిన బడ్జెట్ ఫిగర్స్, percentage of the capital investment in the budget పై స్పష్టత లేదు.

బిసి వెల్ఫేర్‌కి రూ.5920 కోట్లు కేటాయించారు. ఈ వర్గాలకు చెందిన నాయకులతో ముఖ్యమంత్రిగారు మాట్లాడి అవసరమైన పథకాలు ప్రవేశపెడతామన్నారు. గత బడ్జెటుకన్నా ఈ బడ్జెటులో కేటాయింపులు పెరిగిందేమీ లేదు. రాష్ట్ర జనాభాలో 52శాతం ఉన్న బిసిలు చాలా పెద్ద ఎత్తున ఆశలు పెట్టుకున్నారు. ఆ వర్గాలకు చెందిన పథకాలకు ఇంకా కేటాయింపులు పెంచి ఉన్నట్లయితే వాళ్లు పైకి వచ్చే అవకాశం ఉండేది. అది ఈ బడ్జెటులో జరగలేదని నేను భావిస్తున్నాను.

మైనారిటీ వర్గాలకు కూడా నిధులు పెంచడం జరిగింది. ఆసరా పథకానికి, కళ్యాణ లక్ష్మి పథకానికి కేటాయింపులు పెంచారు, చాలా సంతోషం. పెంచిన దాని వల్ల లబ్ధిదారులకు ప్రయోజనం కలిగితే మాకెటువంటి అభ్యంతరం లేదు. అవి మంచి పథకాలే కానీ నేను ఒకటే మాట చెబుతున్నాను. ఎన్ని స్కీములు తెచ్చినా, ఎన్ని చేసినా కూడా బడ్జెటు యొక్క ప్రాక్టికాలిటీని మనం చూసుకోవాలి. We have not yet discussed about the welfare schemes. బడ్జెట్‌కి ఎంతవరకు ప్రాక్టికాలిటీ ఉంది, ఎంత వరకు రియాలిటీ ఉంది, ఎంతవరకు మన ఎకానమీ మీద ఎఫెక్ట్ పడుతుందో చూసుకోవలసిన అవసరం ఉంది. బారోయింగ్ చేయడానికి ఎఫ్ఆర్‌బిఎంలో 3.5 శాతం వరకు వెసులుబాటు ఉంది. నాబార్డు, హడ్కోవంటి ప్రభుత్వ సంస్థల నుంచి మీరు అప్పులు తెస్తున్నారు. తెస్తున్న అప్పులకు వడ్డీ కూడా కడుతున్నాం. Today, the amount of interest which is being paid to the banks/institutions is very high. ఆ భారం ఎవరి మీద పడుతుంది? When you are bringing the amount by borrowing as a loan, you are also paying the interest, ఆవిధంగా కట్టే వడ్డీ పెరుగుతోంది. ఈసారి కూడా మీరు బడ్జెటులో అప్పుల అంశాన్ని చూపిస్తున్నారు. రీపేమెంట్ అమౌంట్ ఏదైతే ఉందో it is definitely not a matching amount. It is only a magical figure. అంకెల గారడీ అయినా, jumbling of the figures, ఏదైనా సరే, ఇది magical jumbling of figures అని చెప్పక తప్పదు. నిజానికి ఇది ప్రాక్టికల్ బడ్జెట్ కానే కాదు. నేను చెప్పడం కాదు, ది హిందూ పేపర్ మరియు ఇతర పేపర్లలో నేను చదివాను.

**శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి:**– వాళ్ల అభిప్రాయం వాళ్లు చెబుతారు, అందులో ఏముంది?

**శ్రీ ఎస్. రామచంద్రరావుః-** మా అభిప్రాయం మాకుంటుంది, మీ అభిప్రాయం మీకుంటుంది. Telangana is one of the under-spending States in India. Assam is also there but that is a different issue. మీరు ఇరిగేషన్‌కి బడ్జెటు పెంచినా – Telangana and Assam are highest under-spending States in India.

12.40 మ. మనం బడ్జెటరీ అలొకేషన్ ఎక్కువగా పెట్టుకొని, అండర్ స్పెండింగ్ చేస్తున్నాం. కానీ, బడ్జెట్‌ను చూపించి మేము ఇంత బడ్జెట్‌ను అలొకేట్ చేస్తున్నాం అని ప్రభుత్వం ఏదైతే చెబుతున్నదో, అది కేవలం ప్రజల దృష్టిలో, మేము ఇంత బడ్జెట్ పెట్టాం, పాపులర్ బడ్జెట్ పెట్టాం, పీపుల్స్ ఫ్రెండ్లీ బడ్జెట్ పెట్టాం అని చెప్పడం కోసమే.

గత సంవత్సరపు బడ్జెట్‌లో దాదాపు మీరు రూ.8,000/- కోట్ల రూపాయలను ఖర్చు చేయలేదు. Eight thousand crores of rupees is not a small thing. ఈ సారి మీరు రూ.1,74,000/-కోట్లకు బడ్జెట్‌ను పెట్టారు. A high budget. ఈ దేశంలో ఇంత బడ్జెట్ ఎక్కడా పెట్టలేదని మీరే చెప్తున్నారు. మనది చిన్న స్టేట్, కొత్త స్టేట్. సర్‌ప్లస్ స్టేట్‌గా వచ్చినటువంటి మన రాష్ట్రాన్ని, you are pushing it to the debt ridden State. అది పద్ధతి కాదని నేను భావిస్తున్నాను. We feel bad when Telangana and Assam States make highest announcements in the Budget without implementing them. Minority welfare outlay gives a fillip to the education but what about the education to be imparted to other categories. Through this budget, though you are running one or two laudable welfare schemes about which there are no complaints but you are going to push this state into debt trap. I feel that when you say that per capita income is increasing, per capita debt/loan is also increasing. This budget is an unrealistic budget, impracticable budget and this budget is only prepared keeping in view the up coming elections.

**శ్రీ బోడకుంటి వెంకటేశ్వర్లు (శాసనసభ నియోజక వర్గం)ః-** అధ్యక్షా, ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై మాట్లాడేందుకు అవకాశం కల్పించిన మీకు, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారికి, ఆర్థిక శాఖామాత్యులు శ్రీ ఈటల రాజేందర్ గారికి, ఈ సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన గౌరవ ఉప ముఖ్యమంత్రి శ్రీ కడియం శ్రీహరి గారికీ నా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను.

సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతం ఎలా ఉండేదో మనకు తెలుసు. మన రాష్ట్రాన్ని మనం తెచ్చుకున్న తరువాత తెలంగాణ రాష్ట్రం ఏ విధంగా అభివృద్ధి చెందుతోందో కూడా మనకు తెలుసు. సమైక్య రాష్ట్రంలో నిధులన్నింటినీ ఆంధ్ర ముఖ్యమంత్రులు ఆంధ్ర ప్రాంతానికి తీసుకుపోతున్నప్పుడు, ఇక్కడ అప్పటి ప్రభుత్వంలో ఉన్నటువంటి వారు అప్పుడు నోరు కూడా మెదపలేనటువంటి పరిస్థితుల్లో ఉన్నారు. గౌరవ ముఖ్యమంత్రి గారు వారి ప్రాణాన్ని పణంగా పెట్టి మన రాష్ట్రాన్ని తెచ్చుకున్న తరువాత, ప్రతి బడ్జెట్‌లో 20 శాతం అదనంగా పెంచుకుంటూ, ఈరోజు రూ.1,74,453.84 కోట్లతో 2018-19 సంవత్సరంలో 5వ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం జరిగింది.

పెద్దలు, గౌరవ సభ్యులు రామచంద్రరావు గారు వ్యవసాయం గురించి మాట్లాడారు. వ్యవసాయంలో కూడా ఈ ప్రభుత్వం ఏదో తక్కువ చేస్తున్నట్లు వారు మాట్లాడారు. చాలా బాధాకరం. ఇవాళ రాష్ట్రంలో ఈ ప్రభుత్వం వ్యవసాయానికి ఇస్తున్నటువంటి ప్రాధాన్యత వేరే దేనికీ కూడా ఇవ్వడం లేదనేది నిర్వివాదాంశం. వ్యవసాయ రంగానికి రూ.15,780/-కోట్లను ఈ బడ్జెట్‌లో కేటాయించడం జరిగింది. దాని కింద ఉన్న అనుబంధ పద్దులను కూడా గౌరవ సభ్యులు ఒకసారి గమనించాలి.

రైతులకు పెట్టుబడి అంశం. భారత దేశంలో ఉన్నటువంటి ఏ రాష్ట్రంలోనైనా రైతులకు పెట్టుబడి అంశం ఉన్నదా? తెలంగాణ రాష్ట్రంలో రైతులకు ఎకరానికి రూ.8000/- చొప్పున పెట్టుబడి కొరకు రూ.12,000/-కోట్లు ఈ బడ్జెట్‌లో కేటాయించడం జరిగింది. గౌరవ ముఖ్యమంత్రి గారు ఈ విషయమై ప్రకటన చేయగానే, వెంటనే మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఫడ్నవీస్ గారు మన ముఖ్యమంత్రి గారిని ప్రశంసించడం జరిగింది. దళిత నాయకుడు, మాజీ ప్రధాని దేవెగౌడ గారు కూడా ఏవిధంగా మీకీ ఆలోచన వచ్చిందని అడుగుతూ, మన ముఖ్యమంత్రి గారిని ప్రశంసించారు. కేంద్ర హోంశాఖామాత్యులు, శ్రీ రాజ్‌నాథ్‌సింగ్ గారిని మన ముఖ్యమంత్రి గారు కలవడానికి వెళ్ళినప్పుడు, రైతు పెట్టుబడి పథకం అని చెప్పున్నారు, మళ్ళీ ఈ మొత్తాన్ని వాళ్ళు ఎప్పుడు తిరిగి చెల్లించాలని అడగగా, మన ముఖ్యమంత్రి గారు 'వాళ్ళు తిరిగి చెల్లించుడే లేదు' అలాంటే, శ్రీ రాజ్‌నాథ్‌సింగ్ గారు కుర్చీ నుండి కింద పడినంత పనిచేశారు. అలాంటి పథకం, ఈ రైతు పెట్టుబడి పథకం.

రైతులకు పెట్టుబడి దొరకడం లేదు, బ్యాంకులు కూడా రైతులకు సక్రమంగా అప్పులివ్వడం లేదని ఆలోచించి, రైతులను ఆ దుస్థితినుంచి బయటకు తీసుకువచ్చేందుకు రైతు

పెట్టుబడి పథకాన్ని తీసుకువచ్చారు. దేశమంతా, ప్రపంచమంతా ఈ పథకానికి ప్రశంసలు వస్తూ ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ అధికారులు ఈ రాష్ట్రానికి వచ్చి, రైతుల పెట్టుబడి పథకం గురించి మన వ్యవసాయ అధికారులతో సంప్రదింపులు జరుపుతూ ఉంటే, ఆ విషయం సభ్యులు రామచంద్ర రావు గారికి తెలియదా అని అడుగుతున్నాను. కేసిఆర్ గారు ఈ పథకాన్ని ప్రవేశపెట్టిన తరువాత కేంద్ర ప్రభుత్వం కూడా దేశం మొత్తం కూడా రైతు పెట్టుబడి పథకాన్ని అమలు చేయాలనే ఆలోచన చేయబోతోందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

సమగ్ర భూసర్వే. తెలంగాణ ప్రాంతంలోని భూ రికార్డులను చూస్తే, రికార్డుల్లో ఒకరుంటారు, మోకా మీద వేరొకరుంటారు. అలాంటి పరిస్థితిని ఫస్ట్ ఫేజ్‌లో, పార్ట్-ఎ లోనే 93 శాతం భూ సర్వేను క్లియర్ చేయడం జరిగింది. దానివల్ల రైతులకు ఎంతో ఆనందంగా ఉంది. పార్ట్-బి కూడా అతి త్వరలోనే చేపట్టి, పాస్‌పోర్టుల్లాగా ఉండేవిధంగా రైతు పాస్‌బుక్ పథకాన్ని గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టారు. ఈ పథకం మంచిది కాదా? దీన్నీ విభేదిస్తారా?

సులభతర రిజిస్ట్రేషన్. అధ్యక్షా, గతంలో రిజిస్ట్రేషన్ చేయడంతో మా పని అయిపోయింది అనుకునేవారు. కానీ ఆ రిజిస్టరులో మాత్రం వారి పేరు మారదు. ఆ విధంగా కాకుండా, ఈరోజు మండలానికొక రిజిస్ట్రేషన్ ఆఫీసును పెట్టి, ఆ తహసీల్దారే స్వయంగా అమ్మిన వారి పేరును తీసేసి, కొన్న వారి పేరును చేరుస్తారు. ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ఉండేలా రిజిస్ట్రేషన్ విధానాన్ని ప్రక్షాళన చేయడం జరుగుతోంది.

సభ్యులు రామచంద్రరావు గారు మాట్లాడుతూ, వేరే స్టేట్‌లో ఇంటర్వెన్షన్ ఫండ్ ఇస్తున్నారు, మన స్టేట్ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అదే రకంగా, ఈరోజు రైతు సమన్వయ కమిటీని ఏర్పాటు చేసి, రైతులకు గిట్టుబాటు ధర రాని పరిస్థితులలో, రైతు సమన్వయ కమిటీ అక్కడికక్కడే ఆ మార్కెట్లోకి ఎంటరవుతుంది. 60 సంవత్సరాలుగా కట్టని గోడౌన్లను, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన మూడు నాలుగు సంవత్సరాలలో ఈరోజు ప్రతి మండలంలో కలర్‌ఫుల్ గోడౌన్లను కట్టడం జరిగింది. వాటిలో స్టాకును పెట్టుకొని, గిట్టుబాటు ధర వచ్చినప్పుడు రైతులు అమ్ముకునే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. రైతులు గోడౌన్లలో వాళ్ళ స్టాకును పెట్టుకున్నందుకు వారిపై ఎటువంటి వడ్డీ భారం లేకుండా ఉండేందుకు వాళ్ళకు అప్పు ఇచ్చే కార్యక్రమాన్ని కూడా మన ప్రభుత్వం చేస్తోంది. ఇది మంచి పని కాదా అధ్యక్షా?

ఇంత మంచి పనులు జరుగుతున్నప్పుడు కూడా రైతులకు ఈ ప్రభుత్వం ఏమి చేస్తోందని వారు విమర్శించడం రైతులమైన మాకు చాలా బాధ కలిగిస్తోంది.

రైతు వేదికలు. ప్రతి ఒక్కరికీ సంఘాలున్నాయి. రైతులకు కూడా సంఘాలుండాలనే లక్ష్యంతో రూ.12.00లక్షల వ్యయంతో రైతు వేదిక బిల్డింగులను ప్రతి గ్రామంలో కట్టించాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉంది. అదే విధంగా అందరూ ఏదో ఒక రకంగా ఇన్సూరెన్స్ కింద కవర్ అవుతున్నారు. కానీ, ఈరోజు రైతుకు కూడా ఇన్సూరెన్స్‌ను కవర్ చేసిన ఘనత మాత్రం గౌరవ ముఖ్యమంత్రి గారికే దక్కుతుంది. ఒక్కొక్కరికి రూ.5.00లక్షల ఇన్సూరెన్స్ కవర్ చేసే విధంగా, బడ్జెట్‌లో రూ.500/- కోట్లను కేటాయించడం జరిగింది.

వ్యవసాయ యాంత్రీకరణ. ఈరోజు గ్రామాలలో కూలీలు దొరకడం లేదు. ప్రత్తి పండించిన రైతుకు ఆ ప్రత్తిని తీయించేందుకు కూడా కూలీకి ఇబ్బంది కలుగుతోంది. గౌరవ ముఖ్యమంత్రి గారు తీసుకుంటున్న చర్యల వల్ల అందరికీ సాగునీరు వచ్చి, అందరూ ఒకటే సారి నాట్లు వేసేటువంటి పరిస్థితుల్లో కూలీలు దొరకక ఇబ్బందులు ఎదురవుతాయనే ఉద్దేశంతో, వ్యవసాయ యాంత్రీకరణ కొరకు బడ్జెట్‌లో రూ.5220/- కోట్లను కేటాయించారు.

బిందు సేద్యం. పాలీ హౌస్, గ్రీన్ హౌస్ వంటి అధునాతన వ్యవసాయం హైదరాబాద్ నగరం చుట్టుప్రక్కల జరుగుతోంది. కూరగాయలను పెద్ద ఎత్తున మనం దిగుమతి చేసుకుంటున్నాం, మనం కూడా ఎగుమతి చేసే పరిస్థితికి రావాలని ఇవాళ రైతు కూడా ఆలోచిస్తున్నాడు. అదే విధంగా పూల వ్యవసాయం కొరకు కూడా ఫామ్ హౌస్‌ను ఏర్పాటు చేసేందుకు, బడ్జెట్‌లో రూ.125/- కోట్లు కేటాయించి, తద్వారా రైతులను ఆదుకోవడం జరుగుతోంది.

మార్కెట్ యార్డులు. మా జనగామ నియోజకవర్గం గురించి మన గౌరవ ఉప ముఖ్యమంత్రి గారికి చాలా తెలుసు. వారు గతంలో నీటిపారుదల శాఖామాత్యులుగా ఉన్నప్పుడు దేవాదుల పథకాన్ని ప్రారంభించడం జరిగింది. మా జనగామ నియోజకవర్గంలో గడచిన 30 సంవత్సరాలుగా వర్షాలు లేవు. మా ప్రాంతం క్రానిక్ డ్రాట్ ప్రోన్ ఏరియా. అలాంటి మా దగ్గర, 30 సంవత్సరాల తరువాత ఇవాళ చెరువులను నింపినందువల్ల బ్రహ్మాండమైన ఈల్డ్ వచ్చింది. కనీవినీ ఎరుగని రీతిలో అక్కడ పంటలు పండడం జరిగింది. ఆ విధంగా వచ్చిన పంటకు, రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు రైతు

కొనుగోలు కేంద్రాల ద్వారా ఖరీదు చేసి, ప్రతి ఒక్కరికి పేమెంట్ చేస్తే, కళకళలాడుతూ మొన్న రైతులందరు దసరా పండుగ చేసుకోవడం జరిగింది. ఆ రకంగా పెద్ద ఎత్తున పండుతున్న పంటలను, మార్కెటింగ్ చేయడం ద్వారా తక్షణమే రైతులకు పేమెంట్ చేయడం జరుగుతోంది.

గోదాముల నిర్మాణాల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. ఇంకా ఇప్పుడు కొత్తగా మండలాలు ఏర్పడ్డాయి. ఆ కొత్తగా ఏర్పడ్డ మండలాల్లో కూడా గోడౌన్లను నిర్మించే కార్యక్రమం చేస్తూ ఉన్నారు. కోల్డ్ స్టోరేజ్‌లకు కూడా ప్రాధాన్యమిచ్చి, నాణ్యమైన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలనే లక్ష్యంతో ఈ ప్రభుత్వం ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటోంది.

రైతు సమన్వయ సమితులకు ప్రభుత్వమే గ్యారెంటీ ఇచ్చి, ఆరేడువేల కోట్ల రూపాయలు వారి దగ్గరుంచి, ఎప్పుడైతే గిట్టుబాటు ధర వస్తుందో అప్పుడే అమ్ముకునే విధంగా ఒక చక్కటి కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతోంది. ఈ రకంగా వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యతనివ్వడం జరుగుతోంది.

తదుపరి, వ్యవసాయ అనుబంధమైన రంగం, ఇరిగేషన్. ఇవాళ ఇరిగేషన్‌కు రూ.25,000/-కోట్లను కేటాయించడం జరిగింది. గత సంవత్సరం కూడా మనం ఇరిగేషన్‌కు రూ.25,000/- కోట్ల బడ్జెట్‌ను పెట్టుకున్నాం. గౌరవ కౌన్సిల్ ఛైర్మన్ గారి నాయకత్వంలో మన ఎమ్మెల్సీలందరమూ కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించడం జరిగింది. ఆ ప్రాజెక్టును చూసేందుకు పోతున్నప్పుడు, భూపాలపల్లిలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ళ నిర్మాణాన్ని చూశాం. యూరోపియన్ టాయ్‌లెట్స్ కూడా ఆ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళలో కనిపించాయి. ఇంకా పనులు నడుస్తున్నాయి. మనకు సమయం కూడా ఉంది. ఇప్పుడే సమయం అయిపోలేదు. అనుకున్న లక్ష్యాన్ని తప్పనిసరిగా మనం అందుకుంటాం. గౌరవ సభ్యులు మాట్లాడుతూ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళ నిర్మాణం నిలిచిపోయిందన్నారు. మీరు ఏవైతే ఇళ్ళ నిర్మాణాలు మిగిలిపోయాయని అన్నారో, ఆ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేస్తామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

ఆ తరువాత భూపాలపల్లి నుండి బయలుదేరి, బ్రహ్మాండమైన కాళేశ్వరం ప్రాజెక్టును చూసి రావడం జరిగింది. నిన్ననే ఇరిగేషన్ మంత్రి శ్రీ హరీశ్‌రావు గారు కాళేశ్వరం ప్రాజెక్టుకు చెందిన ఒక గేటును కూడా ప్రారంభించడం జరిగింది. 85 గేట్లలో ఒక గేటు నిర్మాణం పూర్తయ్యింది. ఆ రకంగా 24 గంటల పాటు ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోంది. సుందిళ్ళ దగ్గర 4 స్టోరీడ్ బిల్డింగ్ నిర్మాణం జరుగుతోంది. ఏదైనా మోటార్ ప్రాబ్లమ్ వస్తే, స్టాక్‌లో ఉన్న మోటార్‌ను వాడతారు. తక్షణమే ఉపయోగించేందుకు అక్కడొక క్రేన్ అందుబాటులో ఉంటుంది. రోజుకు రెండు టి.ఎం.సి.ల నీళ్ళు తీసుకుని పంటలు పండించడానికి దోహదపడుతుంది.

ఈ రెండు టి.ఎం.సి.లే కాదు, అదనంగా మరొక్కటి.ఎం.సి. నీళ్ళను కూడా కలుపుకొని మొత్తం 3 టి.ఎం.సి.ల నీళ్ళు తీసుకునే ప్లాన్‌తో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోంది. గతంలో కూడా ప్రాజెక్టులను నిర్మించేవాళ్ళు. అప్పుడు ప్రాజెక్టులంటేనే పెండింగ్ ప్రాజెక్టులు. 20 సంవత్సరాలు, 30 సంవత్సరాల పాటు పెండింగు. ఇవాళ కాళేశ్వరం ప్రాజెక్టు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టడం జరుగుతోంది. 2 లక్షల సిమెంటు బస్తాలు ఒక రోజుకు ఖర్చవుతూ ఉన్నాయని, 3 షిఫ్ట్‌లలో పనులు జరుగుతూ ఉన్నాయని గౌరవ ఉప ముఖ్యమంత్రి గారు చెప్పారు. గతంలో, రాజశేఖర రెడ్డి గారు అధికారంలో ఉండగా, వాళ్ళకు నీళ్ళు తీసుకుపోవడానికి ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో ప్రాజెక్టులు నడిచినాయి తప్ప, తెలంగాణ ప్రాజెక్టులకు వచ్చే సరికి ఎంతసేపూ అంతర్ రాష్ట్ర వివాదాలు అంటూ తెలంగాణకు అన్యాయం చేయడమే ఆనాడు జరిగింది. ఈరోజు మన తెలంగాణ మనకు వచ్చింది. గౌరవ ముఖ్యమంత్రి కేసిఆర్ గారు తెలంగాణను కోటి ఎకరాల మాగాణిని చేయాలనే తలంపుతో కార్యాచరణ చేయగా, గౌరవ మంత్రివర్యులు శ్రీ హరీశ్ రావు గారు ఒక బుల్లెట్ లాగా పని చేస్తున్నారు. నిన్న మనమందరం ఉగాది పండుగను జరుపుకుంటుంటే, రాత్రి 11 గంటలకు, 12 గంటలకు, తెల్లారి కూడా వారు పోయి సడన్ ఇన్‌స్పెక్షన్ చేసుకుంటూ, ఏ పని ఎట్లా ఉన్నది, పని గావాలె, మనమనుకున్న లక్ష్యాన్ని సాధించుకోవాలని పనిచేయడం జరుగుతోంది. గడచిన 60 సంవత్సరాలుగా ఎప్పుడైనా ప్రాజెక్టులు ఈ విధంగా పూర్తయ్యాయా అని నేను అడుగుతున్నాను. దీనిని ప్రతిపక్ష నాయకులు గ్రహించాలి. కాంగ్రెస్ హయాంలో, ఎంతసేపూ బడ్జెట్‌లలో ఫిగర్స్ ఉండేవి తప్ప, ఎప్పటికీ అవే ఫిగర్స్ వల్లె వేసినట్లు వస్తూ ఉండేవి. మేము కూడా గత శాసనమండలిలో ఆరు సంవత్సరాలపాటు చూశాం. అప్పటికీ, ఇప్పటికీ ఎంతో భేదం కనిపిస్తూ ఉంది. ఇవాళ బ్రహ్మాండంగా రిజల్ట్స్ కనిపిస్తూ ఉన్నాయి. మొన్నీమధ్యనే మా జనగామ నియోజకవర్గానికి కాఫర్‌డ్యాం ఏర్పాటు చేసి, దాని

ద్వారా మొన్న 10వ తారీఖున లద్దులూరు రిజర్వాయర్, చెరువులను దేవాదుల నీళ్ళతో నింపడం జరిగింది. చాలా క్రూషియల్ పీరియడ్‌లో వరి పంటకు నీళ్ళు అందడం వల్ల, ఇవాళ రైతుల కళ్ళలో ఆనందం ఉంది. అలాంటి పనులను ఈ ప్రభుత్వం చేస్తోంది.

తెలంగాణ ప్రాంతం అడుగడుగునా తిరిగిన ముఖ్యమంత్రి గారికి, ఏమి చేసి అయినా కోటి ఎకరాలకు నీళ్ళివ్వాలనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. పాలమూరు-రంగారెడ్డి గానీ, సీతారామ ప్రాజెక్టు గానీ, త్వరితగతిన ఎక్కడికక్కడ బ్రహ్మాండంగా ప్రాజెక్టులు చేసుకుంటూ పోతూ ఉన్నాం.

గతంలో చాలా మంది పట్టణాల వైపు చూసేవారు. ప్రధానంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్టపరచాలనే లక్ష్యంతో, గొర్రె కాపరులకు పెద్ద ఎత్తున గొర్రెల పంపకం చేపట్టడం జరిగింది. ఇవాళ పెద్ద ఎత్తున ఆ గొర్రెలకు పిల్లలు పుట్టడం వల్ల, సాయంత్రం ఊర్లలోకి పోతే కార్లు ముందుకు నడుస్తలేవు. ఏందంటే, గొర్రెల మందలు అడ్డవస్తున్నాయి. ఆ రకంగా గొర్రెల సంపద పెరుగుతూ ఉంది. ఆ రకంగా వాళ్ళ కళ్ళలో వెలుగులొస్తున్నాయి. ఆర్థికంగా బలపడే అవకాశం గొల్ల-కురుమలకు ఈ ప్రభుత్వం కల్పించిందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

బి.సి.ల కొరకు ఏం చేశారు? గత సంవత్సరం కూడా రూ.1000/-కోట్లు బడ్జెట్‌ను ఎంబిసిల కొరకు పెట్టారు, కానీ ఖర్చు కాలేదని సభ్యులు రామచంద్ర రావు గారు చెప్పారు. అధ్యక్షా, ఎంబిసిల గురించి గతంలో ఎవ్వరూ కూడా ఆలోచించలేదు. అత్యంత వెనకబడిన కులాల కొరకు రూ.1000/-కోట్లు పెట్టడమే కాదు, ప్రణాళికలు సిద్ధమవుతూ ఉన్నాయి. ఆ వెయ్యి, ఈ వెయ్యి మొత్తం రూ.2000/-కోట్లు ఎంబిసిల కొరకు ఖర్చు చేసి బిసిలకు న్యాయం చేయడం జరుగుతుందని తెలియజేస్తున్నాను.

అదే విధంగా ఈరోజు, కమ్మరి గానీ, కుమ్మరి గానీ, చాకలి గానీ, వడ్రంగి గానీ, ప్రతి ఒక్కరికీ కూడా సౌకర్యాలు ఏర్పరిచే విధంగా కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ఎక్కడ చూసినా, చెరువుల్లో చేపలు పెంచడం ద్వారా మత్స్యకారులు బ్రహ్మాండంగా అభివృద్ధి చెందుతున్నారు. సికింద్రాబాద్ చేపల మార్కెట్లో పని చేసుకుంటూ ఉండే మా ఊరతను, మొన్నీమధ్యన మా ఊళ్ళో కలిశాడు. ఏందయ్యా అని అడిగితే, నేను ఇక్కడ మంచిగా చేపలు పట్టుకుంటున్నాను, నాకు ఇక్కడ బ్రహ్మాండమైన ఆదాయముంది, నాకు రెండెకరాల పొలమున్నది, ఆ పొలం నేను పారించుకుంటా, నేను మళ్ళీ హైదరాబాదుకు పోను, ఇక్కడే ఉంటానని ఆ మత్స్యకారుడు చెప్పాడు. ఆ రకంగా ఈరోజు కులవృత్తులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

గతంలో అందరూ కూడా బ్రతుకుదెరువు కోసం హైదరాబాదుకు వచ్చేవారు. వారిని మళ్ళా తిరిగి గ్రామాలకు వచ్చే పరిస్థితిని కల్పించాలనుకున్న గౌరవ ముఖ్యమంత్రి గారు కుల వృత్తులను ప్రోత్సహించడం ద్వారా వారిని గ్రామీణ ప్రాంతాలకు తీసుకురావడం జరుగుతోంది. పౌల్ట్రీ పరిశ్రమకు కూడా ప్రభుత్వం పెద్ద ఎత్తున సహకారం అందిస్తోంది.

సంక్షేమ రంగం... అధ్యక్షా, ఆసరా పెన్షన్ విషయం చూడండి. గతంలో ఎవరికైనా పెన్షన్ కావాలంటే, మీ ఊళ్ళో ఎవరైనా చనిపోతే చెప్పు, ఆ స్థానంలో నీకు అవకాశం కల్పిస్తామని చెప్పేవారు. కానీ, ఇవాళ ఆ పరిస్థితి లేదు. అర్హులైన వారందరికీ, వాళ్ళ వయస్సు 64 ఏళ్ళ నుండి 65 ఏళ్ళు రాగానే వాళ్ళకు పెన్షన్లు ఇవ్వడం జరుగుతోంది. దినదినం ఆ సంఖ్య పెరుగుతూనే ఉంది. ప్రతి నెల ఆసరా పెన్షన్ల సంఖ్య పెరుగుతూ ఉంది. ఖర్చూ పెరుగుతూ ఉంది. ఈరోజున రాష్ట్రంలో 41, 78,291 మంది ఆసరా పెన్షన్లను తీసుకుంటూ ఉన్నారు.

1.00 మ. ఆసరా పింఛన్లకు రూ.5,300 కోట్లు ఖర్చు అవుతోంది. ఇన్ని నిధులను ఎవరైతే బడుగు, బలహీన వర్గాలున్నారో, ఎవరైతే ఆర్థికంగా వెనుకబడిన వారున్నారో, ముసలమ్మ, ముసలయ్యలకు ఖర్చు పెట్టడం జరుగుతోంది. దాంతో వారందరి కళ్లల్లో వెలుగులు చూస్తున్నాము. ఈ పింఛన్లతో వారి కొడుకులు, కోడళ్లు, మనమలు, మనమరాళ్లు వారిని గౌరవిస్తున్నారు. అలాంటి గౌరవం తీసుకువచ్చేదే ఆసరా పథకం.

ఆడపిల్లలు పుడితే కొంతమంది గుదిబండలాగా ఫీల్ అవుతున్నారు. కొంతమంది అయితే ఆడపిల్లల్ని అమ్ముకుంటున్నారు. అలాంటి పరిస్థితుల్లో ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టనప్పటికీ, కళ్యాణ లక్ష్మీ/షాదీ ముబారక్ పథకాన్ని ప్రారంభించడంతో గౌరవ ముఖ్యమంత్రి గారిని ఒక తండ్రి, అన్న లాగా, ఒక మేనమామ లాగా భావిస్తున్నారు. ప్రారంభంలో ఈ అమౌంట్ అమ్మాయి పేరు మీద విడుదల చేయడంతో అది కాస్తా అబ్బాయి పరిధిలోకి వెళ్లి పోతుండేది, దాంతో దానిని ఇప్పుడు అమ్మాయి తల్లి పేరుమీద మంజూరు చేయడం జరుగుతోంది. అది మొదట్లో రూ.51వేల నుండి 75,116/- చేయడం జరిగింది. కానీ, అది కూడా

సరిపోవడం లేదనే ఉద్దేశ్యంతో ఈరోజే రూ.1,00,116/-లుగా శాసనసభలో గౌరవ ముఖ్యమంత్రి గారు, శాసన మండలిలో గౌరవ ఉప ముఖ్యమంత్రి(విద్య) ప్రకటించడం జరిగింది. ఇలా పెంచడమనేది ఏదో సంతోషమని గౌరవ సభ్యులు శ్రీ ఎన్.రామచంద్ర రావు గారు మాట్లాడుతున్నారు గానీ, పెంచినందుకు కృతజ్ఞతలు అని కూడా చెప్పకపోవడం చాలా బాధ కలిగిస్తుంది. మంచి చేస్తే ఏదో సంతోషం అంటున్నారు. అది మంచి పద్ధతి కాదు.

ఒకసారి కేంద్రం గురించి కూడా ఆలోచిస్తే, వారు ప్రవేశపెట్టిన బడ్జెట్ నిధులు రాష్ట్రాలన్నింటికి సరిగా ఇస్తున్నారా? అని అడుగుతున్నాను. కేంద్రం నుండి అటవీ శాఖకు సంబంధించిన నిధులు చాలా సంవత్సరాల నుండి రాకుండా పెండింగ్‌లో ఉన్నాయి. గౌరవ ముఖ్యమంత్రి గారు, మంత్రులు ఎన్నిసార్లు వెళ్లి కేంద్రాన్ని రిక్వెస్ట్ చేసినా కూడా నిధులు విడుదల చేయడం లేదు. గౌరవ ఉప ముఖ్యమంత్రి(విద్య) గారు కేంద్రంలో ఒక కమిటీకి ఛైర్మన్‌గా ఉండి, వారిచ్చిన నివేదికలను కూడా బుట్టదాఖలు చేయడం జరిగింది. ఈ రకంగా కేంద్రం చేస్తే ఒకటి, రాష్ట్రం చేస్తే మరొకటి. ఈరోజు తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ రాష్ట్రం దిశగా తీసుకువెళుతున్నప్పటికీ కూడా విమర్శలు చేస్తున్నారు. ఏదేమైనప్పటికీ, అభివృద్ధి ఎవరు చేస్తున్నారనేది ప్రజలు గమనిస్తున్నారు.

టిఆర్ఎస్ ప్రభుత్వం ఒకవైపు అభివృద్ధిని, మరోవైపు సంక్షేమాన్ని రెండు కళ్లలాగా అభివృద్ధి వైపు తీసుకుపోతోంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో చూసుకుంటే మన రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్. గౌరవ ముఖ్యమంత్రి గారికి, శ్రీ కె. తారక రామారావు గారికి, శ్రీ హరీష్‌రావు గారికి ఎన్నో ప్రశంసా పత్రాలు వస్తున్నట్లుగా మనం పత్రికల్లో గమనిస్తున్నాము. ఆ రకంగా ఈ ప్రభుత్వం ప్రశంసా పత్రాలు ఎలా పొందుతుంది, మిగతా రాష్ట్రాలు ఎందుకు పొందలేకపోతున్నాయనేది గమనించాలని మీద్వారా గౌరవ సభ్యులు శ్రీ ఎన్. రామచంద్ర రావు గారిని కోరుతున్నాను. ఇలా ప్రభుత్వం ఇంత చక్కటి కార్యక్రమాలు చేస్తున్నా కూడా విమర్శలు చేస్తూనే ఉన్నారు. విమర్శలు చేయండి, కానీ, నిర్మాణాత్మకమైన విమర్శలు చేస్తే బాగుంటుంది.

ఆరోగ్యం విషయాన్ని చూసుకుంటే అమెరికాలో హెల్త్ ప్రొఫైల్ సిస్టమ్ ఎలా అయితే ఉందో, ఆ విధంగా రాష్ట్రంలోని గౌరవ ముఖ్యమంత్రి గారి వద్దనుండి మొదలుకొని గ్రామీణ ప్రాంతంలోని సామన్య మానవుని వరకు ప్రభుత్వం హెల్త్ ప్రొఫైల్ తీసుకువస్తోంది. గతంలో నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు అన్న నానుడి నుండి కెసిఆర్ కిట్ ప్రారంభించిన నాటి నుండి నేను వస్తా బిడ్డో సర్కారు దవాఖానకి అనే విధంగా మారిపోయింది. కిట్‌లో చూస్తే అంతర్జాతీయంగా పేరొందినటువంటి జాన్సన్ పౌడర్, సబ్బులు తదితర 16 సామాన్లు వస్తున్నాయి. ఎవరికీ తోచనటువంటి మంచి పథకాలు గౌరవ ముఖ్యమంత్రి గారి ఆధ్వర్యంలో వస్తున్నాయి.

విద్యపై కూడా గౌరవ సభ్యులు శ్రీ ఎన్.రామచంద్ర రావు గారు విమర్శలు చేయడం జరిగింది. ఎస్సీ/ఎస్టీల కొరకు డిగ్రీ మహిళా కళాశాలలు ఏర్పాటు చేయడం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభించుకోవడం జరిగింది. కెజి టు పిజి ఏమైందని మాట్లాడుతున్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలు కెజి టు పిజి కాదా? అని అడుగుతున్నాను. గౌరవ సభ్యులు శ్రీ ఫారూక్ హుస్సేన్, నేను మరియు తదితర సభ్యులమంతా కలసి గజ్వేల్, సిద్ధిపేట ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ మైనారిటీ విద్యా సంస్థలను పరిశీలించినప్పుడు అక్కడున్నటువంటి మైనారిటీ పిల్లల తల్లిదండ్రులు ఆనంద భాష్పాలతో ఎదురయ్యారు. ఏంటమ్మా అని అడిగితే, గతంలో మేమెప్పుడూ పాఠశాలల్లోకి వెళ్లిన పాపాన పోలేదు, ఇప్పుడు ప్రభుత్వం పెద్ద ఎత్తున మైనారిటీ పాఠశాలలు ప్రారంభించడం వల్ల మా పిల్లలు చక్కగా చదువుకుంటున్నారని ఆనందంతో వారు మాకు చెప్పడం జరిగింది.

ఒక్కొక్క విద్యార్థిపైనా లక్ష రూపాయలకు పైనా ఖర్చు చేసి పేద విద్యార్థులకు మంచి విద్యనందిస్తున్నాము. మోడల్ పాఠశాలల్లో గానీ, సర్వశిక్ష అభియాన్ పాఠశాలల్లో గానీ పెద్ద ఎత్తున తరగతి గదుల మరమ్మత్తులు చేపట్టడం జరుగుతోంది. ఉపాధ్యాయులకు కూడా మంచి వేతనాలు పెంచడం జరిగింది. ప్రభుత్వం విద్య, వైద్యం అనే లక్ష్యంగా ముందుకు పోతోంది. దానిపైన కూడా విమర్శలు చేయడం బాధాకరమని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. గతంలో 10 సంవత్సరాలు పని చేసిన కాంగ్రెస్, ఇప్పుడున్న ప్రభుత్వం ఏరకంగా పని చేస్తుందనేది కూడా బేరీజు వేసుకోవాల్సిన అవసరముందని మీద్వారా తెలియజేస్తున్నాను.

ఓవర్సీస్ స్కాలర్‌షిప్ ద్వారా రూ.20 లక్షలతో పేద వర్గాల విద్యార్థులను విదేశాలలో చదివించే కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఇంటింటికీ స్వచ్ఛమైన నీరందించాలనే తలంపుతో రాష్ట్ర వ్యాప్తంగా మిషన్ భగీరథ కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. అలాంటి పథకాన్ని కూడా విమర్శిస్తున్నారు. అది ఎంత చక్కటి కార్యక్రమమో ఒక్కసారి ఆలోచించాలి. స్వచ్ఛమైన నీరందకనే దాదాపు 70శాతం మంది రోగాల పాలవుతున్నారు. కేవలం డబ్బులున్న వారే మినరల్ వాటర్ తీసుకోవడం జరుగుతోంది. కానీ, అంతకంటే స్వచ్ఛమైన నీరు మిషన్ భగీరథ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం సరఫరా చేయడం జరుగుతోంది. గౌరవ ప్రధానమంత్రి గారే బ్రహ్మాండంగా ఉందని ఈ పథకాన్ని ప్రశంసించడం జరిగింది. గౌరవ ముఖ్యమంత్రి గారు ఎప్పుడు మాట్లాడినా నీటి గురించే తహ, తహ లాడుతారని గజ్వేల్ సభలో గౌరవ ప్రధానమంత్రి గారే చెప్పడం జరిగింది.

ఒక ప్రక్కనేమో సాగునీరు అందించాలని ప్రాజెక్టులు యుద్ధప్రాతిపదికన నిర్మించడం జరుగుతోంది. మరోప్రక్క స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని నాలుగు సంవత్సరాల్లో మిషన్ భగీరథ ద్వారా మంచినీరు అందించకపోతే ఓట్లు అడగనని గౌరవ ముఖ్యమంత్రి గారు ఛాలెంజ్ చేశారు. అంత దమ్ము ఎవరికైనా ఉంటుందా అని నేను అడుగుతున్నాను. అటువంటి ఛాలెంజెస్ తీసుకుంటే గానీ పని జరగదనే లక్ష్యంతో గౌరవ ముఖ్యమంత్రి గారు పని చేస్తున్నారు.

మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రెండు పడక గదుల ఇళ్లు లాంటి ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలు ఏవైతే ఉన్నాయో, వాటిపై గౌరవ ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు ఇప్పటికీ ఐదు సార్లు, ఐదు జిల్లాల కలెక్టర్లతో గౌరవ ఉప ముఖ్యమంత్రి(విద్య) గారు సమీక్షలు నిర్వహించి, పనులు అనుకున్న సమయంలో పూర్తి చేయాలని ఆదేశించడం జరిగింది. అందుకనే ప్రస్తుతం జరుగుతున్న పనులు చాలా వేగం పుంజుకున్నాయి. ప్రతి ఒక్కరూ జవాబుదారితనంతో పని చేస్తున్నారు. ఉద్యోగస్తులకు కూడా మంచి వేతనాలు ఇవ్వడం జరుగుతోంది. వారి కష్ట-సుఖాలు చూడడం జరుగుతోంది. ఆవిధంగా ఉద్యోగులతో ఫ్రెండ్లీ గవర్నమెంట్‌గా మెదులుతూ ప్రభుత్వం బ్రహ్మాండమైన విజయాలు సాధిస్తుందని మీద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

గతంలో మాజీ ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి గారు మాట్లాడుతూ, మీకు విద్యుత్ ప్రాజెక్టులు లేవు, ప్రాజెక్టులన్నీ మాదగ్గరనే ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే చీకటి మయం అవుతుందని చెప్పడం జరిగింది. అలాంటి పరిస్థితుల్లో రాష్ట్రం అవతరించిన 6 నెలల్లోనే నాణ్యమైన విద్యుత్తును అందించడం జరిగింది. ఇప్పుడైతే వ్యవసాయానికి 24గంటలు విద్యుత్‌ను సరఫరా చేయడం జరుగుతోంది. ఇలా విద్యుత్ ఉండడం వల్లనే మన రాష్ట్రానికి అనేక పరిశ్రమలు వస్తున్నాయి. గతంలో రైతులు వ్యవసాయానికి 6గంటలు, 9గంటల విద్యుత్ సరఫరా చేయాలని కోరేవారు. అదే ఈరోజు 24గంటలు విద్యుత్‌ను సరఫరా చేస్తామని ప్రభుత్వం అంటుంటే, మాకు 24 గంటలు వద్దు, 9 గంటలు చాలు, 12 గంటలు చాలని రైతులు ధర్నాలు చేస్తున్నారు. గతంలో విద్యుత్ కావాలని ధర్నాలు, ఈరోజు విద్యుత్ వద్దని ధర్నాలు చేస్తున్నారు. 24 గంటలు విద్యుత్ సరఫరా చేస్తుంటే అనవసరంగా నీరు వృథాగా పోతుందని, గ్రౌండ్ వాటర్ తగ్గిపోతోందని కేవలం 9 గంటలు గానీ, 12 గంటలు గానీ విద్యుత్ సరఫరా చేయాలని రైతులు అడుగుతున్నారు.

వరంగల్ జిల్లాలో రూ.1200కోట్లతో మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను ప్రారంభించడం జరిగింది. నేత కార్మికులకు అక్కడ ఉపాధి అవకాశాలు పెద్దఎత్తున లభిస్తున్నాయి. మొన్ననే Global Entrepreneurship కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఇవాంక ట్రంప్, ప్రధానమంత్రి గారు రావడం జరిగింది. ఐటి అంటే హైదరాబాద్, హైదరాబాద్ అంటే ఐటి అంటున్నారు. దానికి అనుగుణంగానే డైరెక్ట్ ఎంప్లాయ్‌మెంట్ కంటే కూడా ఇన్‌డైరెక్ట్ ఎంప్లాయ్‌మెంట్ పెద్ద ఎత్తున వస్తుంది.

కార్పొరేషన్స్ కూడా బలంగా ఉండాలనే ఉద్దేశ్యంతో వరంగల్ కార్పొరేషన్‌కి క్రితంసారి రూ.300 కోట్లు, ఇప్పుడు రూ.300 కోట్లు నిధులు కేటాయించడం జరిగింది. అందుకు గౌరవ ముఖ్యమంత్రి గారికి నేను కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

సాంస్కృతిక శాఖ ద్వారా కనీ, వినీ ఎరుగని రీతిలో ప్రపంచ తెలుగు మహా సభలు నిర్వహించుకొని, ప్రపంచం నలుమూలలా తెలుగు గొప్పదనాన్ని చాటుకోవడం జరిగింది.

దేవాలయాలు తీసుకుంటే, తిరుపతిని మరచిపోయి యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయానికి వస్తున్నారు. అక్కడ కనీ, వినీ ఎరుగని రీతిలో అభివృద్ధి జరుగుతోంది. అదేవిధంగా వేములవాడ మరియు భద్రాచలం దేవాలయాలను అభివృద్ధి చేసుకుంటున్నాము.

రాష్ట్రంలో ఏ కార్యక్రమం తీసుకున్నా లా అండ్ ఆర్డర్ సరిగా ఉండాలనే ఉద్దేశంతో పోలీసులు మరియు హోంగార్డుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. లా అండ్ ఆర్డర్

చక్కగా ఉండడం వల్లనే ఆమెరికా లాంటి పెద్ద దేశానికి చెందిన అనేక కంపెనీలు మనదగ్గర పెట్టుబడి పెట్టడానికి వస్తున్నాయి.

ఈవిధంగా పేదలకు అనువైనదిగా, అభివృద్ధికి అనుగుణంగా శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన గౌరవ ఆర్థిక మంత్రివర్యులకు, శాసన పరిషత్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టిన గౌరవ ఉప ముఖ్యమంత్రి(విద్య) గారికి కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేస్తూ ముగిస్తున్నాను. జైహింద్, జై తెలంగాణ.

**శ్రీ టి. భాను ప్రసాద రావు:-** అధ్యక్షా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మంత్రివర్యులైన ఆర్థికమంత్రి శ్రీ ఈటల రాజేందర్ గారు ఐదవసారి శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టినందుకు వారికి మరియు శాసన పరిషత్తులో బడ్జెట్ ప్రవేశ పెట్టిన గౌరవ ఉప ముఖ్యమంత్రి(విద్య) గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

రూ.1,74,453.84 కోట్ల బడ్జెట్‌ని ప్రవేశపెట్టడం జరిగింది. ఉమ్మడి రాష్ట్రంలో గానీ, గతంలో గానీ బడ్జెట్ అంటే జీవం లేని అంకెలుగా, సారం లేని గణాంకాలుగా కేవలం చిట్టా పద్దుల పట్టికలుగా ఉండేటటువంటి పరిస్థితులు ఉండేవి. కానీ, ఈరోజు సుదీర్ఘ కాలం పాటు ఉద్యమ నాయకుడై ఉద్యమం నడిపి, ఆ ఉద్యమ నాయకుడి ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొదటిది పూర్తిస్థాయి బడ్జెట్ కాకున్నప్పటికీ, మిగతా నాలుగు పూర్తిస్థాయి బడ్జెట్‌లను చూసినట్లయితే తెలంగాణ ప్రజల ఆకాంక్షలను, వారి కళ్లల్లో తొణికిసలాడుతున్న అరవై ఏళ్ల కలల్ని ప్రతిబింబిస్తున్నటువంటి పరిస్థితులున్నాయి.

ప్రజాధనాన్ని ప్రజల నిజమైన అభివృద్ధి కొరకు వెచ్చించేటటువంటి గంభీరమైన, బాధ్యతాయుతమైనటువంటి ప్రక్రియగా ఈ నాలుగు సంవత్సరాల కాలంలో బడ్జెట్ మారిందని అని తప్పకుండా చెప్పగలుగుతాను. ఈ బడ్జెట్ విషయంలో పెద్దలు శ్రీ ఎస్.రామచంద్ర రావు గారు గానీ, ఇతర ప్రతిపక్ష నాయకులు గానీ బడ్జెట్ పెట్టేది ఎక్కువగా ఉంది, ఖర్చు తక్కువగా ఉందని చెబుతున్నారు. అయితే, ఒకే తరగతి గదిలో గౌరవ సభ్యులు శ్రీ ఎస్. రామచంద్ర రావు గారి లాంటి విద్యార్థి గానీ, నాలాంటి విద్యార్థి గానీ ఉంటారు. శ్రీ ఎస్.రామచంద్ర రావు గారు వచ్చే 10వ తరగతి పరీక్షలో ఎలాగైనా 95శాతం మార్కులు రావాలని నిర్ణయించుకొని 95శాతం మార్కుల కొరకు కృషి చేస్తుంటారు. నాలాంటి విద్యార్థి పాస్ మార్కులు 35 కదా, 45 మార్కులు వస్తే బాగుంటుందనే లక్ష్యంతో చదువుతూ ఉంటాను. అల్టిమేట్‌గా రిజల్టు వచ్చిన రోజున నాకేమో 55 మార్కులు వచ్చాయి. శ్రీ ఎస్. రామచంద్ర రావు గారికేమో 75మార్కులు వచ్చాయి.

**1.20 మ.** నేను నిర్దేశించుకున్న లక్ష్యం 45 మార్కులయితే, 55 మార్కులు సాధించడం జరిగింది. అంటే నేను గొప్ప విద్యార్థినా? 95 మార్కులు నిర్దేశించుకుని, 75 మార్కులు సాధించిన గౌరవ సభ్యులు రామ చంద్రరావు గొప్ప విద్యార్థియా అంటే లేదు, లేదు రామ చంద్రరావు గారు 95 మార్కులు వస్తాయనుకుంటే, 75 మార్కులు వచ్చాయి కాబట్టి లాభం లేదు, భానుప్రసాద్‌కు 45 మార్కులు వస్తాయని చెబితే, 55 మార్కులు వచ్చాయి కాబట్టి చాలా గొప్పవాడు అని చెబితే ఎలా ఉంటుందో, ఈరోజు ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాలకు చేరలేకపోతున్నారని, దానికంటే కొంచెం తక్కువ ఖర్చు పెట్టారని గౌరవ సభ్యులు మాట్లాడుతున్న సందర్భంలో తెలంగాణ రాష్ట్రం ఉన్నతమైన ప్రగతి సాధించాలనే లక్ష్యాలతో అడుగులు వేస్తోంది. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కెసిఆర్ గారు ఆ దిశగా సుస్థిరమైన అడుగులు వేయాలనే ఉద్దేశంతో మా లక్ష్యాలను పెద్ద లక్ష్యాలుగా పెట్టుకోవడం జరిగింది. ఆ లక్ష్యాలను చేరే సందర్భంలో కొద్దిగా తగ్గితే తగ్గి ఉండొచ్చు. తప్పకుండా ఆ లక్ష్యాలను అధిగమించి ముందుకు వెళ్లే రోజు త్వరలో రాబోతుందని మీద్వారా తెలియజేస్తున్నాను.

రెండవ అంశం, తెల్లారి లేస్తే ప్రతిపక్ష పార్టీలు, ప్రభుత్వం అప్పులు చేస్తోందని చెబుతున్నాయి. గతంలో 1992వ సంవత్సరంలో హైదరాబాద్‌లో నేను ఆర్కిటెక్ట్‌గా ప్రాక్టీసు చేస్తున్న సమయంలో నా దగ్గరకు ఇద్దరు సోదరులు వచ్చారు. అందులో ఒకరు బ్యాంకు ఉద్యోగస్తుడు, మరొకరు డాక్టరు. వారు నాతో మాట్లాడుతూ, మా ఇద్దరి దగ్గర చెరొక రూ.5.00 లక్షలు ఉన్నాయి, హైదరాబాద్‌లో ఇల్లు కట్టుకుందామని అనుకుంటున్నాం, ఈ డబ్బుతో ఇల్లు కట్టుకోగలుగుతామా అని నా దగ్గర సలహా తీసుకోవడానికి వచ్చారు. అప్పుడు నేను ఈ డబ్బుతో హైదరాబాద్‌లో ఎక్కడ ఇల్లు కట్టదలచుకున్నారని అడిగితే, జూబ్లిహిల్స్‌లో కట్టదలచుకున్నామని చెప్పారు. అక్కడ కట్టుకోవాలంటే కనీసం రూ.10.00 లక్షలైన అప్పు తీసుకుంటే, మొత్తం రూ.15.00 లక్షలతో ఇల్లు కట్టుకోవడానికి అవకాశం ఉంటుందని ఆ రోజు ఉన్న ఎస్టిమేట్ ప్రకారం నేను చెప్పడం జరిగింది. అందులో బ్యాంకు ఉద్యోగి - సార్, మీరు చెప్పింది బాగానే ఉంది, లోను తీసుకొని కట్టుకుంటానని ముందుకొచ్చాడు. ఆ రూ.15.00 లక్షలతో 600 గజాల స్థలం కొనుక్కొని ఇల్లు కట్టుకున్నాడు. ఆ డాక్టరు మాత్రం వారి

తమ్ముడు ఏ బ్యాంకులో పనిచేస్తున్నాడో, ఆ బ్యాంకులో రూ.5.00 లక్షలను డిపాజిట్ చేసుకున్నాడు. ఆ బ్యాంకు ఉద్యోగి కట్టుకున్న ఇల్లు ఆస్తి విలువ ఇవ్వాళ దాదాపు రూ.50.00 కోట్లకు పెరిగింది. ఆ డాక్టరు బ్యాంకులో డిపాజిట్ చేయడం వల్ల వచ్చిన వడ్డీతో ఇంటి అద్దె కట్టుకోవడానికే సరిపోతుంది.

నేను చెప్పేది, ఏ అప్పులైతే ప్రభుత్వం ఈ రాష్ట్ర అభివృద్ధి కొరకు తీసుకు వస్తోందో, ఆ అప్పులు ఈ రాష్ట్రం ఆస్తుల కొరకు గాని, లేకుంటే రాబోయే తరాలకు సంబంధించిన ఆస్తుల కొరకు గాని ఖర్చు పెడుతున్నపుడు ఆ ఆస్తుల విలువ రోజు రోజుకు పెరుగుతూ ఉంటుంది. అటువంటి సందర్భంలో ప్రభుత్వం అప్పులు చేయడం తప్పు కాదు. ఇంతకు ముందు గౌరవ సభ్యులు చెప్పినట్లు, బైకు కొనుక్కోవడానికో, లేదా అందులో పోసే పెట్రోల్ కొరకో అప్పు చేస్తే అది ఖచ్చితంగా తప్పే. కానీ ప్రభుత్వం ఆ విధంగా అప్పులు చేయడం లేదు. తెలంగాణ ప్రభుత్వం ఈ రాష్ట్రానికి దీర్ఘకాలంపాటు ఉండేటట్లు, సుభిక్షంగా వర్ధిల్లడానికి కావలసిన అన్ని రకాల ప్రాజెక్టులకు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులకు తీసుకొచ్చి ప్రతి రూపాయిని పరిమితమైన ఆస్తులను క్రియేట్ చేయడానికి మాత్రమే ఖర్చు చేసే దిశగా అడుగులు వేస్తోంది.

గతంలో 15 సంవత్సరాల నుండి 20 సంవత్సరాల వరకు అనేక ప్రాజెక్టులను కట్టిన సందర్భాలున్నాయి. కనీసం 8 నుండి 9 సంవత్సరాలలోపు నాగార్జునసాగర్ గాని ఇంకా ఇతర పెద్ద ప్రాజెక్టులు గాని పూర్తయిన దాఖలాలు లేవు. దాదాపు 12 సంవత్సరాల కాలం పట్టేది. అటువంటి పరిస్థితి ఉండేది. ఆ 8 నుండి 12 సంవత్సరాల కాలంలో ఆ ప్రాజెక్టు కాస్ట్ ఎస్కలేషన్ దాదాపు మూడు, నాలుగింతలు పెరిగే పరిస్థితి ఉండేది.

ఆనాడు ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభమైన పోలవరం ప్రాజెక్టును ఈరోజు పక్క రాష్ట్రం నిర్మాణం చేస్తున్నది. దానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రాజెక్టుగా ఫండింగ్ ఇస్తున్నటువంటి పరిస్థితి ఉంది. ఆ ప్రాజెక్టును రూ.15,000 కోట్లతో పూర్తి చేయాలని డిజైన్ చేస్తే, ఈరోజు అది లక్షలాది కోట్లకు పెరిగిపోయింది. ఎందుకంటే, నిర్దేశిత లక్ష్యంతో, ఒక నిర్ణీత సమయంలో ప్రాజెక్టును పూర్తి చేయలేదు కాబట్టి ఈరోజు ఆ ప్రాజెక్టు కాస్ట్ ఎస్కలేషన్ జరుగుతూ, జరుగుతూ ఈరోజు లక్షలాది కోట్ల రూపాయలు వెచ్చించినా కూడా ఆ ప్రాజెక్టు పూర్తి కానటువంటి పరిస్థితి ఏర్పడింది.

మన గౌరవ ముఖ్యమంత్రిగారికి పూర్తి అవగాహన ఉంది. కాబట్టి రాష్ట్ర అభివృద్ధిని సాధించాలంటే ఏ లక్ష్యంతో ముందుకు పోవాలి, మనం అనుకున్న నిర్దేశిత లక్ష్యాలను ఏ విధంగా సాధించాలనే సంపూర్ణమైన అవగాహనతో ఉన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అవసరమైన నిధులు ఏ విధంగానైనా మొబిలైజ్ చేసుకొని ఆ ప్రాజెక్టులను నిర్దేశిత సమయంలోనే పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు పోతున్నారు.

ఉదాహరణకు పోలవరం ప్రాజెక్టు చూసుకున్నట్లయితే దాని ఖర్చు ఒక లక్ష, రెండు లక్షల కోట్ల రూపాయలే కాదు, ఒకవైపు ప్రాజెక్టు కాస్ట్ పెరగడమే కాకుండా ఈ పదిహేను సంవత్సరాల కాలంలో దాని ద్వారా లభించవలసిన ఆయకట్టు, రైతులకు లభించాల్సిన ప్రయోజనాలు దక్కకుండా పోయాయి. 60 సంవత్సరాల కాలం పాటు సుదీర్ఘ పోరాటం చేసిన తెలంగాణ రాష్ట్రంలో వచ్చే 60 సంవత్సరాలలో ఇక్కడ ఉన్న వనరులను వాడుకోలేని పరిస్థితి ఉండకూడదనే ఉద్దేశంతో ప్రాజెక్టులన్నింటిని శీఘ్రగతిన పూర్తి చేసి, వాటి క్రింద కోటి ఎకరాలకు నీరందించాలనే లక్ష్యంతో ముందుకు పోవడం జరుగుతోంది.

ఈరోజు వరకు రాష్ట్రంలోని 55 శాతం మంది ప్రజలు వ్యవసాయమే ఆధారంగా జీవిస్తున్నారు. అందులో ముఖ్యంగా 86 శాతం చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు. ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికోసం బడ్జెట్‌లో రూ.1,74,453 కోట్లు ప్రవేశ పెట్టడం జరిగింది. అందులో వ్యవసాయానికి అనుబంధ రంగాలకు, వ్యవసాయానికి ముడిపడిన రంగాలకు ఈ బడ్జెట్‌లో దాదాపు 26 శాతం నిధులు కేటాయించడం జరిగింది. ఏ రాష్ట్రంలో ఇటువంటి అవకాశం రాలేదు, ఇటువంటి పరిస్థితులు కలగలేదనే విషయాన్ని మీ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకొస్తున్నాను.

పోయిన సంవత్సరం బడ్జెట్‌తో పోల్చుకుంటే వ్యవసాయ రంగానికి ఈ సంవత్సరం బడ్జెట్‌లో రూ.12,844 కోట్లు కేటాయించడం జరిగింది. అంటే రెండింతలు పెరిగిందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఈ రోజు ప్రభుత్వం రైతుల విషయంలో ఎంతో చిత్తశుద్ధితో పని చేస్తుందని ఇంతకు ముందు గౌరవ సభ్యులు శ్రీ బోడకుంటి వెంకటేశ్వర్లు చెప్పారు. ప్రభుత్వం రైతుల కోసం రూ.5.00 లక్షల బీమా పథకాన్ని ప్రవేశ పెట్టాలనే మంచి ఆలోచన కెసిఆర్ గారికి రావడం గమనించినట్లైతే క్రింది స్థాయి నుంచి పూర్తి స్థాయిలో అవగాహన ఉన్నటువంటి వ్యక్తులకు మాత్రమే సాధ్యమవుతుందనే విషయాన్ని మీద్వారా తెలియజేస్తున్నాను.

ఈ సంవత్సరం రైతులకు పెట్టుబడి క్రింద ఎకరానికి రూ.4,000/-ల చొప్పున రెండు పంటల కోసం రెండు విడతల్లో ఇచ్చే విధంగా ఈ దేశంలోని రాష్ట్రాల్లో ఎక్కడా లేదని చెప్పవచ్చు. ఈ రోజు రైతులను సంఘటిత పరిచే విషయంలో వారికి అవసరమైన గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజి, పాలీ హౌసెస్, డ్రిప్ ఇరిగేషన్, మైక్రో ఇరిగేషన్ వంటి వసతులు కల్పించే విషయంలో తెలంగాణ రాష్ట్రం ఒక నూతన పుంతలు తొక్కుతూ ముందుకు పోతున్నది. దాదాపు 14 లక్షల ఎకరాలకు సంబంధించి, ఇప్పటికే మనం మైక్రో ఇరిగేషన్ ప్రొవైడ్ చేసుకున్నామంటే, అది మామూలు విషయం కాదు.

ఈరోజు ప్రభుత్వం దాదాపు 2.35 లక్షల కుటుంబాలకు 50 లక్షల గొర్రెలను పంపిణీ చేయడం మామూలు విషయం కాదు. గతంలో తీర ప్రాంతాలలో మాత్రమే చేపలు ఉంటాయనే పరిస్థితి నుండి తెలంగాణ రాష్ట్రంలో చేపలను ఉత్పత్తి చేయడం వల్ల అవి పెరిగే అవకాశం ఉందా అనే పరిస్థితి నుంచి ఈరోజు తెలంగాణ ప్రభుత్వం చేపల పెంపకం కార్యక్రమాన్ని చేపట్టి ప్రతి సంవత్సరం 3.20 లక్షల టన్నుల చేపలను ఉత్పత్తి చేయడం జరుగుతోంది.

అదే విధంగా తెలంగాణ రాష్ట్రంలో కోళ్ల పరిశ్రమ అభివృద్ధి కోసం ఈ బడ్జెట్‌లో రూ.109 కోట్ల నిధులు కేటాయించడం జరిగింది. ఈ రోజు మన రాష్ట్రం ఎగ్ బాస్కెట్ ఆఫ్ ఇండియాగా పేరు పొందింది. ఈ విధంగా దానిని మరింత ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకోవడం సంతోషించదగిన పరిణామం.

అలాగే వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహించడం కోసం ఈ బడ్జెట్‌లో రూ.522 కోట్లు కేటాయించడం జరిగింది. దాదాపు 50 శాతం నుండి 95 శాతం సబ్సిడీపై 13,934 ట్రాక్టర్లు రైతులకు పంపిణీ చేయడం చాలా గొప్ప పరిణామంగా చెప్పవచ్చు.

గ్రామీణాభివృద్ధి మరియు పంచాయతీ రాజ్ శాఖకు బడ్జెట్‌లో రూ.15,563 కోట్లు కేటాయించడం జరిగింది. 2017-18 సంవత్సరంలో చూసినట్లయితే, సుమారు రూ.2,005 కోట్లు గత సంవత్సరం కంటే అదనంగా కేటాయించడం జరిగింది.

అంతేకాకుండా 14వ ఫైనాన్స్ కమిషన్ వచ్చిన తరువాత ముఖ్యంగా స్థానిక సంస్థలకు సంబంధించి నిధులను నేరుగా గ్రామ పంచాయతీలకే ఇవ్వడం ద్వారా మండల వ్యవస్థలు, జిల్లా వ్యవస్థలు పూర్తిగా నిర్వీర్యమయ్యే పరిస్థితి ఏర్పడింది. వాటికి ఎటువంటి నిధులు రానటువంటి పరిస్థితులు ఏర్పడ్డాయి. కాబట్టి వాటిని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో గౌరవ ముఖ్యమంత్రి గారు రూ.1,477 కోట్లతో ఈ రోజు స్టేట్ ఫైనాన్స్ కమిషన్ ద్వారా స్థానిక సంస్థలను బలోపేతం చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరిగింది. ఈ స్థానిక సంస్థలు రాబోవు రోజులలో బాగుపడతాయనే ఉద్దేశం కనపడుతున్నది.

ఆరోగ్య రంగం విషయంలో దాదాపు రూ.7375.2 కోట్లు ఈరోజు బడ్జెట్‌లో కేటాయించడం జరిగింది. గత ఏడాది కంటే దాదాపు రూ.1579 కోట్లు అధికంగా ఉన్నాయి. ఈ నాలుగు సంవత్సరాల కాలంలో ప్రభుత్వ ఆసుపత్రులు ఏ విధంగా బాగుపడ్డాయి, ఏ విధంగా మెరుగుపడ్డాయి అనేది సభ్యులందరం కూడా చూస్తునే ఉన్నాం. పూర్తిగా ఆసుపత్రులు మారిపోయాయి. ప్రైవేటు ఆసుపత్రుల స్థాయికి ఎదిగామని చెప్పలేను గాని, ఈ రాష్ట్రం ఏర్పడక ముందు ఉన్నటువంటి ప్రభుత్వ ఆసుపత్రులకి, ఇప్పుడున్న ప్రభుత్వ ఆసుపత్రులకి మెరుగైన పరిస్థితి ఉందని చెప్పవచ్చు.

రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 34 ప్రభుత్వ ఆసుపత్రులలో డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. గతంలో ప్రభుత్వ ఆసుపత్రులలో ఐసియులు లేనటువంటి పరిస్థితి ఉండేది. ఈరోజు దాదాపు 22 ఆసుపత్రులలో ఐసియులు, 12 ఆసుపత్రులలో క్యాన్సర్ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ఆరోగ్య రంగం విషయంలో ఈ రాష్ట్రం ఏర్పడిన తరువాత తీసుకుంటున్నటువంటి మెరుగైన చర్యలలో ఒక భాగంగా చెప్పుకోవచ్చు. దేశంలో ఉన్న అనేక రాష్ట్రాలకు సంబంధించిన వ్యక్తులు ఇక్కడికి వచ్చి ఈ కెసిఆర్ కిట్‌ను చూసి, వాళ్ల రాష్ట్రాలలో కూడా అమలు చేయాలనే విధంగా భావిస్తున్నారు. అంటే ఈ పథకం పెద్ద ఎత్తున విజయవంతం కావడం మనం ఈ రోజు చూస్తున్నాం.

ఈ రోజు సోషియో ఎకనామిక్ సర్వేకు సంబంధించి మనందరికీ బుక్స్ ఇవ్వడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో ఆరోగ్య రంగంలో చేపట్టిన చర్యలపై అనేక ప్రశంసలను సోషియో ఎకనామిక్ సర్వేలో మనం చూడవచ్చు. 21 పెద్ద రాష్ట్రాల్లో చూసుకున్నట్లయితే ఆరోగ్య రంగంలో తెలంగాణ రాష్ట్రం చేపడుతున్న కార్యక్రమాలకు 3వ స్థానం దక్కింది. 2016 సంవత్సరంలో దేశ వ్యాప్తంగా మరణాల రేటు 6.4 శాతంగా ఉంటే, మన తెలంగాణలో 6.1 శాతంగా ఉన్నది. దేశంలో ఉన్న యావరేజ్ కంటే ఇది తక్కువని చెప్పవచ్చు.

అదే విధంగా సబ్బండ వర్గాల సంక్షేమం కోసం గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం బడ్జెట్‌లో అధిక మొత్తంలో నిధులను ప్రతిపాదించడం జరిగింది. ఈ రోజు బిసిలకు రూ.5,920 కోట్లు, ఎస్సీలకు రూ.16,453 కోట్లు, ఎస్టీలకు రూ.9,693 కోట్లు, గురుకుల పాఠశాలలకు రూ.2,283 కోట్లు, ఎంబిసిలకు రూ.1,000 కోట్లు బడ్జెట్‌లో ప్రతిపాదించడం జరిగింది. ఈ విధంగా టిఆర్ఎస్ ప్రభుత్వం కుల వృత్తులను ఏ విధంగా ప్రోత్సహిస్తుందో మనందరం చూస్తూనే ఉన్నాం.

మైనారిటీల సంక్షేమ కోసం దాదాపు బడ్జెట్‌లో రూ.2,000 కోట్లు ప్రతిపాదించడం జరిగింది. గత ఏడాదితో పోలిస్తే దాదాపు రూ.750 కోట్లు అధికంగా ఇవ్వడం జరిగింది. మైనారిటీలలో టిఆర్ఎస్ ప్రభుత్వం పట్ల, కెసిఆర్ గారి పట్ల నమ్మకం, విశ్వాసం అనేది సంపూర్ణంగా ఏర్పడింది. 206 మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్‌కి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.735 కోట్లు ప్రతిపాదించింది.

అలాగే షాదీ ముబారక్ పథకం ద్వారా ఇప్పటికే 78,003 మందికి ప్రభుత్వం రూ.1,625 కోట్లు ఖర్చు పెట్టింది. ఈ రోజు నుండి ఇంకా లక్ష రూపాయలకు పెంచడం జరిగింది. అలాగే మసీదుల్లో ప్రార్థనలు చేసే ఇమామ్, మౌజామ్‌లకు నెలకి రూ.1,500/- అందిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 8,934 మంది ఇమామ్, మౌజామ్‌లకు దీనివల్ల ప్రయోజనం చేకూరుతున్నది. ఈ విధంగా మన రాష్ట్రంలోని అన్ని వర్గాలకు ప్రాధాన్యత లభిస్తుందని చెప్పక తప్పదు.

ఈరోజు సాగునీటి ప్రాజెక్టులు న భూతో న భవిష్యతి అనే విధంగా ఉన్నాయి. సాగునీటి ప్రాజెక్టుల యొక్క నిర్మాణం గతంలో ఏ రాష్ట్రంలో కూడా జరిగిన పరిస్థితి లేదు. ఒకవైపు మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులైన కాళేశ్వరం, పాలమూరు ఎత్తిపోతల పథకం, సీతారామ ఎత్తిపోతల పథకం, ప్రాణహిత, దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్, దిండి, సాగర్ మోడ్రనైజేషన్, ఎల్లంపల్లి, తుపాకుల గూడెం వంటి అనేక రకాల ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పనులు చేసుకుంటూనే, ఇంకోవైపు చిన్న నీటి వనరులు అయిన మిషన్ కాకతీయకు బడ్జెట్‌లో రూ.25,000 కోట్లు కేటాయించడం అనేది చాలా గొప్ప విషయం.

ఒక రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వ్యవసాయంతో పాటు పారిశ్రామిక అభివృద్ధి కూడా చాలా ముఖ్యం. పారిశ్రామిక వార్షిక సర్వే (ఎఎస్ఐ) ఇచ్చినటువంటి రిపోర్టు ప్రకారం చిన్న తరహా పరిశ్రమలు 2014 జూన్ నెలలో మన రాష్ట్రం ఏర్పడిన తరువాత ఉత్పత్తులను మొదలు పెట్టిన యూనిట్లు మొత్తం 13,671. వీటి ద్వారా రూ.7,130 కోట్ల పెట్టుబడులు ఈ రాష్ట్రానికి రావడంతో పాటు 1,45,512 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి.

అదే విధంగా టిఎస్-ఐపాస్ అనే ఒక మంచి పథకాన్ని ఈ రాష్ట్రం తీసుకురావడం జరిగింది. 25.01.2018 నాటికి మొత్తం 6,117 పరిశ్రమలను టిఎస్-ఐపాస్ పథకం క్రింద ప్రారంభించడం జరిగింది. ఈ పథకం ద్వారా రూ.1,18,041 కోట్ల పెట్టుబడులు ఈ రాష్ట్రానికి రావడంతోపాటు 4,42,962 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. ఈ విధంగా ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న ప్రజలకు ప్రభుత్వం పట్ల ఒక నమ్మకం, విశ్వాసాన్ని కలిగిస్తూ, లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పిస్తోంది.

అటు వ్యవసాయ రంగాన్ని, ఇటు సబ్బండ వర్గాలకు సంబంధించిన కుల వృత్తులను ప్రోత్సహించడం, అలాగే రాష్ట్రానికి సంబంధించిన ఆస్తులను నిర్మించుకోవడం జరుగుతోంది. ఈ విధంగా తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన ప్రజలు సమగ్రమైన అభివృద్ధి పట్ల ఏవిధంగానైతే సుదీర్ఘంగా కలలు కంటూ వస్తున్నారో, ఆ కలలు సాకారం కావాలని ఈ రోజు రాష్ట్రం వేగవంతంగా ముందుకు పోతున్నది. శ్రీ కెసిఆర్ గారి నాయకత్వంలో ఈ రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను రూపొందించి, అన్ని రంగాలలో అభివృద్ధిని సాధించడం పట్ల ప్రజలు సంపూర్ణమైన విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు.

**1.40 మ.** గతంలో ఏ గ్రామానికి వెళ్లినా రేషన్ కార్డులు ఇవ్వమని ప్రజలు అడిగేవారు. కానీ నేడు ప్రజా ప్రతినిధులైన మమ్మల్ని ఎవరూ అడగడం లేదు. ఒకవేళ అడిగినా మేము రాసి ఇస్తే ఎం.ఆర్.ఓ.లు వెంటనే కార్డులను జారీ చేస్తున్న పరిస్థితులు నేడు కనబడుతున్నాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయడంలో, రాష్ట్రంలో ఉన్నటువంటి అన్ని వర్గాల ప్రజల సంక్షేమ కార్యక్రమాలు కావచ్చు, అటు రాష్ట్రానికి సంబంధించినటువంటి అభివృద్ధి కార్యక్రమాలు కావచ్చు ఒక సమగ్ర అభివృద్ధి ఈ రోజు రాష్ట్రంలో కొనసాగుతుందని చెప్పడానికి ఎటువంటి సందేహం లేదు. ఈ బడ్జెట్ కూడా అన్ని వర్గాలను, అన్ని రంగాలను దృష్టిలో పెట్టుకొని తయారు చేయడం జరిగిందని చెప్పవచ్చు. తెలంగాణ రాష్ట్రం అప్పుల రాష్ట్రంగా మారుతున్నదనే భావన ప్రతిపక్షాల వారు ప్రజల మనసులో కలిగించాలనే ప్రయత్నం చేస్తున్నారు. ఈ సభ ద్వారా అందరికీ నేను తెలియజేసేది ఏమంటే అప్పు తీసుకొచ్చే ప్రతి రూపాయి కూడా రాష్ట్ర అభివృద్ధి కోసం ఖర్చు

చేయబడుతుందని తెలియజేస్తున్నాను. ప్రతి పక్షాల వారు చెప్పే కల్లబొల్లి కబుర్లను ప్రజలు నమ్మవద్దని తెలియజేస్తూ నాకు మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు మరొకసారి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

**శ్రీ సబావత్ రాములు నాయక్:-** అధ్యక్షా, బడ్జెట్ ప్రసంగంపై మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు తమకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. నా చిన్నప్పుడు అగ్రవర్ణాలవారు మాత్రమే బడ్జెట్‌ను ప్రవేశపెట్టేవారు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత శాసన సభలో శ్రీ ఈటల రాజేందర్ గారు, శాసన మండలిలో ఒక దళిత బిడ్డ నాలుగు సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల యొక్క అదృష్టంగా భావిస్తున్నాను.

ఇప్పటి వరకు అనేక మంది వక్తలు బడ్జెట్‌పై మాట్లాడటం జరిగింది. సభ్యులు శ్రీ బోడకుంటి వెంకటేశ్వర్లు గారు అన్ని రంగాల గురించి క్లుప్తంగా మాట్లాడటం జరిగింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల బడ్జెట్ ఇది. మా చిన్నప్పుడు వార్తా పత్రికలలో అంకెలు కనిపించేవి కానీ, అభివృద్ధి ఎక్కడా కనిపించేది కాదు. దేశంలో దాదాపు 70 శాతం ప్రజలు వ్యవసాయం మీదనే ఆధారపడి జీవించేవారు, కాని గత ప్రభుత్వాల కాలంలో రైతుల సంక్షేమం గురించి పట్టించుకోలేదు. ఎన్నికల సమయంలో మాత్రం రైతులు గుర్తుకొచ్చి వారికి సబ్సిడీలు లేదా రైతులను ఆకర్షించే విధంగా పథకాలను ప్రారంభించి ఓట్లు వేసేలా ప్రయత్నాలు చేసేవారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఓటు వేసిన రైతులను మర్చిపోయే పరిస్థితులు గత సమైఖ్య పాలనలో ఉండేవి.

2001 నుండి 2013 వరకు ఆనాటి ఉద్యమ నాయకుడు, ఈనాటి గౌరవ ముఖ్యమంత్రిగారు 2009 నుండి 2012 వరకు ఎక్కడున్నారని మమ్మల్ని అడిగితే కరెంటు గురించి సబ్‌స్టేషన్ దగ్గర ధర్నా చేస్తున్నామని చెప్పేవారం. ఇంకొక సారి అడిగితే నేషనల్ హైవే పైన కరెంట్ గురించి రాస్తా రోకో చేస్తున్నామని చెప్పేవాళ్లం. అప్పటి సమైఖ్య పాలకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వస్తే తెలంగాణ అంతా చీకటి ఉంటది అని మమ్మల్ని అయోమయానికి గురి చేసేవారు.

సమైఖ్య రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు రూ.10కోట్లు, ఎస్సీలకు రూ.2కోట్లు, ఎస్టీలకు రూ.1.00కోటి కేటాయించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత టిఆర్ఎస్ ప్రభుత్వం ఈనాడు ఎస్టీలకు రూ.8,064 కోట్లు, బీసీ, మైనార్టీలకు రూ.2,000కోట్లను కేటాయించడం జరిగింది.

మా తాతగారు పెద్ద కాంట్రాక్టర్. హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయాన్ని కట్టడంలో మా తాతగారు పాలు పంచుకున్నారు. ఆల్విన్ ఫ్యాక్టరీని, హెచ్ఎంటీ కంపెనీ మొదలగు ప్రముఖ సంస్థల కాంట్రాక్టులను చేశారు. కానీ 20 సంవత్సరాలలో మేము ఎప్పుడూ కూడా ఫ్లైట్ ఎక్కలేదు. కానీ తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత జాతీయ స్థాయి విమానాలలో తిరిగే స్థాయికి ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు ఎదిగారని తెలియజేస్తున్నాను.

"బేటీ బచావ్, బేటీ పడావ్" అనేది కేంద్రప్రభుత్వం యొక్క మంచి నినాదం. కాని తెలంగాణ 29వ రాష్ట్రం ఏర్పడిన తరువాత కూడా గిరిజనులను "బేటీ పైదాకరో, బేటీకో బచావ్" అనే పరిస్థితిలోనే ఉన్నారు. ఈనాడు ఉత్తరాంచల్, ఛత్తీస్‌ఘడ్, ఝార్ఖాండ్ మొదలగు ప్రాంతాలకు సంబంధించిన గిరిజనులు వందకు వంద శాతం భారతీయ జనతా పార్టీలో ఎంపీలుగా గెలిచినప్పటికీ బడ్జెట్‌పై ప్రసంగించడం లేదు.

నా చిన్నప్పుడు నేను ట్రాక్టర్ నడిపేవాడిని మరియు డ్రైవర్‌గా పనిచేశాను. మా ఇంటి ముందు ట్రాక్టర్ ఉంటే బాగుండేదని అనుకునేవాడిని. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఇండ్ల ముందు ట్రాక్టర్లు ఉన్నాయంటే దానికి కారణం గౌరవ ముఖ్యమంత్రిగారి ఘనత అని సభాముఖంగా నేను తెలియజేస్తున్నాను.

నేను నీలోఫర్ ఆసుపత్రిలో పుట్టానని, ఆ ఆసుపత్రిలో చిన్న తెల్లని గుడ్డ ముక్కలో పుట్టిన పిల్లల్ని చుట్టేవారని మా అమ్మ చెప్పేది. త్రాగడానికి నీరు లేక బోరింగుల దగ్గరికి వెళ్లి త్రాగే పరిస్థితులుండేవి. కాని ఈనాడు ప్రసవం తరువాత జాన్సన్ బేబీ పౌడర్, సబ్బు, షాంపు వంటి 16 వస్తువులతో కూడిన 'కేసిఆర్ కిట్' ను బాలింతలకు అందజేయడం జరుగుతోంది.

సమైఖ్య రాష్ట్రంలో 'నేను రానో బిడ్డా సర్కారు దవాఖానకు' అనే పరిస్థితులు ఉండేవి. కానీ తెలంగాణ రాష్ట్రం వచ్చిన ఈ 45 నెలల కాలంలో 'నేను వస్తా బిడ్డా సర్కారు దవాఖానకు' అనే పరిస్థితులు ఉన్నాయి. గత ప్రభుత్వాల కాలంలో ప్రభుత్వ ఆసుపత్రులలో సిజేరియన్లు ఎక్కువగా జరిగేవి. నార్మల్ డెలివరీలు చేసే వారు కాదు. కాని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రభుత్వ ఆసుపత్రులలో 95 శాతం నార్మల్ డెలివరీలను చేస్తున్నారు.

గత ప్రభుత్వాల కాలంలో ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే తండాల ప్రజలు గుర్తుకొచ్చేవారు. ఎన్నికల అనంతరం

గ్రామానికి తండాలు దూరమవుతుండేవి. అందువల్ల తండాలు అభివృద్ధి జరిగేది కాదు. తండాలను, గిరిజన గూడెలను గ్రామపంచాయితీలుగా చేసిన ఘనత టిఆర్ఎస్ ప్రభుత్వానిదని తెలియజేస్తున్నాను.

గత ప్రభుత్వాల కాలంలో బక్రీద్, బోనాలు, రంజాన్, దసరా వంటి పండుగలు వచ్చినప్పుడు పాత బస్తీలో 144 సెక్షన్ అమలు చేసి పండుగలు జరుపుకొనే పరిస్థితులు ఉండేవి. టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత శాంతి, భద్రతలను కాపాడుకుంటూ అన్ని పండుగలను, అన్ని మతాల వారు శాంతి యుత వాతావరణంలో జరుపుకుంటున్నాము.

నేను ఎస్సీ, ఎస్టీ హాస్టల్స్‌లో చదువుకున్నాను. అప్పట్లో మాకు బీసీ హాస్టల్స్‌లో సీట్లు ఇచ్చేవారు కాదు. ఆ హాస్టల్స్‌లో భోజనం తినడం వలన మా పెదవులు పగిలేవి. మా వేళ్లకు గజ్జి వచ్చేది. ఈ విద్యార్థి ఎస్టీ హాస్టల్‌లో ఉంటాడని అది చూసి మమ్మల్ని గుర్తుపట్టేవారు. కానీ నేడు హాస్టల్స్‌లో చదువుకుంటున్న వారికి సన్నబియ్యంతో తయారు చేసిన భోజనం పెట్టడమే కాకుండా గురుకుల పాఠశాలలో ఇంగ్లీష్ మీడియంలో విద్యాభ్యాసం అందుబాటులో ఉంచడం వలన ఎవరు ఎక్కడ చదువుతున్నారు, వారిది ఏ కులం అని తెలియకుండా అన్ని సౌకర్యాలు కల్పించిన ఘనత మన గౌరవ ముఖ్యమంత్రిగారిదని తెలియజేస్తున్నాను.

గతం ప్రభుత్వాల కాలంలో పండగలు వస్తే మా గూడేనికి పటేల్స్ వచ్చి గొర్రెలను కోయించి తెమ్మని చెప్పేవారు. వారికి గొర్రెలను కోయమనడం, తినడం తప్ప గొర్రెలను పెంచమని చెప్పడం తెలియదు. ఈనాడు తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత వెనుకబడిన తరుగతులకు చెందిన వారు ఆర్థికంగా బాగుండాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రిగారు గొర్రెలను పెంచమని చెప్పి బీసీ, యాదవులు, కురుమలకు, అనేక పథకాలను ప్రవేశపెట్టడం జరిగింది. వచ్చే బక్రీద్ పండుగ వరకు రూ.500/- లుగా ఉన్న మటన్ రూ.800/- వరకు పెరుగుతుందని మరియు ఎగుమతులు కూడా పెరుగుతాయని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. గంగపుత్రులను వెళ్లి కొర్రమీను పట్టుకురా అని అనేవాళ్లే తప్ప చేపలను పెంచమని, దాని ద్వారా ఆర్థికంగా బాగుపడమని గత ప్రభుత్వాల కాలంలో చెప్పలేదు. ఏ చెరువులో ఏ చేప దొరుకుతుంది, ఏ చేపలు ఎక్కడ మంచివి ఉంటాయి, నాయక్ వెళ్లి జొన్న రొట్టెలు తీసుకురా అనే పరిస్థితులు గత ప్రభుత్వాల కాలంలో ఉండేవి. గంగ పుత్రులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఆలోచనలను చేయలేదు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గంగ పుత్రులకు అనేక రకాలుగా ఆర్థికంగా సహాయం చేస్తోంది.

తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత ఎస్సీ, ఎస్టీ రైతులకు పాలీ, గ్రీన్ హౌజ్‌లకు 95 శాతం సబ్సిడీ ఇచ్చిన ఘనత గౌరవ ముఖ్యమంత్రిగారిదేనని తెలియజేస్తున్నాను. అదే విధంగా మైనార్టీ సంక్షేమానికి వస్తే..,

ڈبل روٹی بیچو نہیں تو پنکچر کی دوکان پر کام کرو نہیں تو لاری پر کلینری کا کام کرو نہیں تو کچھا اور کرو موز بیچو میوہ بیچو نہیں تو بنڈی ہانکو۔

అనే విధంగా ఉండేది. గతంలో బీద మైనార్టీ పిల్లలు మసీద్‌లకు వెళ్లి చదువుకునేవారు తప్ప బడికి వెళ్లి చదువుకునే పరిస్థితులు ఉండేవి కావు. కానీ తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత మైనార్టీ వర్గాల వారికి రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభించిన తరువాత చదువులో మైనార్టీలు మంచి ఫలితాలను సాధిస్తున్నారు.

పనిచేసే ప్రభుత్వం పనిచేసే మాటలే చెప్పాలి. మన ముఖ్యమంత్రిగారు మాటలు చెప్పే ముఖ్యమంత్రి కాదు అధ్యక్షా, పనిచేసే ముఖ్యమంత్రిగారని తెలియజేస్తున్నాను. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉద్యోగుల, జర్నలిస్టుల, హోం గార్డుల, ఆశా వర్కర్ల, అంగన్‌వాడీ టీచర్స్ యొక్క సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. అంగన్‌వాడీ టీచర్స్ జీతాలను పెంచమంటే గుర్రాలతో తొక్కించిన ఘనత సమైఖ్య రాష్ట్రాలదేనని చెప్పవచ్చు. కాని ఈనాడు అంగన్‌వాడీ టీచర్స్, మున్సిపల్ కార్మికులు, అసంఘటిత కార్మికులకు వేతనాలను పెంచిన వారు గౌరవ ముఖ్యమంత్రిగారేనని తెలియజేస్తున్నాను.

పెండ్లికైనా, సత్యనారాయణ స్వామి కథ చెప్పించుకోవాలన్నా బ్రాహ్మణులు గుర్తుకొచ్చేవారు. మంచి ముహూర్తం పెట్టాలంటే సభ్యులు శ్రీ పురాణం సతీష్ కుమార్‌గారు, శ్రీ ఎస్. రామచంద్రరావుగారు లాంటి వారు గుర్తుకొచ్చేవారు. అటువంటి ప్రాముఖ్యత కలిగిన బ్రాహ్మణుల గురించి గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బ్రాహ్మణుల సంక్షేమం కోసం రూ. 72 కోట్లను కేటాయించిన ఘనత మన గౌరవ ముఖ్యమంత్రిగారిదేనని తెలియజేస్తున్నాను.

**2.00 మ.** ఈ బడ్జెట్ దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాల కంటే నెంబర్ వన్‌గా ఉందని తెలియజేసుకుంటున్నాను. దీనికి వందకు వంద మార్కులు వచ్చే బడ్జెట్‌గా, దేశంలో ఉన్న 28

రాష్ట్రాలు ఈ బడ్జెట్‌ను చూసి వారి, వారి రాష్ట్రాలలో అమలు చేసుకునే విధంగా తయారు చేయబడిన బడ్జెట్ అని మనవి చేసుకుంటున్నాను.

కళ్యాణ లక్ష్మి పథకం గురించి ఒక మాట చెప్పాలి. ఆనాడు మన ముఖ్యమంత్రిగారు ఉద్యమ నాయకుడుగా ములుగు ప్రాంతంలో తిరుగుతూ ఉంటే, అక్కడ అగ్ని ప్రమాదం జరిగి బడియా నాయక్ తండా కాలిపోయింది. అప్పుడు మన కెసిఆర్‌గారు 'తమ్మీ ఏం జరిగింది, ఇక్కడ పెళ్లిళ్లు ఎందుకు ఆగిపోయాయని' నన్ను అడిగితే వాళ్లు పెళ్లి కొరకు పెట్టెలో పెట్టిన నలభై వేల రూపాయలు దాచుకున్నారు. అగ్ని ప్రమాదం వలన ఆ ఇంటితో పాటు, నలభై వేల రూపాయలు కూడా కాలిపోయాయని అప్పుడు చెప్పాను. వారు ఆశ్చర్యపోయి ఇరవై వేలు, నలభై వేల రూపాయలతో పెళ్లిళ్లు జరుగుతాయా అని అడిగారు. దేవరకొండ వంటి ప్రాంతాలలో ఇరవై వేలతో పెళ్లిళ్లు జరుగుతాయని చెప్పాను. అప్పుడే వారి మనసులో ఈ కళ్యాణ లక్ష్మి గురించి ఆలోచన వచ్చింది.

ఇంతకుముందు ప్రభుత్వం రూ.75,116/- ఆడపిల్ల పెళ్లికి సహాయంగా ఇచ్చేవారు. కాని ఈ రోజే ప్రభుత్వం సంతోషకరమైన వార్త ప్రకటించింది. ఆ మొత్తాన్ని రూ.1,00,116/- కి పెంచిందని. అలాగే అంబేద్కర్ విదేశీ విద్యానిధిపథకం క్రింద ఎస్సీ, ఎస్టీ పిల్లలకు గతంలో పది లక్షల రూపాయల సహాయం అందించే వారు. ఆ డబ్బులు సరిపోవడం లేదని యూనివర్శిటీ నుండి ప్రభుత్వానికి ఉత్తరాలు రాసేవారు. ఈ విషయం ముఖ్యమంత్రిగారి దృష్టికి తీసుకువచ్చిన వెంటనే ఆ పరిమితిని పది లక్షల నుండి ఇరవై లక్షల రూపాయలకు పెంచడం జరిగింది. ఈ విధంగా ఇరవై లక్షల రూపాయలు కేవలం ఎస్సీ, ఎస్టీల పిల్లలకే కాదు, బిసి మరియు మైనారిటీ పిల్లలకు కూడా ముఖ్యమంత్రిగారు పెద్ద మనసుతో వర్తింపజేయడం చాలా సంతోషకరం. భారతదేశంలో ఈ విధంగా చేసిన ప్రభుత్వం మన తెలంగాణ ప్రభుత్వమేనని మనవి చేసుకుంటున్నాను.

ఈ బడ్జెట్‌లో దళితుల సంక్షేమం కొరకు ఎక్కువ నిధులు కేటాయించడం జరిగింది. గతంలో లంబాడీ వాళ్లని పొగుడుతూ సినిమాలలో పాటలు పెట్టేవారు. ఆ ప్రభుత్వాలు వారి నృత్యాలను ఉపయోగించుకున్నాయి. బిల్ క్లింటన్ వస్తే, ప్రపంచ బ్యాంకు ఛైర్మన్ వస్తే లంబాడీల నృత్యాలు, వాళ్ల డప్పులు, వాళ్ల సంస్కృతి కావాలిగాని, లంబాడీల సంక్షేమం గురించి ఇప్పటి వరకు ఎవ్వరూ పట్టించుకోలేదు. కాని ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత ఎటువంటి సంక్షేమ పథకాలు అమలవుతున్నాయో మనకు తెలుసు.

ఎస్సీలు గతంలో ఊరికి దూరంగా, గుడిసెల్లో ఉండేవారు. కాని ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత వారికి డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించడం జరుగుతున్నది. మా చిన్నప్పుడు ఇంటికి ఎవరన్నా చుట్టాలు వస్తే లోపల జాగా లేక, ఇంటి బయట అరుగు మీద పడుకునే వాళ్లం. లేకుంటే వాకిలిలో చాప వేసుకుని, క్రిందనే పడుకునే వాళ్లం. మొన్న మనం కాళేశ్వరం ప్రాజెక్టు విజిట్‌కి వెళ్లినప్పుడు అక్కడ డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించాము. భారతదేశంలో ఎక్కడా లేని విధంగా ఎంతో బ్రహ్మాండంగా ఇళ్ల నిర్మాణం జరుగుతున్నది. ఎక్కడా ఇటువంటి స్కీమ్ లేదు.

**మిస్టర్ ఛైర్మన్:-** త్వరగా ముగించండి. ఇప్పటికి ఇరవై నిమిషాలయింది.

**శ్రీ సబావత్ రాములు నాయక్:-** అధ్యక్షా, మాకు ఛైర్ మీద గౌరవం ఉంది. మన ప్రభుత్వం చేసే మంచి పనుల గురించి చెప్పాలని ఉంది.

గతంలో దళితులను నా పొలంలో పని చేయడానికి వస్తావా, నా పొలంలో నాట్లు వేయడానికి వస్తావా, లేకుంటే పొలంలో ట్రాక్టర్‌తో దున్నుతావా అని భూస్వాములు అడిగేవాళ్లు. కాని ఈ రోజు ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత దళితులకు మూడు ఎకరాల భూమి పథకం క్రింద, పన్నెండు వేల ఎకరాల భూమిని ఇప్పించడం జరిగింది. ఆ పథకం ఇంకా కొనసాగుతున్నది. దళితుల దగ్గర నుండి ఒక్క పైసా తీసుకోకుండా ఈ సంక్షేమ పథకం అమలు చేస్తున్న ఈ ప్రభుత్వం నిజంగా అభినందనీయం. వారికి ట్రాక్టర్లు, నాట్లు వేసే పనిముట్లు మొత్తం కోటి రూపాయలతో అవసరమైన పరికరాలను యాభై శాతం సబ్సిడీతో ఇచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

అదే విధంగా గతంలో చెట్లు నరకడమే తప్ప, వాటిని పెంచి, పోషించినది లేదు. మన అటవీ శాఖ మంత్రిగారి ఆధ్వర్యంలో జరిగిన హరిత హారం కార్యక్రమం వలన నేడు ఏ ఊరికి వెళ్లినా, ఏ గ్రామంలో చూసినా అంతా పచ్చదనమే కనబడుతున్నది.

గ్రామ పంచాయతీలు గానివ్వండి, వెనుకబడిన తరగతులు లేదా మైనారిటీల సంక్షేమం తీసుకున్నా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా మైనారిటీలలో ఖురేషీలు అని ఒక తెగ వారు ఉంటారు. వాళ్ల వృత్తి ఏమిటంటే

ఎక్కడ విందు జరిగినా వంద యాటలను కోసి, మనకు ఎప్పుడు కావాలంటే అప్పుడు, మనం కోరిన సమయానికి అందజేస్తారు. వాళ్లు మాంసం కట్ చేసే విషయంలో ప్రభుత్వం సహాయం అందించాలి. కల్లు గీత కార్మికుడు ఏ విధంగానైతే కల్లు గీస్తాడో, చేపలు పట్టే ముదిరాజ్ ఏ విధంగానైతే చేపలు పడతాడో, రజకులు ఏ విధంగానైతే బట్టలు ఉతుకుతారో అదే విధంగా తమ వృత్తి పనులు చేసుకునే ఈ మైనారిటీ తెగకు చెందిన ఖురేషీలకు గ్లోబల్ టెండర్‌లు లేకుండా, వారికే తమ కుల వృత్తిని చేసుకునే వెసులుబాటు కల్పించినట్లయితే వారు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి అవకాశం ఉంటుందని తమరి ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసుకుంటున్నాను.

ఆఖరిగా ఇది చాలా మంచి బడ్జెటని తెలియ జేసుకుంటూ, భారతదేశంలో నూటికి నూరు మార్కులు పొందిన ఉత్తమ బడ్జెట్‌గా భావిస్తూ, నాకు ఈ అవకాశం కల్పించినందుకు మరొకసారి కృతజ్ఞతలు తెలుపుకుంటూ, సెలవు తీసుకుంటున్నాను.

**మిస్టర్ ఛైర్మన్:-** ధన్యవాదాలు. ఛైర్‌నుంచి గౌరవ మంత్రులకు ఒక విన్నపం. ఈ హౌస్‌కు ఆయా రోజులలో కేటాయించ బడిన మంత్రులు సభ అయిపోయే వరకు సభలో ఉండడానికి ప్రయత్నం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను. (గౌరవ అటవీ శాఖామాత్యులనుద్దేశించి) దీనిని నా మాటగా కౌన్సిల్ ఆఫ్ మినిస్టర్స్‌కి తెలియజేయండి.

అదే విధంగా సభ్యులందరూ కూడా సమయానికి హాజరయ్యేటట్లు చూడాలని చీఫ్ విప్ మరియు విప్‌గారిని కోరుతున్నాను. ఇక్కడ జరిగే విషయాలను ప్రజలందరూ గమనిస్తుంటారు. దయచేసి ఈ విషయాలను పరిగణనలోకి తీసుకోవలసిందిగా సభలో ఉన్న అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను.

మార్చి 20, 2018 మంగళవారం ఉదయం పది గంటలకు తిరిగి సమావేశమయ్యేందుకు సభను వాయిదా వేయడమైనది.

(The House then adjourned at 2.09 p.m. to meet again at 10.00 a.m. on 20th March, 2018)

* * *

**"Published under Rule 316 of the Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Council and Printed at the Assembly Press, Public Gardens, Hyderabad."**